సెప్టెంబర్ - 2016

DECCAN LAND, HYDERABAD

49

₹ 20

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక





## ఐదో వసంతంలోకి దక్కన్‌ల్యాండ్



- తెలంగాణ సాహిత్య చరిత్ర
- చెక్క బొమ్మలాట
- పెంబర్తి హస్తకళారూపాలు
- ఆనాటి 'నా గొడవ'





Artist: **T.Gangadhar**

చిత్రకళ, శిల్పం తదితరాల్లో
తనదైన ప్రతిభను చాటుకుని
'తెలంగాణ తల్లి రూపకర్త'గా
కేసీఆర్ నుంచి సన్మానం పొందిన
ఆర్టిస్ట్ మన తోపారపు గంగాధర్.
తెలంగాణ చరిత్రలో
చిరస్థాయి నిలిచిపోయే
ఘనతను ఆయన సాధించారు.

ప్రత్యేక కథనం: 37, 38వ పేజీల్లో




























## నడకలో వయ్యారంతో పల్లెపడుచు

తెలంగాణ అంటే గుర్తుకు వచ్చేది అమాయకత్వం తాండవించే పల్లెవాసులే. ఆ అమాయకత్వాన్ని చిత్రాల్లో ప్రతిబింబించే చిత్రకారులెందరో తెలంగాణలో ఉన్నారు. చిత్రకళతోపాటు అనుబంధ కళారంగాల్లోను వారు తమదైన శైలితో ముందుకు సాగుతున్నారు. అలాంటి చిత్రకారుల్లో ఒకరిగా వుంటూ జీవన సాఫల్య పురస్కారం తరహాలో తెలంగాణ చరిత్రలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్న గంగాధర్ వేసిన చిత్రం ఈ మాసపు ముఖచిత్రం.

TRC
TELANGANA
RESOURCE CENTRE

"**CHANDRAM**" 490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: deccanlandindia@gmail.com   website : www.deccanland.com







## పాఠ్యపుస్తకాల తీరుపై పెరిగిన అవగాహన

పాఠశాల స్థాయిలో పాఠ్యపుస్తకాల రూపకల్పన ఏవిధంగా ఉంటుంది, ఆయా అంశాలను ఎలా ఎంచుకుంటారు, వాటికి ఏ విధమైన ప్రాధాన్యం ఉంటుంది, వాటిని ఎంచుకోవడంలో తీసుకునే జాగ్రత్తలు, పిల్లల శక్తిసామర్థ్యాలను పెంచే విధానం లాంటి అంశాలను తెలుసుకోవడంలో బి.ఎస్.రాములు అందిస్తున్న వ్యాసాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. పాఠ్యపుస్తకాల రూపకల్పన తీరుతెన్నులను ఇంత నిశితంగా పరిశీలించి అందిస్తున్న రచయితకు, ప్రచురిస్తున్న 'దక్కన్‌ల్యాండ్' పత్రికకు అభినందనలు.

**-యామసాని కుమారస్వామి, ఖమ్మం**

## కొత్త జిల్లాలపై దృష్టి సారించాలి

తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటవుతున్న నేపథ్యంలో సమాజంలో ఆయా రంగాల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ఆ మార్పులను విశ్లేషిస్తూ ఇంకా ఆయా జిల్లాల్లో ఎటువంటి అభివృద్ధి అవసరం అనే అంశంపై ప్రత్యేక కథనాలను ప్రచురించాలి. ప్రజలకు పాలన చేరువ అవుతున్న క్రమంలో అది నిజం అయ్యేలా మార్గనిర్దేశనం ఉండాలి. ఆ బాధ్యతను సైతం దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక స్వీకరించగలదని ఆశిస్తున్నాం. కొత్త, పాత జిల్లాలపై ప్రత్యేక కథనాలను అందించాలని కోరుకుంటున్నాం.

**-అనంతశయనం, మహబూబ్‌నగర్**

## తెలంగాణ గుభాళింపులు

వంటకాల్లో షడ్రుచులు ఉంటాయంటారు. ప్రతి రుచిలోనూ తెలంగాణ గుభాళిస్తే ఆ వంటకం తీరే వేరు. ఇన్నేళ్ళుగా అలాంటి వంటకాలకు దూరమైన భోజనప్రియులకు తెలంగాణ గుభాళింపులతో విందు జరిగితే ఎంత బాగుంటుంది. అదే విధంగా తెలంగాణ సాహిత్యం, సంస్కృతి, వారసత్వం... ఇలా ఎంచుకునే ప్రతీ అంశంలోనూ తెలంగాణ సోయితో మాసపత్రికను తీసుకువస్తున్నందుకు అభినందనలు.

**- కె. రవి, కరీంనగర్**

## మనం మర్చిపోయిన ఆటపాటలు

జానపద కళారూపాల గురించి ప్రచురిస్తున్న వ్యాసాలు బాగుంటున్నాయి. మరుగున పడిపోతున్న ఆటపాటల గురించి కూడా వివరిస్తే బాగుంటుంది. ఒక తరం కిందటి వారు ఆడుకున్న ఆటలే నేడు కనుమరుగవుతున్నాయి. అదే విధంగా ఒక తరం కిందటి మహిళలు, ప్రజలు పాడుకున్న పాటలు కూడా అంతర్ధానమవుతున్నాయి. అలాంటి ఆటపాటల్లోనూ ఎంతో చరిత్ర, సంస్కృతి పరమైన అంశాలు దాగిఉండే అవకాశం ఉంది. వీలును బట్టి వాటిపై కూడా ప్రత్యేక వ్యాసాలు అందిస్తారని ఆశిస్తున్నాం.

**-పి.నవీన్, వరంగల్**

మీ లేఖలను E-mail: deccanlandindia@gmail.comకు పంపించవచ్చు

## తెలుగుకు ప్రాచీన హోదా....

మద్రాసు హైకోర్టు నిర్ణయ పూర్తి పాఠాన్ని ఒక దిన పత్రికలో చదివాను. మన తెలంగాణ ప్రభుత్వం కూడా తగినంతగా తెలుగుకు ప్రాచీన హోదాకొరకు కొట్లాడిందని తెలిసి ఎంతగానో సంతోషించాను. వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివెయ్యడానికి పంపనను, పాల్కురికి వారి పద్యాలను మన అడ్వొకేట్లు ఉదహరించారని తెలిసి మరింత సంతోషం కలిగింది. ఈ సందర్భంలో 1980 ప్రాంతంలో ఇదే మద్రాసులో మూడు రోజులు జరిగిన ఆల్‌ఇండియా పొలిటికల్‌సైన్స్ అసోసియేషన్ కాన్ఫరెన్సు గుర్తుకొచ్చింది. మధ్యాహ్నభోజనానికి ఆ సమావేశాలకు హాజరైన సభ్యులమంతా సమావేశపు ఆడిటోరియం నుండి భోజనశాలకు సుమారు ఒక కిలోమీటర్ నడవాల్సి ఉండేది. అట్లనడిచే క్రమంలో తెలుగు తెలిసిన ఒక తమిళియన్‌తో పరిచయమైంది. మీ తెలుగు ఎంత గొప్పదనుకున్నారు? అంటూ తెలుగుభాష ప్రాశస్త్యాన్ని వర్ణిస్తూ, అతను మన తెలుగును ఎంతపొగిడినాడో వర్ణించలేను. ఆ క్షణంలో నేను తెలుగువానిగా పుట్టినందుకు గర్వంగా అనిపించింది. అతడు మాట్లాడింది ఏదో నన్ను మచ్చిక చేసుకోవటానికి మాట్లాడిన మాటలు కాదు. అతనివి ఉత్త మాటలు, పొగడ్తలు కాదు. తనకు కంఠస్థమైన ఎన్నో పద్యాలను ప్రాచీన, నవీన సాహిత్యం లోనివి శ్రావ్యంగా, ఇంపుగా చదివి వినిపించాడు.అతనితో పరిచయం నాకు తెలుగుపైనున్న ఆత్మ విశ్వాసాన్ని ఇనుమడిమజేసింది. ఎందుకు నేను నా ఎమ్మే డిగ్రీని తెలుగులో చెయ్యకపోతినా అని అనిపించింది.

ఇదే సందర్భంగా నాకు మరొక కవి,ఇప్పటికీ జీవించియున్న ఒక పద్యకవి గుర్తుకొస్తున్నాడు. అతని పేరు వెలపాటి రామారెడ్డి. ఆయన వరంగల్‌లో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేసి రిటైరయ్యిండు. రిటైరైనంక అక్కడనే ఉంటున్నానని ఒకసారి మూడేండ్లకిందట హైదరాబాదులో కలిసినప్పుడు చెప్పిండు. ఆయన అప్పట్లో రాసిన ఆ పద్యాలన్నీ నడుస్తున్న తెలంగాణ పోరాటంపైన, తెలంగాణ చరిత్రపైన ఉండి రాగయుక్తంగా కూడా ఉండేవి. ఆయన 'నా తెలంగాణ' వారపత్రికకు ఆ పద్యాలను పంపిండు. వాటిని నేను మొదటిసారిగా ఆపత్రికలో చూడటం జరిగింది.ఎన్నో పద్యాలు ఇతర అంశాలపైన కూడా రాసినట్లు చెప్పిండు.అందుకు వారిని మన తెలంగాణ సమాజం సన్మానించడం మంచిదని అప్పట్లోనే అనిపించింది, ఇప్పుడు మరోసారి నాకు గుర్తొచ్చింది. ఇలాంటి వారిని ఏదో ఒక సందర్భంగా మన తెలంగాణ ప్రభుత్వం సన్మానిస్తే సమంజసంగా ఉంటుంది. తెలంగాణ తొలి విడత పోరాటంలో పాల్గొన్న వారిని గుర్తించి గౌరవించుకోవడం మన బాధ్యత.

**-చందా రాములు,**
విశ్రాంత అధ్యాపకులు, అధ్యక్షులు,
తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్
హైదరాబాద్

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 5  సంచిక : 1  పేజీలు : 68

సెప్టెంబర్ - 2016


# లోపలి పేజీల్లో...





మహా జలమైత్రి ........ దక్కన్ న్యూస్ ........ 8

తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం ........ సుంకిరెడ్డి నారాయణరెడ్డి ........ 9

తెలుగు వాచకాల విశిష్టత ........ బి.ఎస్.రాములు ........ 13

చెత్త తగ్గితేనే నగరానికి మేలు ........ ఆదిత్య ........ 17

పోరాట గద్దెలు 'గిద్దె రామనర్సయ్య' పాటలు ........ అంబటి వేకువ ........ 19

పెంబర్తి మెమెంటోలు ........ వెంకట్ ........ 23

జనజాతరల్లో క్లిక్.. క్లిక్.. ........ రాజేష్ ........ 27

భారతీయ సంగీత హిమశిఖరం ........ హెచ్.రమేష్ బాబు ........ 29

ఆనాటి నా గొడవ ........ స్వర్ణ ప్రభ ........ 32

తెలంగాణ తల్లి రూపకర్త ........ శ్రీనాథ్ ........ 37

బొమ్మలమ్మగుట్ట శాసనం! ........ సంకేపల్లి నాగేంద్రశర్మ ........ 39

పబ్లిక్ డిమాండ్ ........ దక్కన్ న్యూస్ ........ 42

తృప్తి ........ బాలచెలిమి ........ 46

తక్కువ ఖర్చుతో చీడపీడల నివారణ ........ శ్రీరమ్య ........ 47

చెక్క బొమ్మలాట ........ డా॥చూరేపల్లి రవికుమార్ ........ 48

హైదరాబాద్ ఫైర్‌బ్రాండ్ ........ సంగిశెట్టి శ్రీనివాస్ ........ 51

మన జుబేదాబేగం ........ హెచ్.రమేష్‌బాబు ........ 53

పుస్తక సమీక్ష ........ నాగిళ్ళ రమేష్ ........ 55

పుస్తకం ........ దక్కన్ న్యూస్ ........ 58



సంపాదకులు

**యం. వేదకుమార్**

అసోసియేట్ ఎడిటర్

**ఎన్. వంశీ మోహన్**

సెల్ : 9848902520

లే అవుట్ & కంపోజింగ్

**చరిత ఇంప్రెషన్స్**

కవర్‌పేజీ ముఖచిత్రం

**టి.గంగాధర్**

వాణిజ్య ప్రకటనలు

**9030626288**

ముద్రణ:

DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా

TRC
TELANGANA
RESOURCE CENTRE



DECCAN LAND

"CHANDRAM" 490,
St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029.

Mobile: 9030626288
Fax: 040-27635644

E-mail: deccanlandindia@gmail.com
website : www.deccanland.com


## వార్షిక చందా

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక చందాదారులుగా చేరదల్చుకున్న వారు పై చిరునామాకు రూ. 200 ఎం.ఒ. పంపించవచ్చు. లేదా దక్కన్‌ల్యాండ్ పేరిట డీడీ పంపవచ్చు. చిరునామా, ఫోన్ నెంబర్ వివరాలు స్పష్టంగా తెలియజేయగలరు.

'దక్కన్ ల్యాండ్'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను ప్రజాస్వామిక అభిప్రాయ వేదికగా, ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, సమస్యలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే 'దక్కన్ ల్యాండ్' లక్ష్యం.

# టీఎన్జీవో సంఘంతోనే గుర్తింపు

## మండలి చైర్మన్ స్వామిగౌడ్



**టీ**ఎన్జీవో సంఘానికి ప్రాతినిధ్యం వహించడంతో తనకు గుర్తింపు వచ్చిందని శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ చెప్పారు. ఆదిలాబాద్‌లో టీఎన్జీవో నూతన భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం సెంట్రల్‌గార్డెన్‌లో టీఎన్జీవో 70 వసంతాల సంబురాలు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దుపై నిర్వహించిన సదస్సుకు స్వామిగౌడ్‌తో పాటు మంత్రి జోగురామన్న, ఎంపీ గోడం నగేశ్, టీఎన్జీవో గౌరవాధ్యక్షుడు దేవీప్రసాద్, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కారం రవీందర్‌రెడ్డి, హమీద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ టీఎన్జీవో 70 ఏండ్ల ఘనచరిత్ర కలిగిన సంఘమన్నారు. ఉద్యోగుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తూనే రాష్ట్రం సాధించడంలో కీలక భూమిక పోషించిందన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ఉద్యోగులంతా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, వనజారెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం పోచంపాడ్‌లో దేవీప్రసాద్ మాట్లాడుతూ 2న దేశవ్యాప్త నిరసనలకు ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

CNBC



# మోస్ట్ ప్రామిసింగ్ స్టేట్‌గా తెలంగాణ

**తె**లంగాణ రాష్ట్రానికి మరోసారి జాతీయస్థాయి గుర్తింపు లభించింది. రాష్ట్రం ఏర్పడి రెండున్నరేండ్లు మాత్రమే అవుతున్నప్పటికీ ఉత్తమ పాలనలో అనేక అవార్డులను, ప్రశంసలను పొందుతున్నది.

సీఎన్‌బీసీ బిజినెస్ టీవీ చానెల్ ఏటా ఇచ్చే లీడర్ అవార్డుల్లో ఈసారి తెలంగాణ రాష్ట్రం మోస్ట్ ప్రామిసింగ్ స్టేట్ అవార్డుకు ఎంపికైంది. కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ నుంచి రాష్ట్రమంత్రి కేటీఆర్ ఈ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. మోస్ట్ ప్రామిసింగ్ స్టేట్ అవార్డు అందుకోవడం మాత్రమే గాకుండా అందుకు తగ్గరీతిలో ఆయా కార్యక్రమాలను అమలు చేసి గుర్తింపు సంపాదిస్తామని కేటీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కొత్త రాష్ట్రమే అయినా అనేక రాష్ట్రాలతో పోటీపడి అవార్డు అందుకోవడం సీఎం కేసీఆర్ పరిపాలనా దక్షతకు, పనితీరుకు నిదర్శనమని మంత్రి చెప్పారు. దేశంలో త్వరలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్‌గా ఆవిర్భవిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడానికి సంక్షేమం, సాగునీరు, పరిశ్రమలు...ఇలా పలు రంగాల్లో నూతన పాలసీలు వచ్చాయని, ఇవే తెలంగాణ పురోగామి రాష్ట్రంగా తయారు కావడానికి దోహదం చేశాయని అన్నారు.

చందదారులుగా చేరండి! **దక్కన్ ల్యాండ్** చందదారులను చేర్పించండి!

'తెలంగాణ రిసోర్స్ సెంటర్' ఆధ్వర్యంలో యం.వేదకుమార్ సంపాదకత్వంలో ప్రజాఉద్యమాల వేదికగా ఆరంభమైన 'దక్కన్‌ల్యాండ్' తెలుగు సామాజిక రాజకీయ మాసపత్రిక అనతికాలంలోనే అన్ని వర్గాల ఆదరణ పొందింది. తెలంగాణ ఉద్యమకారులకు కరదీపికగా మారింది. ఈ పత్రిక మరిన్ని వర్గాలకు చేరడంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా**

DECCAN LAND
**"CHANDRAM"** 490, St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029. Mob: 9030626288
mail: deccanlandindia@ gmail.com, www.deccanland.com

**చందా వివరాలు:**

| | | |
|---|---|---|
| వార్షిక చందా | : | రూ. 200 |
| 2 సంలకు | : | రూ. 400 |

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎంఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

# దక్కన్‌ల్యాండ్ నాలుగేళ్ళ ప్రస్థానం




ప్రత్యేక తెలంగాణ!

ఆరు దశాబ్దాల కలను నిజం చేసుకునేందుకు అరవై ఏళ్ల ఆరాటం. మరీ ముఖ్యంగా దశాబ్దికాలానికి పైగా సాగిన మలి విడత పోరాటం. పార్టీల సిద్ధాంతాలకు, కులమతాలకు, ధనిక–పేద అంతరాలకు అతీతంగా అంతా ఒక్కటై స్వరాష్ట్ర సాధనకు నడుం బిగించిన సందర్భం. తాడో పేడో తేల్చుకోవాలనుకుంటున్న ఆరాటం... ఒకవైపున రాజకీయ పార్టీలు ...సామాజిక శక్తులు ఏకమై చేస్తున్న పోరాటం... మరోవైపున తెలంగాణ వస్తుందో, రాదో అన్న ఆవేదన.. ఉద్యమకారులపై విరిగిన లాఠీలు....ప్రజల కంట కన్నీళ్ళు ఒలికించిన బలిదానాలు... ఇలాంటి సందర్భంలోనే తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచేలా, ఉద్యమకారులకు అక్షరాయుధాలను అందించేలా 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక ఆవిర్భవించింది.

2012 సెప్టెంబర్ 9న దక్కన్‌ల్యాండ్ తొలి సంచిక వెలువడింది. ఖైరతాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన తొలిసంచిక ఆవిష్కరణ కార్యక్రమానికి వివిధ దిన, మాసపత్రికల సంపాదకులు, ప్రముఖులెందరో హాజరయ్యారు. అలా మొదలైన దక్కన్‌ల్యాండ్ ప్రస్థానం నాలుగేళ్ళుగా కొనసాగుతూనే ఉంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధనతోనే మన లక్ష్యం సాధించినట్లు కాదు. సాధించుకున్న రాష్ట్రాన్ని సుస్థిర తెలంగాణగా తీర్చిదిద్దుకునేందుకు మరెంతో కృషి చేయాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్ర పునర్ నిర్మాణంలో తన వంతు పాత్ర పోషించేందుకు దక్కన్‌ల్యాండ్ సిద్ధమైంది. రాష్ట్రంలో మారిన పరిస్థితుల నేపథ్యంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ఈ ప్రాంతపు పునర్నిర్మాణం కోసం దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక తనదైన శైలిలో కథనాలను అందిస్తూ వచ్చింది. అదే సమయంలో తెలంగాణ సాహిత్యం, సంస్కృతి, చరిత్ర, వారసత్వం లాంటి అంశాలకు పట్టం కడుతూ, విద్య, ఉపాధి, వ్యవసాయం, సహజవనరులు, పర్యావరణం లాంటి సామాజిక అంశాలకు ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక కథనాలను వెలువరించింది.

ఒక మాసపత్రికను మరీ ముఖ్యంగా సామాజిక అంశాలకు వేదికగా నిలిచే మాసపత్రికను ఏళ్ళతరబడి నిరాటంకంగా నిర్వహించడం కత్తి మీద సాము లాంటిదే. అయినా కూడా ఈ బాధ్యతను సమర్థంగా నిర్వహించగలిగింది దక్కన్‌ల్యాండ్ మాతృసంస్థ అయిన తెలంగాణ రిసోర్స్ సెంటర్ (టి.ఆర్.సి). పరిమిత వనరులతోనే అపరిమిత స్థాయిలో ప్రజల్లోకి చొచ్చుకెళ్ళగలిగింది దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక.

తెలంగాణవాదాన్ని బలంగా వినిపించడంలో తన వంతు కృషి చేసిన దక్కన్‌ల్యాండ్ స్వరాష్ట్ర ఆవిర్భావం తరువాత కూడా ప్రతి పేజీలోనూ తెలంగాణ సోయి ఉండేలా వెలువడుతూనే ఉంది. కవిత, కథ, వ్యాసం, సంపాదకీయం, సినిమా...ఇలా ప్రతి అంశం కూడా తెలంగాణతో ముడిపడి ఉండేలా చూసుకుంటూ వచ్చింది.

ఈ నాలుగేళ్ళ ప్రస్థానంలో ఒక్కసారి వెనుదిరిగి చూసుకుంటే ఎన్నో ఇబ్బందులు... మరెన్నో ఆనందాలు. ఈ ప్రయాణంలో అనుక్షణం పత్రికకు అండగా నిలిచిన పాఠకులు, రచయితలు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు అందరికీ టి.ఆర్.సి తరఫున మా హృదయపూర్వక ధన్యవాదాలు. ఇదేవిధమైన ఆదరాభిమానాలను ఇక ముందు కూడా మీ నుంచి కోరుకుంటున్నాం.

వేదకుమార్.యం

(యం. వేదకుమార్)
ఎడిటర్

# మహా జలమైత్రి

మేడిగడ్డ, తమ్మిడిహట్టి, చనాఖా-కొరాట బ్యారేజీల నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం తెలంగాణను సస్యశ్యామలం చేసే యత్నంలో ఓ ముందడుగుగా చెప్పవచ్చు. మహారాష్ట్రతో తెలంగాణ అనుబంధానికి వందల ఏళ్ళ చరిత్ర ఉంది. ఈ అనుబంధాన్ని మరింత పటిష్ఠం చేసే రీతిలో ఈ ఒప్పందం కుదిరింది.

ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉన్నప్పుడే సఖ్యత కుదురుతుంది. అలా కుదిరే సఖ్యత రెండు రాష్ట్రాలకూ మేలు చేస్తుంది. అవసరం మనదైనప్పుడు అది తీరేందుకు అవసరమైతే కాస్త తగ్గడం లౌక్యం. తెలంగాణ ప్రభుత్వం ఈ విజ్ఞతను ప్రదర్శించినందువల్లే ఒప్పందం కుదిరింది. నిజానికి ఈ ఒప్పందం కొన్ని దశాబ్దాల క్రితమే కుదరాల్సింది. కారణాలు ఏవైతేనేం, అప్పటి ప్రభుత్వం పంతానికి పోయిన రీతిలో వ్యవహరించడంతో అసలుకే ఎసరు వచ్చింది. అలాంటి స్థితి నుంచి ఒప్పందంపై సంతకాలు జరిగే వరకు ప్రస్తుత ప్రభుత్వం పట్టువిడుపులతో వ్యవహరించడంతో ఒప్పందం అమల్లోకి వచ్చింది.



మహారాష్ట్రతో కుదిరిన ఈ ఒప్పందం అంతర్రాష్ట్ర వివాదాల్లో చిక్కుకున్న గోదావరి, పెన్‌గంగ, ప్రాణహితలపై ప్రాజెక్టుల నిర్మాణానికి వీలు కల్పించింది. దీంతోపాటుగా 1975 నుంచి పెండింగ్‌లో ఉన్న పెన్‌గంగపై నిర్మించే ప్రాజెక్టు కూడా కార్యరూపం దాల్చనుంది. ఉమ్మడి రాష్ట్రంలో అనవసర వివాదాలతో తెలంగాణ ప్రాజెక్టులను కాగితాలకే పరిమితం చేశారు. స్వరాష్ట్ర ఆవిర్భావం అనంతరం ప్రభుత్వం స్నేహపూర్వక ధోరణితో ఆయా వివాదాలను పరిష్కరించుకునే దిశగా అడుగులు వేసింది. ప్రాజెక్టు ఎత్తు విషయంలో వచ్చిన విమర్శలను తిప్పికొడుతూ ముందుకు సాగింది. ఈ ఒప్పందంతో తెలంగాణలో నలభై లక్షల ఎకరాలకు నీళ్ళు అందించేందుకు మార్గం సుగమమైంది. గోదావరి నదిలో మనకు హక్కుగా ఉన్న 950 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకునే అవకాశం లభించింది.

రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన చర్చలు ఫలప్రదమయ్యాయి. జల వివాదాల పరిష్కారంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌లు యావత్ దేశానికే మార్గనిర్దేశనం చేశారని చెప్పవచ్చు. రెండున్నరేళ్ళలో ఈ మూడు ప్రాజెక్టులు పూర్తి కాగలవని అంచనా. లోయర్ పెనుగంగపై చనాక-కొరాట బ్యారేజీతో 5.12 టీఎంసీల నీటి నిల్వకు వీలు కలుగుతుంది. ఆదిలాబాద్ జిల్లా బేల,జైనథ్, ఆదిలాబాద్, థాంమ్సీ మండలాల పరిధిలోని 58 వేల ఎకరాలకు సాగు నీరు, 98 గ్రామాలకు తాగు నీరు అందించేందుకు దీని వల్ల వీలవుతుంది. ప్రాణహిత ప్రాజెక్టు (తమ్మిడిహట్టి బ్యారేజీ) కింద 1.8 టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజీ నిర్మాణానికి వీలు కలుగుతుంది. రిజర్వాయర్లలో 14.4 టీఎంసీల నీటి నిల్వ చేసుకోవచ్చు. ఆదిలాబాద్ జిల్లాలోని 8 మండలాల పరిధిలో 1.44 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు (మేడిగడ్డ బ్యారేజీ)తో మేడిగడ్డ వద్ద రోజుకు 2 టీఎంసీల చొప్పున 120 రోజుల్లో 240 టీఎంసీల తరలింపునకు వీలు కలుగుతుంది. ఇక్కడ నీటి నిల్వ కోసం నిర్మించే రిజర్వాయర్ల సామర్థ్యం 146.82 టీఎంసీలు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్, నల్లగొండ, రంగారెడ్డిలలో మొత్తం 18,80,000 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించేందుకు వీలు కలుగుతుంది. ఈ మూడు ప్రాజెక్టుల కారణంగా మొత్తం మీద 37 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది.

కేంద్రప్రభుత్వం జోక్యం అవసరం లేకుండా ఈ ఒప్పందాలు కుదరడాన్ని ఓ విశేషంగా చెప్పవచ్చు. రెండు రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీలు, కేంద్రంలో మరో పార్టీ అధికారంలో ఉన్నా ఈ ఘనతను సాధించడం మరో విశేషం. ఈ రెండు రాష్ట్రాలతో పాటుగా కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నపుడు కూడా సాధించలేని పరిష్కారాన్ని ఇప్పుడు సాధించగలగడం అభినందనీయం. గతంలో సూత్రప్రాయ ఒప్పందాలు జరిగినా అసలైన అవగాహన సాధించింది మాత్రం ఇప్పుడే. ఇదే విధమైన సానుకూల ధోరణితో తెలంగాణ రాష్ట్రం మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుందాం.

– దక్కన్ న్యూస్ ద

## తెలంగాణ సాహిత్య దృశ్యం

# తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం

# సిద్ధాంతాలు - పద్ధతులు

తెలంగాణ రాష్ట్ర సాకారం కోసం దశాబ్దాలపాటు ఉద్యమించి, త్యాగాలుచేసి రాష్ట్రాన్ని సాధించుకున్నం. రాష్ట్ర ఆవిర్భావ ఆనంద పారవశ్యంలో మునిగి తేలుతూ అక్కడే ఆగిపోకుండా అన్ని రంగాల్లో నిర్మాణాత్మక కృషి చేస్తున్నం. ప్రభుత్వం, సంస్థలు, వ్యక్తులు ఆ కృషిలో భాగమవుతున్నరు.

ఆ కృషిలో భాగంగా "తెలంగాణ సాహిత్య చరిత్ర" నిర్మాణం చేయవలసి ఉంది. ఈ దిశలో ఉద్యమ కాలంలో కొంత కృషి జరిగింది. జరగవలసింది చాలానే ఉన్నది.

తెలంగాణ సాహిత్య నిర్మాణం ఎట్లా జరగాలనే దానిని తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఏయే శక్తులు పని చేసినవి, ఏయే రాజకీయాలు, తాత్త్వికతలు ప్రభావాన్ని చూపినవి అనేవి కొంత నిర్ణయిస్తవి.




1969 ఉద్యమం విఫలమైన తరువాత ఎన్నో పరిణామాలు జరిగినవి. మధ్య తరగతి ఒక బలమైన శక్తిగా అవతరించింది. భూస్వామ్య శక్తులు బలహీనపడి పెట్టుబడీ దారీవర్గం బలోపేతమైనది. నిమ్న వర్గాలు చైతన్యవంతమైనవి. సీమాంధ్ర ఆధిపత్యం అన్ని రంగాలలో విస్తరించి అన్ని వర్గాల ప్రజలు బాధితులయినారు. వీటికి తోడు తాత్త్విక రంగంలో వచ్చిన మార్పులు కెటలిస్ట్‌గా పని చేసినవి.

పోస్ట్ కలోనియలిజం యూరప్ వలసాధిపత్య దృక్కోణాన్ని తిరస్కరించి సొంతదేశం, సొంతనేలపై సొంత సాంస్కృతిక వారసత్వంపై దృష్టి మళ్ళేలా చేసింది. "Post colonial writings is to establish or rehabilitate self against either challenge the colonial versions of history... The writers use their indigenous resources to challenge Europian perspectives" అన్న T.N.Dhar మాటలు పై అంశాన్ని సూచిస్తున్నవి.

పశ్చిమదేశాల కేంద్రంగా ప్రాచ్యదేశాలను నిర్వచించడాన్ని, వారి ఆధిక్య భావనను ఎడ్వర్డ్ సయీద్ "ఓరియంటలిజం" తిరస్కరించింది.

గ్రామ్‌స్కీ, హెర్బర్ట్ మార్క్యూజ్, అడార్నో, లూయిస్ ఆల్తూజర్, ఎరిక్‌ఫ్రామ్ లాంటి నియో మార్క్సిస్టుల ఆలోచనాధార మార్క్సిజం పరిధిలోనే సంప్రదాయ మార్క్సిస్టులకంటే భిన్నమైన కొత్త ఆలోచనలను ముందుకు తెచ్చింది. 1980లలో వచ్చిన మనదేశంలోని సబాల్టర్న్ స్టడీస్ బృందం గ్రామ్‌స్కీ భావనను స్వీకరించడాన్ని ఇక్కడ గమనించాలి.

అన్ని రకాల ఆధిపత్య కేంద్రాలను (Hegemonyలను) వ్యతిరేకిస్తూ పోస్ట్ మోడర్నిస్టులు విభిన్నతలను, బహుళత్వాలను నిర్దిష్టతలను ముందుకు తెచ్చిండ్రు. అఖండత ధ్వంసమైన తరువాత మాత్రమే ఒక నిర్మాణంలోని మిగతా అంశాలు స్వతంత్రతనీ గుర్తింపునీ పొందగలుగుతాయని చెప్పిండ్రు. ప్రాంతీయమైన విముక్తి ఉద్యమ ఆవశ్యకతలను ముందుకు తెచ్చిండ్రు. ప్రాంతీయతలు, విభిన్నతలు అంతరిస్తున్నాయని చెప్పి ప్రాంతీయ చరిత్రల్ని గురించిన స్పృహను కలిగించిండ్రు. జాతి ఔన్నత్య కేంద్రవాదం (Ethnocentrism) మిగతా జాతులు తమకు తాము తమ సంస్కృతి హీనమైనదని, అభివృద్ధి చెందనిదని భావించుకునేట్టు చేసినది కాబట్టి ఆ వాదాన్ని తిరస్కరించాలన్నారు.

సబాల్టర్న్ అధ్యయనం ఆధిపత్య, కులీన (Elite) దృక్కోణాన్ని తిరస్కరించి అధీన, విస్మృత, నిర్లక్షిత (Subalterns) శ్రేణుల అధ్యయనాన్ని ప్రేరేపించింది.

1969 ఉద్యమాన్ని వ్యతిరేకించిన మార్క్సిస్టు పార్టీలు, విప్లవ పార్టీలు పైన పేర్కొన్న కొన్ని తాత్త్వికతల పర్యవసానం ఫలితంగా నిర్దిష్ట వాస్తవికతను పరిగణనలోకి తీసుకోవడం మూలంగా మలిదశ ఉద్యమంలో (CPM మినహా) క్రియాశీలంగా పని చేసినవి. ఈ చైతన్యం నుంచి వచ్చిన వాళ్ళే ఎక్కువగా తెలంగాణ భావజాల వ్యాప్తి చేసిండ్రు. విప్లవ పార్టీల క్రియాశీలత ఈ దశ ఉద్యమానికి గాఢతను,

మిలిటెన్సీని ఇచ్చింది.

పూలే, అంబేద్కర్‌ల ప్రభావం విస్తృతి చెందడమే కాక లోతుల్లోకి వెళ్ళింది. అంబేద్కర్ చిన్న రాష్ట్రాల సిద్ధాంతం దళిత బహుజనులు ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొనటానికి దోహదం చేసింది.

పోస్ట్ మోడర్నిజం, సబాల్టర్న్ అధ్యయనం, గ్రామ్‌స్కీ, బ్లాక్ మూమెంట్, దళిత పాంథర్స్, అంతర్జాతీయ ఫెమినిజం, కాన్షీరాం, మండల్ కమీషన్, మార్క్సిజం కలిగించిన చైతన్యం-ఫలితంగా స్త్రీవాదం, దళిత వాదం, బహుజనవాదం, మైనారిటీ వాదం ఆదివాసీ వాదం లాంటి అస్తిత్వ ఉద్యమాలు వచ్చినవి. ఇవి తమ అస్తిత్వాన్ని గురించి మాట్లాడుతూనే తెలంగాణ గురించీ పని చేసినవి.

ఇన్ని ప్రభావాలతో, ఇన్ని శక్తులతో తెలంగాణ ఉద్యమం నడిచింది కాబట్టే ఎన్నో వాయిస్‌లు- భౌగోళిక తెలంగాణ, ప్రజాస్వామిక తెలంగాణ, సామాజిక తెలంగాణ, గిరిజన ప్రాధికార ప్రాంతం, సెక్యులర్ తెలంగాణ-వచ్చినవి.

కాబట్టి ఈ అన్నింటిని దృష్టిలో పెట్టుకొని, ఈ అందరి ఆకాంక్షలు ప్రతిఫలించేలా తెలంగాణ చరిత్ర, తెలంగాణ సాహిత్య చరిత్రల నిర్మాణం చేయవలసి ఉంటుంది.

చరిత్ర రచన ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటిదాకా చరిత్ర రచనా సిద్ధాంతాలు, దృక్కోణాలు చాలా వచ్చినవి. ఈ సిద్ధాంతాలను, దృక్కోణాలనే వాటి సామంజస్యాన్ని పరిగణనలోకి తీసుకొని తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణానికి (చరిత్రకు సాహిత్య చరిత్రకు అవిభాజ్య సంబంధముంటుంది గనుక) అనువర్తింపజేసుకోవలసి ఉంటుంది. ఇప్పుడు కొన్ని సిద్ధాంతాలను గురించి తెలుసుకుందాం.




**వలసవాద - అంతర్గత వలసవాద దృక్కోణం:**

భారతదేశ చరిత్రను మొదట రాసింది బ్రిటీష్ చరిత్రకారులే. ప్రాచీన భారతదేశం గురించి వచ్చిన మొట్టమొదటి క్రమబద్ధమైన గ్రంథం Eearly History of India. దీనిని విన్సెంట్.ఏ.స్మిత్ 1904లో ప్రచురించిండు.

స్మిత్ దృక్పథం సామ్రాజ్యవాదానికి అనుకూలమైనది. బ్రిటిష్ పాలనను సమర్థించడానికి ఉపయోగపడింది. స్మిత్ తదితరుల చరిత్ర గ్రంథాలను ప్రస్తావించి "బ్రిటీష్ సామ్రాజ్యవాద నిరంకుశత్వాన్ని భారతదేశంలో కొనసాగించటానికి అవి చక్కని ప్రచార సాధనాలుగా ఉపయోగపడ్డాయి", "భారతీయులు తమ దేశాన్ని పరిపాలించుకోలేరని, ఆ సమర్థత వారికి లేదని నిరూపించడం ఈ సాధారణీకరణల సారాంశం" అని ప్రసిద్ధ చరిత్రకారుడు రామ్‌శరణ్ శర్మ అన్నాడు (ప్రాచీన భారతదేశ చరిత్ర - పు.5)

స్మిత్‌తో పాటు, విలియం విల్సన్ హంటర్, జి.బి. మెల్లేసన్, జేమ్స్.ఎఫ్.స్టీఫెన్స్, హెన్రీమెయిన్, వీలర్, ఆల్ఫ్రెడ్ లియల్, డబ్ల్యు హెచ్ మొరెలాండ్ రచనలను ప్రస్తావించి, వాటి మంచి చెడ్డలను విచారించి మొత్తం వాటి సారాంశాన్ని "It was to justify the continuance of British rule" అని చెప్పినాడు ఇ.శ్రీధరన్ అనే రచయిత (A text book of Historiography - P-400-425)

తెలంగాణను అంతర్గత వలసగా చేసుకున్న సీమాంధ్రులు సరిగ్గా ఈ విధంగానే వ్యవహరించినారు. ఈ పద్ధతిని తెలంగాణ సాహిత్య విషయంలోనూ అనుసరించినారు వారు. తెలంగాణలో కవులు పూజ్యం, తౌరక్యాంధ్రం లాంటి అభిప్రాయాలు ఆ దృక్కోణం నుంచే వెలువడినవి. దాదాపు 21 తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథాలు వస్తే వాటి రచయితలందరూ (ముదిగంటి సుజాతరెడ్డి తప్ప) ఆ ప్రాంతంవారే. ఆ గ్రంథాలలో తెలంగాణ సాహిత్యాన్ని విస్మరించడం, వక్రీకరించడం, పోతన, రాజకవి మల్లారెడ్డి, అప్పకవి లాంటి అనేక మంది కవులను తమ ఖాతాలో వేసుకోవడం చేసినారు. ఆ దృక్కోణానికి లోనైన మన సాహిత్య చరిత్ర కారులు సైతం తెలంగాణ కవిరచయితలను తక్కువ చేయడం, విస్మరించడం చేసినారు. సి.నారాయణరెడ్డి తన సిద్ధాంత గ్రంథంలో చరిత్రాత్మకమైన తెలంగాణ అస్తిత్వాన్ని మొదటిసారిగా ప్రకటించిన గోలకొండ కవుల సంచికను కనీసం ప్రస్తావించకపోవడం అందుకు ఒక ప్రబలమైన ఉదాహరణ. ఇలాంటివెన్నో.

కాబట్టి ఈ విస్మరణలను, అవహేళనలను, వక్రీకరణలను, నిర్లక్ష్యాన్ని, అజ్ఞానాన్ని తిరస్కరించి తెలంగాణ సాహిత్య చరిత్రను నిర్మించాల్సి ఉంటుంది.

**జాతీయ (Nationalist Historiography) -ఉపజాతీయ దృక్కోణం**

బ్రిటీష్ చరిత్రకారులు సామ్రాజ్యవాద, వలసవాద దృక్కోణంలో భారతదేశ చరిత్రను వక్రీకరించడాన్ని గమనించి, బాధపడి భారతీయ సమాజాన్ని సంస్కరించడానికి, స్వపరిపాలనకు భారతీయులకున్న అర్హతను నిరూపించే విధంగా భారతదేశ చరిత్రను పునర్ నిర్మించడానికి కొందరు భారతీయ విద్వాంసులు నడుము బిగించారు. అలాంటి కృషి చేసినవారు వీరు: ఆర్.జి.భండార్కర్ (1837-1925), రాజ్వాడే, డి.ఆర్.భండార్కర్, హెచ్.సి.రాయ్ చౌదరి (1892-1957), ఆర్.సి.మజుందార్ (1888-1990), (చూ. రామ్‌శరణ్ శర్మ), రమేశ్ చంద్ర దత్ (1848-1909), కే.పి.జయస్వాల్ (1881-1937), రాధా కుముద్ ముఖర్జీ (1880-1963), జాదూనాథ్ సర్కార్ (1870-1958).

ఇలాంటి చరిత్రకారులు, విద్వాంసులు పాశ్చాత్య గాలులలో కొట్టుకపోకుండా తట్టుకొని నిలబడటానికి, తమ కాళ్ళ మీద తాము

నిలబడడానికి భారతీయులలో ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని నింపే ప్రయత్నం చేసినారు. జాతీయ స్పృహను, జాతీయ ఐక్యత, జాతీయ ఔన్నత్య స్పృహను కలిగించి విదేశీ ఆధిక్యత నుంచి విముక్తి పొందాలనే స్వేచ్ఛా కాంక్షను రగలించినారు.

అట్లాగే మొదటితరం భారత చరిత్రకారులు "To defined their culture and civilization againnst the british imperialist attack" అనే దృక్పథంతో చరిత్ర రచన చేసినారు.

"Indian nationalist historiography growing partly in reaction to the pretensions prejudices of British imperialist historio graphy on India" అనే మాటలు భారతదేశ జాతీయవాద చరిత్ర రచనా పద్ధతి ఎలా అభివృద్ధి చెందిందో తెలియజేస్తున్నవి.

మొత్తంగా వీరు భారతదేశ ఐడెంటిటీని వివిధ రూపాల్లో నిలబెట్టడానికి కృషి చేసినారు (చూ. శ్రీధరన్ పే-426-429).

ఈ దృక్పథాన్ని గురించి ఇంత సుదీర్ఘంగా చెప్పటానికి కారణం ఉపజాతీయ దృక్కోణంతో తెలంగాణ సాహిత్య చరిత్ర రచనకు స్వీకరించవలసిన అంశాలు ఇందులో ఉన్నవని తెలుపడానికే.




ఈ రచనా పద్ధతి నుంచి స్వీకరించకూడని అంశం కూడా ఒకటి ఉంది. ఈ పద్ధతిలో నిష్పాక్షిక హేతువాద దృక్పథంతో చరిత్ర రచన జరిగినప్పటికీ ఇందులో హిందూమత పునరుద్ధరణ పాయ కూడా ఉంది. స్వీకరించ కూడనిది ఇదే.

జాతీయవాద చరిత్ర నిర్మాణక్రమంలో వచ్చిన చరిత్రకారులు అందరూ ఉత్తర భారతం వారే. అందువల్ల దక్షిణ భారత చరిత్రకు తగిన ప్రాధాన్యత లభించలేదు. దక్షిణ భారత అస్తిత్వాన్ని నిలబెట్టుటానికి కె.ఎ.నీలకంఠ శాస్త్రి (1892-1975), ఎజ్డానీ, షేర్వానీ లాంటి చరిత్రకారులు "దక్కన్ చరిత్ర" రచన ద్వారా కృషి చేసింద్రు.

1912లో ఆంధ్రరాష్ట్రం కోసం మొదలైన ఆంధ్రోద్యమ నేపథ్యంలో అనంతర కాలంలో ముందుకు తెచ్చిన విశాలాంధ్ర నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ చరిత్ర రచన మొదలయింది. ఈ చరిత్ర రచన ఆంధ్రభాషా జాతీయ (ఉపజాతీయ) దృక్కోణంతో జరిగింది. అట్లా వచ్చిన చరిత్రలలో ఖండవల్లి లక్ష్మీరంజనం, బాలేందుశేఖరం గార్లు రచించిన "ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి" (1951) మొదటి సంపూర్ణ చరిత్రగా కొందరు భావించింద్రు. ఈ గ్రంథాన్ని సమీక్షిస్తూ ఆంధ్రప్రభ (16-3-1952) ఈ గ్రంథ రచన "విశాలాంధ్ర నిర్మాణ వాంఛతో జరిగింది" అని అభిప్రాయపడింది. అది నిజం.

విశాలాంధ్ర భావనలో సామ్రాజ్యవాద భావన ఇమిడి ఉందని అన్న నెహ్రూ మాటలు అందరికి తెలిసిందే. ఇది తెలంగాణను

**జాతీయవాద చరిత్ర నిర్మాణక్రమంలో వచ్చిన చరిత్రకారులు అందరూ ఉత్తర భారతం వారే. అందువల్ల దక్షిణ భారత చరిత్రకు తగిన ప్రాధాన్యత లభించలేదు. దక్షిణ భారత అస్తిత్వాన్ని నిలబెట్టుటానికి కె.ఎ.నీలకంఠ శాస్త్రి (1892-1975), ఎజ్డానీ, షేర్వానీ లాంటి చరిత్రకారులు దక్కన్ చరిత్ర రచన ద్వారా కృషి చేసింద్రు.**

అంతర్గత వలసగా చేసుకోవటానికి దారితీసింది. తెలంగాణ చరిత్ర, సంస్కృతిని విస్మరించడం, వక్రీకరించడం, అవహేళన చేయడం అందులో భాగమే. ఇదే పద్ధతిలో తెలుగు సాహిత్యచరిత్రల నిర్మాణం కూడ జరిగింది. దీనిని తిరస్కరించి తెలంగాణ ఉప జాతీయతా దృక్కోణం నుంచి చరిత్ర, సాహిత్య చరిత్రల నిర్మాణం జరగవలసి ఉంది. ఈ పనిని ఈ వ్యాసకర్త "ముంగిలి", తెలంగాణ చరిత్ర" రచనల ద్వారా కొంత చేసిండు. సంగిశెట్టి, కె శ్రీనివాస్, ముదిగంటి సుజాతారెడ్డి తదితరులు (దస్త్రం, షబ్నవీస్, తెలంగాణ సాహిత్య వికాసం, తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర, తెలంగాణ సాహిత్యం- జీవిత చిత్రణ, తెలంగాణ నవల) కొంత చేసింద్రు. ఈ దిశలో ఇంకా సమగ్రమైన కృషి జరుగవలసి ఉంది.

చరిత్ర రచనా శాస్త్రంలో ఎం.ఎం. భాషమ్ లాంటివారి కృషి వలన క్రమంగా సామాజిక దృక్పథం చోటు చేసుకున్నది. సామాజిక దృక్పథాల్లో మార్క్సిస్ట్ దృక్పథం ఒకటి.

### మార్క్సిస్టు దృక్పథం:

మార్క్స్ ప్రతిపాదించిన గతితార్కిక చారిత్రక భౌతికవాద దృక్కోణంతో చరిత్రను అధ్యయనం చేయడాన్ని, రూపొందించడాన్ని ఇక్కడ మార్క్సిస్టు దృక్పథం అనొచ్చు.

భారత చరిత్ర రచనా శాస్త్రంలో మార్క్సిస్టు శాఖ పితామహుడు డి.డి. కోశాంబి తన చరిత్రగ్రంథానికి 'గతితార్కిక భౌతిక వాదం" సైద్ధాంతిక పునాది అని చెప్పుకున్నాడు. మార్క్స్ రాసిన "క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" గ్రంథం నుంచి ఈ సిద్ధాంతాన్ని ఉదహరించినాడు. అందులోంచి కొన్ని మాటలు.. "ఉత్పత్తి సంబంధాల సమాహారమే సమాజ ఆర్థిక నిర్మాణంగా ఉంటుంది. ఈ నిజమైన పునాది మీద ఒక చట్టపరమైన రాజకీయపరమైన ఉపరితల నిర్మాణం అవుతుంది. దానికి సరిపోయినట్టుగానే నిర్దిష్ట, సామాజిక చైతన్య రూపాలు ఉంటాయి. ఈ భౌతిక జీవన సాధనాల ఉత్పత్తి విధానమే మొత్తంగా సామాజిక రాజకీయ, మేధో జీవన క్రమాల్ని నిర్దేశిస్తుంది. మనుషుల ఉనికిని నిర్ణయించేది వారి చైతన్యం కాదు. అందుకు భిన్నంగా వారి సామాజిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని

నిర్ణయిస్తుంది. ఆర్థిక పునాదిలో మార్పుతో యావత్తు ఉపరితలం కొద్దో గొప్పో వేగంగా పరివర్తన చెందుతుంది. (భారత చరిత్ర–డి.డి. కోశాంబి–అను: ఎన్ వేణు గోపాల్– పు. 45, 46).

ఈ ఉపరితలంలో కళలు, మతం, తత్వశాస్త్రం, న్యాయ శాస్త్రం, రాజకీయ వ్యవస్థ భాగంగా ఉంటవి. సాహిత్యం "కళలు'లో భాగం.

చారిత్రకంగా ఆర్థిక పునాదిలో వచ్చిన మార్పుల కనుగుణంగా ఉపరితంలో మార్పులు జరుగుతవి కాబట్టి ఏ అంశాన్నైనా (అంటే సాహిత్యాన్ని కూడా) చారిత్రక పరిణామ క్రమంలో అంటే ఆర్థిక, రాజకీయ, మత సామాజిక సంబంధాల దృష్ట్యా అధ్యయనం చేయవలసి ఉంటుంది.

చరిత్ర రచనాశాస్త్రవేత్త ఇ. శ్రీధరన్ మార్క్సిస్టు చరిత్ర రచనా శాస్త్రాన్ని గురించి చెబుతూ ఇలా అన్నాడు. "The essence of the new apprroches in the study of the relationship between social and economic organizations and its effect on historical events" (E.Sreedharan 2014-P-469)

మార్క్సిస్ట్ దృక్పథంతో తెలుగులో సాహిత్య చరిత్ర నిర్మాణ ప్రయత్నం చేసిన వారు వెల్చేరు నా రాయణరావు. కె.కె. రంగనాథాచార్యులు.

ఈ దృక్పథాన్ని తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణంలో ఉపయోగించుకున్నట్లయితే సాహిత్య పరిణామంలోని విశిష్టతలు తెలియవస్తవి.

**ఆధునికానంతర దృక్కోణం:**

చరిత్ర రచనాశాస్త్రం మీద ఆధునికానంతర వాద ప్రభావం కూడా ఉన్నది. సం ప్రదాయిక చరిత్ర రచనా పద్ధతిని వీళ్ళు పూర్తిగా తిరస్కరించినారు. ఏదీ నిశ్చితం కాదని, ప్రతిదాన్నీ Deconstuct చే యాలని వీళ్ళు భావించిండ్రు.

No kind of objective knowledge of the past is possible because all knwoledge is relative అని అన్నారు. There is no ultimate historical reality" అని అన్నారు.

ఒక నిర్దిష్ట ప్రాంతపు చరిత్రను, సంస్కృతిని పరిశీలించడానికి, విశ్లేషించడానికి ఆ నిర్దిష్ట ప్రాంతానికి చెందిన చరిత్రకారులు మాత్రమే పని చేయాలి తప్ప పరాయి ప్రాంతం నుంచి సంస్కృతి నుంచి వచ్చిన చరిత్రకారులు కాదని వీళ్ళు ప్రకటించినారు.

తెలుగు సాహిత్య చరిత్రను డీ కన్స్ట్రక్ట్ చేసి తెలంగాణ సాహిత్య చరిత్రను నిర్మించడానికి ఈ దృక్కోణం ఉపయోగపడుతుంది.

**సబాల్టన్ దృక్కోణం:**

1980లలో రంజిత్ గుహ ఆధ్వర్యంలో సబాల్టర్న్ అధ్యయన బృందం ఏర్పడింది. వీరి గురించి శ్రీధరన్ ఇలా అన్నారు. "Subaltern a term take from Antonio gramsci manuscript writings, Means of inferior rank whether of class, caste, age, gender or office. subaltern studies bring to light the lower sections of the Indian people hitherto neglected by Historiography" (P-493)

ఈ అధ్యయన బృందం అధ్యయనం గురించి ఇలా అన్నారు. "The need to make the subaltern classes The subject of their own history" (Vol-II) "Elite, subaltern వర్గాల మధ్య అన్ని స్థాయిల్లో ఆధిక్యత లోబడి ఉండడం అనే సంబంధాలే ఉన్నవి. 'సబాల్టర్న్‌ని చరిత్ర నిర్మాతగా మేం చూడదలచుకున్నాం (Vol-IV).

చరిత్ర రచనలో ఇలాంటివారి పాత్రను (History from below, annals history, Peoples History, Post modernism) చరిత్రకారులు గుర్తించిండ్రు. ప్రముఖ చరిత్రకారుడు వకులాభరణం రామకృష్ణ వీరి గురించి ఇలా అన్నారు.

"చరిత్రను శిష్టవర్గాల వారి ప్రభావం నుంచి, వారి ఆధిపత్యం నుంచి తొలగించాలన్నదే వీరి ప్రయత్నం. తద్వారా శిష్టుల తో ప్రమేయం లేని ప్రజల స్వతంత్ర చరిత్రను, రా జకీయాలను వివరించాలన్నది సబాల్టర్న్ లేదా ఉప శ్రేణి చరిత్రకారుల ఆశయం. ఉప శ్రేణుల పాత్ర అవి నిర్వహించిన ఉద్యమాలను వీరు వెలుగులోకి తీసుకురాదల్చారు. ఇంతవరకు చరిత్రలో తొంగి చూడని చీకటి కోణాలను వెలుగులోకి తెచ్చారు. ఇంతవరకు చరిత్రకారులు లేవనెత్తని కొన్ని మౌలిక ప్రశ్నలను వేశారు. (చరిత్ర - సంస్కృతి (వ్యాసాలు))



ఈ పద్ధతిని సాహిత్య చరిత్రకు అనువర్తింప జేసుకుంటె విస్మృతికి గురైన తెలంగాణ కవుల గు రించి తెలంగాణలోని అనేక అంశాల గురించేకాక, తెలంగాణ సాహిత్యంలో కూడ విస్మృతికి గురైన కింది శ్రేణుల గురించి కూడా వెలుగు ప్రసరించే అవకాశం ఉంటుంది.

**దళిత, బహుజన, మైనార్టీ, మహిళా దృక్కోణం**

తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణంలో దళిత, బహుజన, మైనార్టీ, మహిళా రచయితలకు, కవులకు తగిన ప్రాధాన్యత నివ్వాలె. వారి రచనల్ని వెలుగులోకి తేవాలె. ఈ దృక్కోణంలో సాహిత్య చరిత్ర నిర్మాణం చేసినట్లయితే అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తయి.

(రెండో భాగం వచ్చే సంచికలో)

–డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి
మొబైల్: 98856 82572
మెయిల్: narayanareddy.sunkireddy@gmail.com

ద

# తెలుగు వాచకాల విశిష్టత

## తొమ్మిదవ తరగతి తెలుగు వాచకం - సింగిడి - 1

గత సంచిక తరువాయి

ఆరు దశాబ్దాల తెలంగాణ స్వప్నం సాకారమై కొత్త రాష్ట్రం, కొత్త ప్రభుత్వం ఏర్పడిన చారిత్రక సందర్భంలో రూపొందించిన కొత్త పాఠ్యాంశాలలో అనేక విశేషాలున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ స్థానిక సంస్కృతి, స్వంత భాష పాఠ్యాంశాల్లోకి తీసుకు రావడంలో పాఠ్యపుస్తక అభివృద్ధి కమిటీ చాలామేరకు విజయం సాధించింది. ఆ క్రమంలో 9వ తరగతి పాఠ్య పుస్తకాన్ని సింగిడి-1 శీర్షికతో వెలువరించిన వాచకంలో ఈ కింది 12 పాఠాలు ఉన్నాయి.

1వ పాఠం ధర్మార్జునులు-చేమకూర వేంకటకవి-నైతిక విలువలు-ప్రాచీన పద్యం

2వ పాఠం నేనెరిగిన బూర్గుల-పి.వి. నరసింహారావు-స్ఫూర్తి-అభినందన వ్యాసం

3వ పాఠం వలసకూలీ- డా॥ ముకురాల రామారెడ్డి-సామాజిక స్పృహ సహానుభూతి-పాట

4వ పాఠం రంగాచార్యతో ముఖాముఖి-సాహిత్య సేవ-ఇంటర్వ్యూ

5వ పాఠం శతక మధురిమ-శతక కవులు-నైతిక విలువలు-శతకం

6వ పాఠం దీక్షకు సిద్ధంకండి-దేశభక్తి కరపత్రం

7వ పాఠం చెలిమి-పొన్నికంటి తెలగన-మానవ సంబంధాలు -అచ్చతెలుగు కావ్యం

8వ పాఠం ఉద్యమ స్ఫూర్తి సంగెం లక్ష్మీబాయి- ప్రేరణ, దేశభక్తి - ఆత్మకథ

9వ పాఠం కోరస్ -సలంద్ర లక్ష్మీనారాయణ-సామాజిక స్పృహ -వచనకవిత

10వ పాఠం వాగ్భూషణం-డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి-భాషాభిరుచి-వ్యాసం

11వ పాఠం వాయసం-మామిండ్ల రామగౌడు-జీవకారుణ్యం పర్యావరణం-ఆధునిక పద్యం

12వ పాఠం తీయని పలకరింపు-ఇల్లిందల సరస్వతీ దేవి- మానవ సంబంధాలు-కథానిక

9, 10 తరగతుల ప్రథమ భాష వాచకాలు-సింగిడి సిరీస్-1, 2

ఉపాధ్యాయుల పని భారాన్ని, పనిదినాలను దృష్టిలో పెట్టుకొని ఆచరణకు వీలుగా పాఠ్యాంశాల సంఖ్యను తగ్గించి రూపొందించిన వాచకం ఇది అని పేర్కొన్నారు. పాఠం బోధించడం అంటే విషయాన్ని వివరించడం మాత్రమే కాదు. దాంట్లోని విలువలను, కవి హృదయాన్ని, అంతరార్థాన్ని పిల్లలు అర్థం చేసుకునేటట్లు చూడాలి. ఇందుకోసం ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. పదబంధాలు, జాతీయాలు, ఆలోచనాత్మక, సందేశాత్మక వాక్యాలపట్ల చర్చ ద్వారా, ప్రశ్నించడం ద్వారా పిల్లలే అవగాహన పొందేటట్లు చేయాలి. పిల్లల అభిప్రాయాలను చెప్పించడం, సమకాలీన అంశాలతో అన్వయించడం, బహు కోణాల్లో విశ్లేషించడం జరగాలి అని పేర్కొన్నారు. పిల్లలు రాసిన అంశాలను భావాత్మకంగా వాక్యాలు, పదాలు, అక్షర దోషాలపరంగా సరి చేయాలి. పాఠశాలలో భాషాభివృద్ధికి దోహద పడే కార్యకలాపాలు, భాషామేలాలు, భాషోత్సవాలు, బాలకవి సమ్మేళనాలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, వార్షికోత్సవాలు వంటివి నిర్వహించాలి. పిల్లలు రాసిన సృజనాత్మక అంశాలను సంకలనం చేసి తరగతి గదిలో ప్రదర్శించాలి అని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు చక్కని కార్యక్రమాలను సూచిస్తూ ఈ పాఠ్యపుస్తకం ముందుమాట రాశారు.

మొదటి పాఠం కింద ఒక పద్యం ప్రతిపదార్థం ఇచ్చి, మరి కొన్ని పద్యాల ప్రతిపదార్థం స్వయంగా రాయాలని కోరారు. మరొక పద్యం ఇచ్చి ఆ పద్యంలోని అంశాలకు సంబంధించి ప్రశ్నలు వేశారు. వ్యక్తీకరణ-సృజనాత్మకత శీర్షికలో పాఠంలోని విశేషాలను వెలికి తీయడానికి ప్రశ్నలు వేశారు. ధర్మరాజు వ్యక్తిత్వాన్ని స్వంత మాటల్లో రాయమని సూచించారు. అలాగే నీకు తెలిసిన మంచి గుణాలు కలిగిన ఒకరిని గురించి అభినందన వ్యాసం రాయండి అని సూచించారు. ఇది ఒక చక్కని ఆచరణాత్మక సూచన. పదజాలం గురించి కొన్ని పదాలు సోయగం, ఏవురు, వెగటు, మార్జన పదాలకు అర్థాలు రాసి స్వంత వాక్యాల్లో ఉపయోగించండి అని కోరారు. తనూజుడు, సార్వభౌముడు, నందనుడు పదాలకు వ్యుత్పత్తి అర్థాలు పేర్కొనమన్నారు. ప్రతిమ, కుమారుడు, మొగము, ప్రాణం పదాలకు పర్యాయపదాలు రాసి, వాటితో వాక్యాలు రాయాలని కోరారు. ప్రకృతి, వికృతి పదాలను గుర్తించాలని కొన్ని ఇచ్చారు. కొన్ని పదాలు ఇచ్చి వాటి నానార్థాలు పట్టిక రాయమన్నారు. వ్యాకరణాంశాల్లో కర్మధారయ సమాసం గురించి వివరించారు. ప్రాజెక్టు పనిలో ఉత్తమ పాలనను రామరాజ్యంతో పోలుస్తారు. శ్రీ రాముని పాలన ఏవిధంగా ఉండేదో తెలుసుకొని నివేదిక రాయమని కోరారు. ఈ పాఠం తర్వాత మన సామెతలు-మన జాతీయాలు కొన్ని పేర్కొన్నారు. అతి రహస్యం బట్టబయలు, నీల్లునములు వంటి వాటిని ఇవ్వడం బాగుంది.

**బూర్గుల, పీవీగార్ల సంబంధం గురుశిష్యుల లాంటి సంబంధం. దీన్ని సమర్థిస్తూ ఐదు వాక్యాలు రాయమని అన్నారు. బూర్గుల వ్యక్తిత్వంలోని మహోన్నత లక్ష్యాలను పదేసి వాక్యాల్లో రాయమన్నారు. పాఠంలోని పదజాలం, విశిష్ట లక్షణాల ఆధారంగా ఒక కవిత రాయండి. లేదా ఈ పాఠం ఆధారంగా నీకు నచ్చిన గొప్ప వ్యక్తిని ప్రశంసిస్తూ సన్మాన పత్రం రాసి ప్రదర్శించండి అని కోరడం పిల్లల్లో చక్కని భాష అభివ్యక్తిని పెంపొందింప జేస్తుంది.**

హైదరాబాద్ రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు గురించి పి.వి. నరసింహారావు రాసిన వ్యాసం ఇందులో పొందుపరిచారు. ఇది తెలంగాణ చారిత్రక వ్యక్తులను, వారి ద్వారా తెలంగాణ సామాజిక పరిణామాలను తెలుసు కోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. పాఠం చివర ఇతరుల కంటే తాను అధికుడిని అని అనిపించుకోవాలనే ఉబలాటం, పెనుగులాట ప్రతినిత్యం ఉంటూనే ఉంటుంది. దీని గురించి మీ అభిప్రాయం తెలపండి అని కోరారు.

ఈ పాఠంలో ఉన్న జాతీయాలను గుర్తించి రాయమన్నారు. రాణి రుద్రమదేవి గురించిన ఒక పేరాను ఇచ్చి వాటికి సంబంధించిన ప్రశ్నలు, జవాబులు రాయమని సూచించారు. బూర్గుల, పి.వి. నరసింహారావుగార్ల విశిష్ట వ్యక్తిత్వాల గురించి జవాబులు రాయమని కోరారు. బూర్గుల, పీవీగార్ల సంబంధం గురుశిష్యుల లాంటి సంబంధం. దీన్ని సమర్థిస్తూ ఐదు వాక్యాలు రాయమని అన్నారు. బూర్గుల వ్యక్తిత్వంలోని మహోన్నత లక్ష్యాలను పదేసి వాక్యాల్లో రాయమన్నారు. పాఠంలోని పదజాలం, విశిష్ట లక్షణాల ఆధారంగా ఒక కవిత రాయండి. లేదా ఈ పాఠం ఆధారంగా నీకు నచ్చిన గొప్ప వ్యక్తిని ప్రశంసిస్తూ సన్మాన పత్రం రాసి ప్రదర్శించండి అని కోరడం పిల్లల్లో చక్కని భాష అభివ్యక్తిని పెంపొందింపజేస్తుంది. వ్యాకరణాంశాల్లో కొన్ని సంధుల గురించి పరిచయం చేశారు. తత్పుర్ష సమాసాల గురించిన పదాలు ఇచ్చి వాటి విగ్రహ వాక్యం రాయమన్నారు. ప్రాజెక్టు పనిగా మహోన్నత వ్యక్తిత్వంతో, పరిపాలన దక్షతతో సేవచేసిన వారి వివరాలు సేకరించి ఒక సంకలనాన్ని రూపొందించి తరగతి గదిలో ప్రదర్శించండి అని నిర్దేశించారు.

'వలసకూలీ!' పాఠంలో సుద్దాల హనుమంతు పాటలోని కొన్ని చరణాలు చేర్చారు. పాలమూరు జిల్లా కరువు, తద్వారా కూలికి వలసపోవడం గురించి ఈ పాఠం చేర్చబడింది. ఈ పాఠం గేయ ప్రక్రియకు చెందినది. పేద ప్రజల జీవితాన్ని, కష్టాలను చిత్రించిన ఈ గేయ పాఠం పిల్లల్లో మంచి అవగాహనను కలిగింప జేస్తుంది. సామాజిక స్పృహను పెంచుతుంది. అవగాహన- ప్రతిస్పందనలో తెలంగాణలో శతాబ్దాలుగా జీవితంలో భాగమైన చెరువుల ప్రాధాన్యత గురించి వివరించారు. అంత్యానుప్రాస అనే శబ్దాలంకారాన్ని పరిచయం చేశారు. ఉపమాన ఉపమేయాలను పరిచయం చేశారు.

దాశరథి రంగాచార్య గురించిన పాఠం ముందు చేకూరి రామారావు ఇంటర్వ్యూను కూడా చేర్చారు. దాశరథి రంగాచార్యతో జరిగిన ముఖాముఖి పాఠం ద్వారా పత్రికల్లో వచ్చే ఇంటర్వ్యూలను ఒక ప్రక్రియగా పరిచయం చేయడం ప్రశంసనీయం. ఇంటర్వ్యూలు ఎన్ని రకాలో అవగాహన – ప్రతిస్పందనలో పేర్కొన్నారు. వ్యక్తీకరణ – సృజనాత్మకతలో ప్రజల భాష అంటే మీరేమి అర్థం చేసుకున్నారో రాయమని కోరారు. దాశరథి రంగాచార్య వ్యక్తిత్వాన్ని, సాహిత్య సేవను ప్రశంసిస్తూ వార్తా పత్రికకు ఒక లేఖ రాయండి అని సూచించారు. ఇలా చదివిన అంశాన్ని మరొక ప్రక్రియలోకి మార్చి రాయడాన్ని అభ్యాసం చేయడానికి ఇది ఎంతగానో ఉపయోగ పడుతుంది. వాక్యాల్లో కర్తరి, కర్మణి వాక్యాలు ఎలా ఉంటాయో సూచించారు. సాధారణంగా తెలుగులో కర్తను బట్టే వాక్యాలు రాస్తుంటాం. ఆ విషయం కూడా ఈ సందర్భంగా చెప్తే మంచిది. పాఠం చివర మీకు తెలుసు అనే అంశంలో తెలంగాణ సాయుధ పోరాటం, గోర్కి, చెకోవ్, ఛార్లెస్ డికెన్స్ గురించి సంక్షిప్తంగా వివరించారు. ప్రాజెక్టు వర్కులో భాగంగా పత్రికల్లో వచ్చిన ఏదైనా ఇంటర్వ్యూ సేకరించి తరగతి గదిలో చదివి వినిపించాలని కోరారు.

'శతక మధురిమ' పాఠానికి ముందు 'బలవంతుడు నాకేమని' అనే సుమతి పద్యాన్ని చేర్చారు. ఇందులో మరుగున పడిన శతక కవులను కూడా కలిపి ఒక్కొక్క పద్యం కూర్చారు. అలా శతక వాఙ్మయాన్ని పరిచయం చేశారు. పాఠం తర్వాత ప్రసిద్ధి రామప్ప వరకవి (సిద్దప్ప) పద్యాన్ని చదవడానికి ఇచ్చారు. వ్యాకరణాంశాల్లో వృత్తాన్ని పరిచయం చేశారు. శార్దూల పద్యం గణ విభజన చేసి చూపారు. పాఠశాలలోని గ్రంథాలయాన్ని సందర్శించి శతక పద్యాల పుస్తకాలను పరిశీలించి నీకు నచ్చిన పది పద్యాలు సేకరించి, వాటికి భావాలు రాయండి అని కోరారు.

చదవండి–తెలుసుకొండి అనే శీర్షికలో కొన్ని పొడుపు పద్యాలు ఇవ్వడం బాగుంది. చిన్నప్పుడు పొడుపు కథలు విప్పడం, వినడం ఎంతో ఆసక్తికరమైన అంశం.

'దీక్షకు సిద్ధంకండి' అనే పాఠానికి స్వచ్ఛభారత్‌కోసం సన్నద్ధం కండి అనే ఒక ప్రకటనను, లేఖను ప్రచురించారు. ఇది కరపత్రం కూడా. ఈ పాఠం కరపత్రం అనే ప్రకియకు చెందింది. 1969లో తెలంగాణ రాష్ట్ర సాధనకోసం తెలంగాణ ప్రజాసమితి, విద్యార్థి కార్యాచరణ సమితి ప్రచురించిన కరపత్రాన్ని ఇందులో ప్రచురించడం ద్వారా తెలంగాణ రాష్ట్రం కోసం ఎన్ని తరాలుగా ఉద్యమిస్తున్నామో అర్థమయ్యేట్టు చేశారు. ఉపాధ్యాయులు ఈ సందర్భంగా తాము ఎన్నో విషయాలు తెలుసుకొని, మరెన్నో విషయాలు ఈ సందర్భంగా విద్యార్థులకు హృద్యంగా చెప్పవచ్చు. కరపత్రం ఎలా రాయాలో, వాటి అవసరం ఏమిటో అవగాహనలో పేర్కొన్నారు. చెరువుల గురించి, చెరువుల అభివృద్ధి గురించి కరపత్రం చేయాలని, అది చదివి వినిపించాలని కోరారు. కొన్ని కరపత్రాలు సేకరించి, వాటిని ఒక పట్టికలో రాయాలని ప్రాజెక్టు పని ఇచ్చారు.

'చెలిమి' అనే పాఠం కావ్య ప్రక్రియకు చెందింది. సంస్కృత పదాలను ఉపయోగించకుండా అచ్చమైన తెలుగులో రాసిన కావ్యమిది. పొన్నికంటి తెలగన రాసిన 'యయాతి చరిత్ర' నుండి ఈ పాఠం తీసుకోవడం జరిగింది. ప్రవేశికలో సృష్టిలో తియ్యనిది స్నేహం అని దాని ప్రాధాన్యత గురించి వివరించడం చక్కని ఆలోచన. హిమాచల్ ప్రదేశ్‌లో బియాస్ నది చూడ్డానికి వెళ్లిన విజ్ఞానయాత్రలో జరిగిన ప్రమాదాన్ని సంక్షిప్తంగా ఇచ్చి ఈత నేర్చుకోవడం ఎంత అవసరమో పేర్కొన్నారు. అలాగే భీమకవి గురించి ఒక గద్యం ఇచ్చారు. ప్రశ్నల్లో కుల, మత, వర్గ, పేద, ధనిక లేనిది స్నేహం ఒక్కటే అని సమర్ధిస్తూ ఐదు వాక్యాలు రాయాలని సూచించారు. స్నేహితుల మధ్య వివాదాలు ఎందుకు వస్తాయో ఐదు వాక్యాలు రాయమన్నారు. తేటగీతి పద్య ఛందస్సును ఈ పాఠం కింద పరిచయం చేశారు. మీకు తెలుసా శీర్షికలో 'గాథాసప్తశతి'లోని ఒక కథను సంక్షిప్తంగా పేర్కొన్నారు.

'ఉద్యమస్ఫూర్తి' పాఠానికి ముందు స్నేహ సంపద గురించి ఒక పేజీ వ్యాసం చక్కగా పొందుపరిచారు. 'ఉద్యమస్ఫూర్తి' పాఠంలో సంగెం లక్ష్మీబాయి గురించి, గాంధీజి నాయకత్వంలో సాగిన జాతీయోద్యమం గురించి, స్వాతంత్ర్యానంతరం స్వార్ధం పెరిగి, సాంఘిక బాధ్యత లోపించడం గురించి వేదన చెందారు. ఈ పా ఠం తర్వాత ప్రాజెక్టు పనిలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఇద్దరు ముగ్గురు మహిళల వివరాలను సేకరించి నివేదిక రాయాలని కోరారు.

'కోరస్' పాఠం ఒక వచన కవిత. ఆ పాఠం ప్రారంభంలో కాళోజి ప్రసిద్ధ 'అన్నపురాసులు ఒకచోట, ఆకలి మంటలు ఒకచోట' అనే గేయాన్ని చేర్చారు. కవి ఒంటరిగా ముందుకు సాగితే తర్వాత ప్రజలు తన పాటకు కోరస్ అందుకొని ముందుకు సాగుతారని అనే విశ్వాసంతో ఎదుర్కొనే కష్టాలను, అవమానాలను ఈ కవితలో పేర్కొన్నారు. ప్రతిస్పందన శీర్షికలో 'ఆకులు లేకుంటే, చెట్టును ఎలా గుర్తిస్తావు? పచ్చదనమే చెట్టుకు చిహ్నమా?' అనే కవితను ప్రచురించారు. ప్రాజెక్టు పనిలో అభ్యుదయ కవులుగా పేరు పొందిన ఎవరిదైనా ఒకరి కవితను సేకరించి, దానిపై అభిప్రాయాన్ని రాయమని, చదివి వినిపించమని కోరారు. మీకు తెలుసా శీర్షికలో తెలంగాణ సాయుధ పోరాటం గురించిన సంక్షిప్త పరిచయం ఇచ్చారు.

'వాగ్భూషణం' పాఠం ప్రారంభంలో వేముగంటి నరసింహాచార్యులు రాసిన 'మాటలు కోటలు గట్టి, మహరాజుగా మసలు తాడొకడు' అనే కవితను చేర్చారు. ఈ ప్రక్రియ ఉపన్యాస ప్రక్రియను పరిచయం చేస్తుంది. ఉపన్యాసం ఎలా ఉండాలో, ఉపన్యాసం ఇవ్వడంలో ఎదుర్కొనే సంకోచాలు ఎలా ఒదిలించుకోవాలో, మాట్లాడే అంశాలపట్ల అనేక విషయాలను ముందే తెలుసుకోవడంతో పాటు, జ్ఞాపకశక్తి ఎంత అవసరమో సూచించారు. ప్రసంగాన్ని ప్రారంభించేటప్పుడు ఎలా ఉండాలి? ముగించేటప్పుడు ఎలా ఉండాలి? అనే అంశాన్ని ఈ పాఠం ఎంతో చక్కగా వివరిస్తుంది. ఉపన్యాస ప్రక్రియ

**పొన్నికంటి తెలగన రాసిన 'యయాతి చరిత్ర' నుండి ఈ పాఠం తీసుకోవడం జరిగింది. ప్రవేశికలో సృష్టిలో తియ్యనిది స్నేహం అని దాని ప్రాధాన్యత గురించి వివరించడం చక్కని ఆలోచన. హిమాచల్ ప్రదేశ్‌లో బియాస్ నది చూడ్డానికి వెళ్లిన విజ్ఞాన యాత్రలో జరిగిన ప్రమాదాన్ని సంక్షిప్తంగా ఇచ్చి ఈత నేర్చు కోవడం ఎంత అవసరమో పేర్కొన్నారు. అలాగే భీమకవి గురించి ఒక గద్యం ఇచ్చారు. ప్రశ్నల్లో కుల, మత, వర్గ, పేద, ధనిక లేనిది స్నేహం ఒక్కటే అని సమర్ధిస్తూ ఐదు వాక్యాలు రాయాలని సూచించారు.**

ఎంతో ప్రధానమైన ప్రక్రియ కూడా. ఆ ప్రక్రియను గురించిన ఎంతో వివరంగా ఉన్న పాఠాన్ని చేర్చడం అభినందనీయం. మీకు తెలుసా శీర్షికలో పలుకే బంగారం అనే అంశాన్ని చేర్చారు. ఉపన్యాసం ఇవ్వడం కోసం మీకు నచ్చిన ఒక అంశాన్ని ఎంచుకొని, దానికి సంబంధించిన వివరాలను తెలుసుకొని తరగతి గదిలో ఉపన్యాసం ఇవ్వాలని ప్రాజెక్టు పనిలో సూచించారు.

'వాయసం' పాఠానికి ముందు పద్య చమత్కారం అనే శీర్షికలో కొన్ని పద్యాలు ఇచ్చారు. ఆ పద్యాల విశేషాలను వివరించడం బాగుంది. 'వాయసం' అంటే కాకి. కాకి గురించిన ఈ పాఠంలో నలుపు వర్ధిల్లాలి అనే చిత్రం ఎంతో ఆకర్షిస్తుంది. కాకి అరిస్తే చుట్టాలు వస్తారని అనుకునే విషయాన్ని బొమ్మగా చిత్రించడం బాగుంది. ఈ పాఠం తాత్పర్యాన్ని ఎంతో చక్కగా వివరించారు. పక్షిజాతిలో కాకిని చిన్న చూపు చూడడం సరియైందేనా అని చర్చించండి అని కోరారు. పిచ్చుకలు, కాకులు, గద్దలు వాటి ప్రాధాన్యతను గురించిన ఒక పేరా ఇచ్చి, అందులోని విశేషాంశాలను రాయమని కోరారు.

'తీయని పలకరింపు' పాఠం మొదట్లో ఒకరి సంభాషణ ఇచ్చి అది ఎవరు ఎవరుతో మాట్లాడుతున్నారో గ్రహించాలని ప్రశ్నలు వేశారు. తీయని పలకరింపు' పాఠం ఉద్దేశం వృద్ధుల గురించిన శ్రద్ధ, కుటుంబ విలువల గురించింది. అవగాహనలో ముసలివారు వృద్ధాశ్రమానికి వెళ్ళడానికి గల కారణాలను చర్చించండి అని కోరారు. ఒక వచన కవిత ఇచ్చి అందులోని భావాన్ని ప్రశ్నలు, జవాబులుగా రాయమని సూచించారు. ప్రాజెక్టు పనిలో పనిగా ఇంటిచుట్టుపక్కల ఉండే వృద్ధులవద్దకు వెళ్ళి, వాళ్లతో మాట్లాడి, వాళ్ళకు ఇష్టమైన, అవసరమైన పనులు ఏవో తెలుసుకొని చెప్పండి. వారు ఏమనుకుంటున్నారో రాయండి అని నిర్దేశించారు.

ఉపవాచకంలో ఈ కింది వారి గురించి సంక్షిప్తంగా పరిచయం చేశారు. ఒక్కొక్కరు ఒక్కొక్క రంగంలో మహోన్నతులు. ఈ పాఠాలు తెలంగాణ మహనీయులతో పాటు, దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి పూలే గురించి, స్వామి వివేకానంద గురించిన పాఠాలు ఉన్నాయి. ఇలా జాతీయ స్థాయి అవగాహన పెరగడానికి ఈ ఉపవాచకం ఎంతో ఉపయోగ పడుతుంది. పెద్దవాళ్ల జీవిత చరిత్రలు చదవడం ద్వారా విద్యార్థుల్లో తాము కూడా ఎదగాలనే గొప్ప లక్ష్యం, స్ఫూర్తి కలుగుతుంది.

ఇంత చక్కని పాఠ్యాంశాలు చేర్చిన రూపకర్తలకు అభినందనలు. అట్టవెనుక కొమురం భీం, సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ, డా.కె. జయశంకర్, స్వామి వివేకానంద, సావిత్రిబాయి పూలేతో పాటు ఉపన్యాసం ఇస్తున్న దృశ్యాన్ని చిత్రించారు.

| | |
|---|---|
| 1. కొమురం భీం | జూలై |
| 2. సురవరం ప్రతాపరెడ్డి | సెప్టెంబరు |
| 3. కాళోజి | అక్టోబరు |
| 4. జయశంకర్ | డిసెంబరు |
| 5. స్వామి వివేకానంద | జనవరి |
| 6. నేను... సావిత్రిబాయిని | ఫిబ్రవరి |

9వ తరగతి ఉపవాచకంలో కొమురం భీం, సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ, డా. కె. జయశంకర్, స్వామి వివేకానంద, సావిత్రిబాయి పూలే వంటి తెలంగాణ, జాతీయ నాయకులను, సంస్కర్తలను పరిచయం చేయడం ఎంతో చక్కని దృష్టికోణం. కొమురం భీం ఆదివాసి జీవితాలకు, నాయకత్వానికి, ఉద్యమాలకు ప్రతీక అయితే సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ జాతీయోద్యమానికి ఒక ప్రతీక. కాళోజీ తెలంగాణ సమాజంలో సమాజంతోపాటు నడుస్తూ, సమాజాన్ని ముందుకు నడిపే కవులు, కళాకారులకు కాళోజి, డా. కె. జయశంకర్ ఉదాహరణప్రాయంగా నిలుస్తారు. స్వామి వివేకానంద ఒక అంతర్జాతీయ, జాతీయ భావజాల సంస్కరణ ఉద్యమానికి ప్రతీక. సావిత్రిబాయి పూలే దేశంలోని ఆధునిక విద్యా రంగానికి పునాదులు వేసిన మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. అలా మహిళా చైతన్యానికి సావిత్రిబాయి పూలే ఒక ప్రతీక. ఇలా అనేక రంగాల్లోని మహనీయులను పరిచయం చేసే 9వ తరగతి ఉపవాచకం ఎంతో గొప్పగా రూపొందింది.

ఇలా తొమ్మిదో తరగతి పాఠ్య పుస్తకంలో అనేక వైవిధ్య పూరితమైన అంశాలు, ప్రక్రియలు చోటు చేసుకున్నాయి. ఒక వాచకంగా ఒక సమగ్ర స్వరూపాన్ని సంతరించుకున్న ఈ పుస్తక రూపకల్పనలో ఎందరో కృషి చేశారు. పలువురి కృషి, ఆలోచనలు, చర్చలు, పాఠ్యాంశాల లక్ష్యాలు, విద్యార్థుల వయస్సు, ఆధునిక సమాజంలో అవసరమైన భాష, అవగాహన, ప్రక్రియలు, స్నేహం, త్యాగం, ఉద్యమం, ఉదాత్త జీవిత లక్ష్యాలు మొదలైనవి విద్యార్థుల హృదయాల్లో నిలిచిపోయి, వారి వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో తోడ్పడతాయి. పదాలు, నుడికారాలు, సంస్కృతి, పద్యాలు, పాటలు, వచన కవితలు, సంభాషణ, ఇంటర్వ్యూలు, ఉపన్యాసం, వ్యాసం, జీవిత చరిత్ర, లేఖా రచన వంటి అనేక ప్రక్రియలను తొమ్మిదో తరగతిలోనే పరిచయం చేసి వాటిపట్ల ఒక చక్కని అవగాహన కలిగిస్తుంది. ఉపాధ్యాయుడు ఎంతో ఉత్సాహంగా ఈ పాఠాలు చెప్పగలిగితే వారుకూడా ఎంతో ఎదుగుతారు.

**– బి.ఎస్. రాములు, మొబైల్: 8331966987**
**మెయిల్:** bsramulu@gmail.com

తెలుసుకొందాం..!

## గురుకుల పాఠశాలలో ప్రవేశాలు

జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రతి విద్యాసంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి (ప్రస్తుతం నాలుగవ తరగతి చదువుతున్న వారు) దరఖాస్తులను ఆహ్వానిస్తారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు నాణ్యమైన భోజనం, వసతి సౌకర్యం ఉంటుంది. జిల్లాలోని మూడు గురుకుల పాఠశాలలో నూతన అడ్మిషన్లకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు tswreis.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలో ప్రస్తుతం షేక్‌పేట్ రెసిడెన్షియల్ స్కూల్ (అబ్బాయిలకు), మహేంద్రహిల్స్ (అమ్మాయిలకు), ఆర్.కె. పురం (అమ్మాయిలకు) ఉన్నాయి. అలాగే జిల్లాకు నూతనంగా మరొకటి ఎస్టీలకు, 8 గురుకుల పాఠశాలలు మైనార్టీలకు మంజూరయ్యాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేం దుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. పూర్తి వివరాలకు గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలి.

## అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి

ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా అర్హులైన అభ్యర్థులు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ దేశాల్లోని విశ్వ విద్యాలయాల్లో విద్యనభ్యసించేందుకు ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తుంది. ప్రస్తుతం ఈ మొత్తాన్ని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. త్వరలోనే ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది. అర్హులైన అభ్యర్థులు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కోసం www.telanganaepass. cgg.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల కోసం మాసబ్‌ట్యాంక్‌లోని డీఎస్‌ఎస్ సంక్షేమ భవనంలోని 3వ అంతస్తులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అనంతరం అదే రోజు రాష్ట్రస్థాయి సెలక్షన్ జరుగుతుంది.

**అర్హతలు :**

- జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్ / ఐలెట్స్‌లలో డిగ్రీలో 60 శాతం మార్కులు పొంది ఉండాలి.
- కుటుంబ వార్షికాదాయం రూ.2లక్షల లోపు ఉండాలి.
- ఒక కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే అర్హులు.
- అభ్యర్థి పాస్‌పోర్టు, వీసా కలిగి ఉండాలి
- అక్రిడిటేషన్ పొందిన విదేశీ యూనివర్సిటీ / సంస్థ నుంచి అడ్మిషన్ లెటర్‌ను పొంది ఉండాలి.

# చెత్త తగ్గితేనే నగరానికి మేలు

**ఎఫ్‌బీహెచ్ 'టాక్'లో జీహెచ్ఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.సుధాకర్**

నగరంలో నివసించే ప్రతి వ్యక్తి కూడా సగటున రోజుకు అర కిలో చెత్త ఉత్పత్తి చేస్తున్నారని, దీన్ని ఎంత తగ్గించుకుంటే న గరానికి అది అంత మంచి చేస్తుందని జీహెచ్ఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.సుధాకర్ అన్నారు. 2016 ఆగస్టు 27న శనివారం హిమాయత్‌నగర్‌లోని దక్కన్ అకాడమీ 'చంద్రం'లో ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జ రిగిన 'టాక్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ అధ్యక్షులు యం.వేదకుమార్ అధ్యక్షత వహించారు.

'హైదరాబాద్ సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ - ఇన్షియేటివ్ టేకెనప్ బై జీహెచ్ ఎంసీ & రోల్ ఆఫ్ సివిల్ సొసైటీస్' (హైదరా బాద్ ఘనవ్యర్థాల నిర్వహణ–జీహెచ్ఎంసీ తీసుకున్న చర్యలు & పౌర సమాజం పాత్ర) అనే అంశంపై ఈ చర్చ జరిగింది.

**రోజుకు 4500 టన్నుల చెత్త: సుధాకర్**

నగరంలో రోజుకు సగటున 4, 500 టన్నుల మేరకు చెత్తను జీహెచ్ ఎంసీ సేకరిస్తున్నది. చెత్త తరలింపుపై ఏటా రూ.260 కోట్ల మేరకు ఖర్చు చేస్తున్నాం. కనీసం ఒక వెయ్యి టన్నుల మేరకు చెత్త తగ్గినా మంచిదే. ఆ మేరకు సేకరణ, తర లింపు తదితర వ్యయాలు తగ్గుతాయి. ఏ కార్యక్రమం చేపట్టాలన్నా ప్లానింగ్ ము ఖ్యం. నగరా భివృద్ధికీ ఇది వర్తిస్తుంది. చెత్త సేకరణ, తరలింపు, శుద్ధి తదితరాల్లో జీ హెచ్ఎంసీకి అందరు వ్యక్తులు, అన్ని సం స్థలు, విభాగాలు సహకరించాలి. జీహెచ్ ఎంసీ ఒక్కటి మాత్రమే ఈ బాధ్యత చూడాలంటే సాధ్యం కాదు. అన్ని వర్గాల ప్రజల నుంచి తగు సహకారం అందాల్సి ఉంటుంది. ఒక విషయంలో ప్రభుత్వాన్ని నిలదీసే ముందు మన బాధ్యతగా మనం ఏం చేస్తున్నామో కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. హైద రాబాద్‌కు గతంలో మూడుసార్లు అంతర్జాతీయంగా గ్రీన్‌సిటీ అవార్డు వచ్చింది. ప్రజలందరి సహకారంతోనే ఇది సాధ్యపడింది. అది కొనసాగాలి. జీహెచ్ఎంసీ వి స్తీర్ణం 625 చ.కి.మీ. నగర జనాభా 2011 సెన్సెస్ ప్రకారం 68.33 లక్షలు కాగా, ఇప్పుడు అనధికారిక అంచనాల మేరకు ఒక కోటి వరకూ ఉంటుంది. నగరానికి వచ్చి పోయే వారి సంఖ్య రోజుకు 15 లక్షల దాకా ఉంటుంది. ఎవరికి వారు తమ వంతు బాధ్యతను విస్మరించడంతో సమస్యలు అధికమ వుతున్నాయి.




**ఎఫ్‌బిహెచ్ టాక్‌లో ప్రసంగిస్తున్న సుధాకర్. చిత్రంలో ఎం.హెచ్.రావు, యం.వేదకుమార్**

నగరంలో చెత్తను జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్‌కు తరలి స్తుంటారు. జోన్ల వారీగా చేయాలనుకుంటే స్థలం లభ్యత ప్రధాన సమస్యగా ఉంటుంది. ఇంటర్నెట్‌లో రోజూ గంటల తరబడి ఎన్నో అంశాలపై అన్వేషించే ప్రజలు 'చెత్త'ను తగ్గించుకోవడం, సరిగా డిస్పోజ్ చేయడం లాంటి అంశాల గురించి మాత్రం వెతకరు. చె త్త సేకరణ, తరలింపు, శుద్ధి తదితరాల్లో జీహెచ్ ఎంసీ అధునా తన విధానాలు అవలంబిస్తోంది. వివిధ రకాల సాంకేతికతలను వినియోగించుకుంటోంది. విధి నిర్వహణలో వివిధ యాప్‌లను వినియోగిస్తున్నాం. ఎంతో పారదర్శకతతో పని చేస్తున్నాం. ఎప్ప టికప్పుడు ఆయా వివరాలను అధికారులు నమోదు చేస్తూ, షేర్ చేసుకుంటూ ఉంటారు.

చెత్తను తగ్గించే మార్గాలను అన్వేషించాలి. చెత్తను ఎంత త గ్గిస్తే అంతగా మాకు సహకరించినట్లవుతుంది. ఇంటింటికీ రెండు చెత్తబుట్టలను ఇచ్చాం. నగరంలో ఇప్పటి వరకూ 90 శాతం పం పిణి పూర్తయింది. వాటిని ఎంతమేరకు సక్రమంగా వినియోగి స్తున్నామో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. నగర పారిశుద్ధ్య విభాగంలో అవుట్ సోర్సింగ్‌లో సుమారు 18,900 మం ది, రెగ్యులర్ సిబ్బంది సుమారుగా 1800 మంది పని చేస్తున్నారు. పారి శుద్ధ్యం తీరుతెన్నులను మెరుగుపరిచేం దుకు జీహెచ్ఎంసీ 'పరిచయం' కార్య క్రమాన్ని ప్రవేశ పెట్టింది. స్థానికంగా పని చేసే పారిశుద్ధ్య కార్మికులు, సం బంధిత అధికారుల పేర్లు, ఫోన్ నెంబ ర్లను స్థానికంగా గోడ లపై రాయిస్తు న్నాం. ఈ సదుపాయాన్ని వినియోగిం చుకోవాలి. ఈ విధానాన్ని ప్రధానమంత్రి కూడా ప్రశంసించారు. దేశవ్యాప్తంగా కూడా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. స్వచ్ఛ్ భారత్ థీమ్‌లో కూడా దీన్ని చేర్చారు.

హైదరాబాద్‌లో రాత్రివేళ స్వీపింగ్ ప్రవేశపెట్టాం. దేశం లోని ప్రధాననగరాల్లో ఇప్పుడు దాన్ని అమలు చేస్తున్నారు. ఇంట్లో చెత్త ఉత్పత్తి కావడం నుంచి అది డంపింగ్ యార్డ్‌కు చేరుకునే వ రకు ఏయే దశలు ఉంటాయో తెలుసుకోవాలి. తడి చెత్త, పొడిచెత్త కలసిపోతే బాక్టీరియా వృద్ధి చెంది చెడువాసన వస్తుంది. లిచెట్ (చెత్త నుంచి కారే ద్రవపదార్థం) వస్తుంటుంది. డోర్ టు డోర్ కలె క్షన్, సెగ్రిగేషన్, డంపర్ బిన్స్, ప్రైమరీ ట్రాన్స్‌పోర్టేషన్, సెకండరీ

ట్రాన్స్‌పోర్టేషన్, టెరిటరీ లేదా ఫైనల్ ట్రాన్స్‌పోర్టేషన్ లాంటి దశలు ఉంటాయి. అంతిమంగా చెత్త జవహర్‌నగర్‌కు చేరుకుంటుంది. అక్కడ ట్రీట్‌మెంట్, డిస్పోజల్ చేస్తారు. అక్కడ చెత్తతో కంపోస్ట్ చేస్తారు. ప్లాస్టిక్, రబ్బరు లాంటి వాటితో ఆర్‌డీఎఫ్ (ఇంధనం) తయారు చేస్తారు. లిచెట్ (చెత్త నుంచి కారే ద్రవపదార్థం)ను కూడా శుభ్రపరుస్తారు. మిగిలిన చెత్తను సైంటిఫిక్ ల్యాండ్ ఫిల్లింగ్ చేస్తారు. అక్కడి లిచెట్ భూమిలోకి వెళ్ళకుండా జాగ్రత్త పడుతారు. అక్కడి వాయువులు పర్యావరణం లోకి వెళ్ళకుండా చూస్తారు. ఇందుకు ఒక సంస్థతో ఒప్పందం కూడా చేసుకున్నాం. ఇది పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. చెత్తను ఎప్పుడూ తగులబెట్టకూడదు. అది పర్యావరణానికి హాని చేస్తుంది. కొన్నేళ్ళుగా జవహర్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్త 80 నుం చి 115 అడుగుల మేరకు ఉంటుంది. అక్కడి లిచెట్‌తో భూగర్భజలం కలుషితమైంది. చుట్టుపక్కల 19 గ్రామాల ప్రజలు బాధపడుతున్నారు. శా స్త్రీయంగా ఆయా పనులు చే పట్టకపోవడంతో ఇలా జరిగింది. వాళ్ళూ మనుషులే. వారి బాధలు తగ్గాలంటే మనం చెత్త ఉత్పత్తి తగ్గించుకోవాలి. ప్రజల్లో ఈ విషయంపై అవగాహన పెంచాలి. పూనాలో కొన్ని వార్డులలో కొన్ని స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు ఈ విషయంపై అవగాహన పెంచుతున్నాయి. ఈ చైతన్యం సాధిస్తే మనం ఏదైనా సాధించవచ్చు.



గృహవ్యర్థాలు, పారిశ్రామిక వ్యర్థాలు, మెడికల్ వ్యర్థాలు, ఇ-వేస్ట్, ప్లాస్టిక్ వేస్ట్, కన్‌స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్‌వేస్ట్ అని చెత్త పలు రకాలుగా ఉంటుంది. గృహవ్యర్థాలు (మునిసిపల్ సాలిడ్ వేస్ట్), కన్‌స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్ వేస్ట్‌కు మాత్రమే నగరపాలక సంస్థ బాధ్యత వహిస్తుంది. ఇండస్ట్రియల్, మెడికల్, ప్లాస్టిక్ వేస్ట్, ఇ-వేస్ట్‌లకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ బాధ్యత వహిస్తుంది. ఇది తెలియక అంతా జీహెచ్ ఎంసీనే విమర్శిస్తుంటారు. కార్పొరేటర్లు కూడా ఈ విషయంలో అవగాహన పెంచుకోవాలి. ఇందుకోసం ఇటీవల ఒక సదస్సు కూడా ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికుడు వెంకటయ్యకు ఇటీవల అవార్డు వచ్చింది. ఈ తరహాలో వివిధ స్థాయిల్లో ఎక్కడికక్కడ పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

**అవగాహన పెంచుకోవాలి:ఎం.హెచ్. రావు**

చెత్తను ఎలా తగ్గించవచ్చో మనం అవగాహన పెంచు కోవాలి. కాలనీల్లో వెల్ఫేర్ సొసైటీలను ఇందులో భాగస్వాములుగా చేయాలి. సంబంధిత అధికారుల సిన్సియారిటీ, కమిట్‌మెంట్ కూడా ప్రధానం. నీలగిరి జిల్లాలో ఎక్కడా ప్లాస్టిక్ కన్పించకూడదని 30 ఏళ్ళ క్రితం అక్కడి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అందుకు కారణం అక్కడ ప్లాస్టిక్‌తో వచ్చిన ఇబ్బందులే. ఇప్పటికీ ఆ నిబంధనలు అమలు చేస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లోనే తనిఖీలు చేసి వాటిని డిపాజిట్ చేసుకోవడం లేదా స్వాధీనం చేసుకోవడం చేస్తారు. శ్రీశైలం అడవుల వద్ద కూడా ఈ విధమైన నిబంధనలు అమలు చేస్తే బావుంటుంది. పేపర్ సంచులు వాడే కల్చర్ పెంచుకోవాలి. ఇక్కడ కూడా తక్కువ మందంతో కూడిన ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై కొన్ని ఆంక్షలు మొదట్లో అమలు చేసి నప్పటికీ, తరువాత అమలు తగ్గిపోయింది.

నగర సమస్యల పరిష్కారంలో ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చేస్తున్న కృషి ప్రశంసనీయం. అధికార యంత్రాంగానికి ఫోరమ్ తగు సలహాలు, సూచనలు కూడా ఇస్తోంది. రకరకాల సమస్యలపై సలహాలు ఇవ్వ డం, సూచనలు చేయడం, ప్రభుత్వంతో పోట్లాడడం, కోర్టుల్లో కేసులు వేయడం, మనకు ఉన్న హక్కుల్ని ఏ రకంగా వినియోగించుకోవాలి, ప్రభుత్వాన్ని అడగడమే కాదు... మనం ఏరకంగా తోడ్పడాలి లాంటి అంశాలపై కృషి చేస్తోంది.

**నగరాన్ని తీర్చిదిద్దుకునే బాధ్యత అందరిది: వేదకుమార్**

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుకునే బాధ్యత అందరిపై ఉంటుంది. పారిశుద్ధ్య కార్మికులు 'బ్యూటీషియన్స్ ఆఫ్ ది సిటీ'. నగరం శుభ్రంగా, పచ్చదనంతో ఉంటేనే జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడుతాయి. బాధ్యతతో నగరాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. చెత్త ఎక్కువైతే పర్యావరణానికి అంత హాని. ఉత్పత్తి అయ్యే చెత్త కూడా రీసైక్లింగ్‌కు వీలయ్యేదిగా ఉండాలి. నగరం ఎంతో వృద్ధి చెందుతున్నప్పటికీ వివిధ స మస్యలు కూడా అంతగా వృద్ధి చెందు తున్నాయి. కాలుష్యం, ఇతర సమస్యల కారణంగా నగరవాసుల ఆయుర్దాయం తక్కువగా ఉంటోంది. ఆరోగ్య సమస్యలు అధికమవుతున్నాయి. గ్రామీణులతో పోలిస్తే నగరవాసుల ఆయుర్దాయం పదేళ్ళు తక్కువగా ఉంటుందని కూడా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. నగర సమస్యల పరిష్కారం కోసం ఒక మాస్టర్ ప్లాన్ కావాలి. ఇది రకరకాలుగా కాకుండా ఒక్కటిగానే ఉండాలి. నగరవాసులకు నాణ్యమైన జీవితం అవసరం. కొన్ని దశాబ్దాలుగా నగరపాలక సంస్థపై భారం పెరిగింది. పరిధి పెరిగినా, సమస్యలు ఎక్కువైనా సిబ్బంది సంఖ్య మాత్రం పెరగడం లేదు. పాఠశాల విద్యార్థులకు సైతం 'చెత్త' అంశంపై అవగాహన కల్పించాలి. ఇతర నగరాల్లో అమలవుతున్న మంచి కార్యక్రమాలను ఇక్కడ కూడా చేపట్టవచ్చు. చెత్తను విక్రయించే అంశం కూడా జీహెచ్‌ఎంసీ పరిశీలించాలి. ఎం.హెచ్.రావు తదితరులు ఈ సందర్భంగా ప్రసంగించారు.

ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ నేచర్ క్లబ్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహ్మద్ తురబ్, కె. సి. ప్రసాద్, బస్వరాజ్, ఆదర్శ్, ధనలక్ష్మి, అశోక్, సాబీర్, సుజాత, లత, నర్సింహులు, మీనా అగర్వాల్, సుదర్శన్, అఫ్జల్, నరహరి, రవికుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

– ఆదిత్య

ద

# పదాలను నినాదాలు చేసిన పోరాట గద్దెలు 'గిద్దె రామనర్సయ్య' పాటలు

అడవి ఆకురాలిన శబ్ధాన్ని పసిగట్టి పాటై ప్రవహించిన రామసక్కని సంగీతం, అది కణకణ మండే డప్పు సప్పుళ్ళలోంచి ఉబికి వచ్చిన రగం. ఆ పదాలకు సమ్మక్క సారక్కల శౌర్యముంటది. మాదిగ జీవన సౌందర్యంతో పాటు తెలంగాణ పౌరుషం తాండవిస్తుంది. చిర్రా, చిటికెనపుల్లతో పోటీపడి చిందేస్తది. చీకటి కోటల్ని పెకలించే ఆయుధమైతది. అందుకే ఆ అక్షరాలను మనసు పల్లకిలో ఊరేగిద్దాం. రాగరంజితమైన ఆ పదాలను తాకి పరవశిద్దాం. మట్టి పరిమళాలను వెదజల్లి తెలంగాణ ఉద్యమంలో పల్లెని, ప్రకృతిని ఏకంచేసి, పదాలను యుద్ధనినాదాలుగా ప్రతిధ్వనింప చేసిన కవి గాయకుడు గిద్దె రామనర్సయ్య గురించి మన 'అలుగెల్లినపాట' లో...



కళలకు పుట్టినిల్లు, కమ్మనైన అమ్మమనసుకు ఆనవాళ్ళు కాకతీయ రాజులేలిన ఓరుగుల్లు. ప్రస్తుతం వరంగల్లుగా పిలువబడుతున్న ఈ జిల్లా విప్లవోద్యమ చైతన్యానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు. వరంగల్లు జిల్లా తొర్రూరు మండలం చిట్యాల గ్రామంలో గిద్దె సాయిలు-సోమ నర్సమ్మ దపంతులకు కలిగిన నలుగురు సంతానంలో రామనర్సయ్య ఏకైక మగ సంతానం. వరుసగా హేమలత, రామనర్సయ్య, స్వప్న, సునిత. వీరిలో స్వప్న చనిపోయింది. గిద్దెసాయిలు తన కుటుంబాన్ని పోషించడం కోసం అనేక బాధలు పడ్డడు. జీతమున్నడు. కూలి పనులు చేసిండు. కలో గంజో కలిగింది తలాఇంత పెట్టి కష్టాలకు ఎదురీదిండు. గిద్దె సాయిలు సాటింపేస్తే ఊరుఊరంత ధ్వని పలికేది. కర్మ సిద్ధాంతాన్ని నమ్ముకొని కలిగించే తనదిగా పడరానిపాట్లు పడుతూ సంసారాన్ని ఎల్లదీసిండు. ఇల్లు గవడమే కష్టంగా ఉన్న సాయిలు పిల్లల్ని గొప్పగా సదివించే అవకాశం లేకుండా పోయింది. ఇట్ల బతకుంతా పోరాటంగ బతికిన సాయిలు ఆరేండ్ల కింద ఇంటిని శోకసముద్రంలో ముంచి ఆయన కాలంజేసిండు. గొప్ప కవిగా తెలంగాణ ఉద్యమంలో ధూంధాం జేసిన కళాకారున్ని కన్నతండ్రి తన కొడుకు ఉన్నతిని చూడకుండానే కన్ను మూసిండు. తెలంగాణ ఉద్యమానికి ఎన్నో అద్భుతమైన పాటల్ని అందించి వేదికలమీద అలరించిన గిద్దె రామనర్సయ్య గురించి మాట్లాడడమంటే పాటని గురించి మాట్లాడడమే. పాట పుట్టుకని గురించి మాట్లాడడమే.

మార్చి 16, 1977లో జన్మించిన గిద్దె రామనర్సయ్య స్థానిక పాఠశాలలోనే పదవ తరగతి వరకు చదువుకుండు. పాఠశాల దశ లోనే పాటలు పాడి అనేక బహుమతులు గెలచుకుండు. రామనర్సయ్య పాటవైపు రావడానికి, ఇంత గొప్పగా పాడడానికి ప్రధానమైన కారణం ఆయన మేనమామ ఈదురు వెంకన్న. ఈయన ప్రస్తుతం ఆర్.టి.సి.హనుమకొండ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తుండు. అయితే వెంకన్న ఇప్పటకీ మంచి గాయకుడు. ఉద్యమ భావజాలంతో పాటలు రాస్తూ, పాడుతూ ఉండేవాడు. మేనమామ వెంకన్నను గమనించిన రామనర్సయ్య చిన్నప్పటి నుంచే పాటలు పాడడం అలవాటైంది. మేనమామ సాన్నిహిత్యం, శిక్షణ రామనర్సయ్యను గొప్ప గాయకుడిగా మలిచిందదనంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. ఈ విధంగా రామనర్సయ్యకు తన మేనమామ వెంకన్న పాటల గురువుగా మారిండు. ఇట్ల ఆటపాటల తరంగమైన గిద్దె రామనర్సయ్య సదువు ఇంటర్‌మీడియట్‌లోనే ఆగిపోయింది.

రామనర్సయ్య అంటేనే పాట, పాటంటేనే రామనర్సయ్య. పాటతో అంత విడదీయలేని బంధాన్ని పెనవేసుకున్న పాటమ్మ ముద్దుబిడ్డ గిద్దె రామనర్సయ్యను గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే ఆయన తన గురించి రాసుకున్న పాటతోనే ఈనాటి మన పాట ప్రవాహాన్ని కొనసాగిద్దాం.

**"ఏ తల్లి గన్నదొ నిన్ను గిద్దే రాం నర్సయ్య... ఆ కన్నతల్లికే వందానాలయ్య**

**నినుగన్నా పల్లె సల్లగుండాలయ్య నువ్వు నమ్ముకున్న పాట పురుడుబోయాలయ్య**

**జానపదుల పల్లెతల్లి ముద్దుబిడ్డవో పేదల్లో ఇంటిలోన పేగుబంధమో**

**పల్లెతల్లి పాటల్ని పాడుతుంటవో.. నువ్వు పస్తులుండే సంగతినే మరిసిపోతవో.."** అంటడు.

పాటకు పనిలోని కష్టాన్ని మరిపింపజేసే గొప్పగుణంతో పాటు ఆకలి దూపను సైతం మరిపింప జేస్తది. పాటతోని పస్తులున్న సంగతినే మరిచిపోతడు. పాటను కడుపునింపే కన్నతల్లిగా భావిస్తడు.

పాటే ప్రాణప్రదంగ జీవనాధారంగా బతికిండు. సామాజిక మార్పులో పాట ప్రాధాన్యతను గుర్తించిండు. అందుకోసం కవులు, కళాకారులు ఎట్ల తపిస్తరో ఏ విధంగ జీవిస్తరో అనే అంశాన్ని అక్షరీకరించి అద్భుతంగా చేసిండు, రామనర్సయ్య రాసిన తన మొదటి

పాటతోనే తనలోని కవిని, కళాకారున్ని ఈ ప్రపంచానికి చాటి చెప్పిండు.

**"ప్రజల కొరు పాటుపడే కళాకారులం పగలు రాత్రి వెలుగు నిచ్చె సూర్యచంద్రులం**

**లాలిపాటపాడి అమ్మ పాట నేర్పెనా ఊయలలో ఊపుతు నను ఊరడించెనా**

**అమ్మరుణం తీర్చె శక్తి లేకపోయెనా నా రచనే మా అమ్మ పాట రుణం దీర్చెనా**

**గలగల గజ్జెలు గట్టి గంతులేసినం గళం విప్పి కమ్మనైన పాటపాడినం**

**గజ్జెగట్టి ఆడినా గతికిలేనివాళ్ళమే గళం విప్పి పాడినా ఈ పూటకులేనోళ్ళమే**

**దప్పుడోలు మద్దెలతో దరువులేసినం పల్లెసుద్దులు భాగోతాలెన్నో ఆడినం**

**సద్దులెన్ని జెప్పినా సుఖం లేదురా భాగోతాలాడిన బతుకు దెరువు లేదురా"**

కళాకారులకు సప్పట్లు, సన్మానాలు, ప్రశంశలు తప్ప వాళ్ళ ఆకలి గురించి గాని, కుటుంబాన్ని గురించి గాని ఆడిగేటోల్లుండరు. ఎట్ల బతుకుతున్నరని ఆలోచించే నాథులే ఉండరు. ఎవరు ఏమిచ్చినా, ఇయ్యకున్నా రామనర్సయ్య ఏనాడు పాటను విడిచి బతకలేదు. అప్పటికే గద్దర్, గూడ అంజన్న, గోరటి వెంకన్న, అందెశ్రీ, జయరాజు, వరంగల్ శ్రీనివాస్, వంటి వాళ్ళు రాసిన పాటల్ని వింటూ పాడుకుంటూ తనకుతాను దిశా నిర్దేశం చేసుకుండు. చివరికి ఆ పాటే బతుకుదెరువయ్యింది. పాటే ప్రాపంచిక దృక్పథాన్ని అలవర్చింది. ఈ క్రమంలోనే 1996 మేనెలలో అరుణతో రామనర్సయ్య వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి ఒక బిడ్డ ఉంది. పేరు విశ్లేషిత. రామనర్సయ్య పాటలైన, మాటలైన విడమరిచి చెప్పినట్టు ఉంటయి. ఎక్కడ దాపరికం ఉండదు. ఎవరికి భయపడడం ఉండదు. అందుకేనేమో తన భావాలకు అనుగుణంగ తన బిడ్డకు విశ్లేషిత అనే పేరు పెట్టుకున్నడు. గద్దర్ రాసిన "వద్దురా ఓ కొడుకా రాక్షసుల రాజ్యంలో.. " అనే పాటని రామనర్సయ్య నిత్యం మననం చేసుకుంటడు. రామనర్సయ్య ఎంతో ఇష్టంగ పాడుకునే ఈ పాట ఆయనకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. ఒకరకంగ రామనర్సయ్యని వెంటాడిన పాట ఇది. ఒక్కచోట నిమ్మలంగ కూసోనియ్య నిత్యం నాలుక మీదనే నాట్యం చేసింది. ఆ పదాల ఆర్తిలోంచి, ఆలోచనల్లోంచి పుట్టిందే ఈ పాట.

పేదలకు అండగా నిలిచిన పోరాటయోధుల్ని తలుసుకుంటడు. తానెప్పుడు అటువైపుగా అడుగులు వేయనప్పటికి వాళ్ళ త్యాగాన్ని ఆరాదిస్తడు. అదే క్రమంలో దూరమైన కొడుకును తల్చుకొని తల్లిపడే వేదనను అక్షరీకరించి మన కంటిమీద కునుకు లేకుండ చేస్తడు. **"ఎక్కడున్నావురా కొడుకా.. ఆ.. ఆ.. నువ్వు యాడికో తివి సిన్న కొడుకా**

**నా ఆయుష్షు బోసుకున్నోడ నువ్వు అందరిలో చిన్నవాడ**

**కళాకారులకు సప్పట్లు, సన్మానాలు, ప్రశంశలు తప్ప వాళ్ళ ఆకలి గురించి గాని, కుటుంబాన్ని గురించి గాని ఆడిగేటోల్లుండరు. ఎవరు ఏమిచ్చినా, ఇయ్యకున్నా రామనర్సయ్య ఏనాడు పాటను విడిచి బతకలేదు. అప్పటికే గద్దర్, గూడ అంజన్న, గోరటి వెంకన్న, అందెశ్రీ, జయరాజు, వరంగల్ శ్రీనివాస్, వంటి వాళ్ళు రాసిన పాటల్ని వింటూ పాడుకుంటూ తనకుతాను దిశా నిర్దేశం చేసుకుండు.**

**ఆకలైతే అడిగెటోడ అందరాకలిని తెలుసుకున్నోడ**

**అందరిని విడిచినావా.. ఆ.. ఆఈ అమ్మనే మరిచినావా..**

**కూడు తిందామంటే కొడుకా గా కూడులో నీ గుర్తె కొడుకా**

**నీళ్ళు తాగి నిద్దరోతే కంటిరెప్ప కింద నీవె కొడుకా**

**నా కంటిపాపవయ్యి రారా.. నా కంటనీరు తుడిచిపోరా.."**

ఇట్లాంటి ఎన్నో పాటల్ని రాసిన గిద్దె రామనర్సయ్య గొప్ప ప్రకృతి ఆరాధకుడు. ఎందుకంటే ఏ పాటలో చూసిన పచ్చని ప్రకృతి అందాలు, పల్లె జీవన సౌందర్యమే తన పదాల నిండ కుప్పలుపోసినట్టు కనిపిస్తాయి. మొత్తంగా పల్లెని తన పాటల్లోకి వంపుకుంటడు. కమ్మగా అమ్మ పాలు తాగినంత హాయిగా పాడుకుంటడు. రామనర్సయ్యకు తన ఊరన్న, పేరన్న, చెట్టన్న, చెరువన్న చెప్పలేనంత ప్రేమ. నిత్యం తన కండ్లముందు ఉండే గొర్లు, బర్లు, కోళ్ళు, మేకలు, పశువులు, పక్షులు ఒక్కటని కాదు మొత్తం ఊరునే పాటగా కైగడతడు. పదమై ప్రతిధ్వనిస్తడు. ఊరే వల్లకాడై వలసపోతే తప్ప బతకలేమన్నంత దౌర్భాగ్యస్థితిని తలచుకొని దుఃఖ:సాగరమైతడు. పల్లెలు పట్టుగొమ్మలన్న కాలం నుంచి నిన్న మొన్నటి సమైక్య పాలనలో పట్టుదప్పిన పల్లెని, కన్నతల్లిని తలుసుకొని సోకంబెడతడు.

**"ఉన్నాది మా ఊరు పేరుకు ఆడ బతుకుదెరువే లేదు పల్లెకు**

**సక్కాని నా పల్లె పాడిపంటలు గల్ల పరువుగల్ల పల్లే ప్రేమాగల్ల తల్లి**

**కొక్కొరోకో అంటె తెల్లారే నా పల్లె తల్లీరో నా పల్లె తల్లడిల్లీ పాయె**

**తాటాకు గుడిసెలల్లో కరకర లాడేదిా వాకిట్ల సాంపితో సక్కంగ మెరిసేది**

**ఎర్రమన్ను దెచ్చి ఇల్లలికి పూసేదిా గుడిసెలన్ని ఊడి వల్ల కాడయ్యే వల్లే**

**అల్లమెల్లి గడ్డ పల్లెకొస్తే సాలు - మా అయ్య సాయిలు సాటింపు వేసేది**

**కచ్చీరు కాడంటు కలెదిరిగి వచ్చేది -సాటింపు లేదాయే చిన్నాబాయె పల్లే"** అంటూ రామనర్సయ్య పల్లెని తలుచుకున్న తీరు మొత్తం తెలంగాణ పల్లెల్ని కదలించింది. సాటింపేకాదు. ఆసది పెద్దజేసిన కన్నతండ్రి కూడ లేడన్న కఠోర సత్యాన్ని అద్భుతమైన కవిత్వం చేస్తడు. "నా జిల్లా వరంగల్లు కళలకు పుట్టినిల్లూ వెన్నంటిన హనుమాకొండ కన్నకడుపు సల్లాగుండ కాకతీయులేలిన అడ్డ కాళోజీని కన్న గడ్డ తెలంగాణ గుండెనిండ సాకలి ఐలవ్వ జెండ"

అంటూ తన చుట్టూ ఉన్న అంశాలనే దాదాపు పదిహేను సంవత్సరాలుగా పాటలు రాస్తున్న గిద్దె రామనర్సయ్య ఎన్నో ప్రదర్శనలు చేసిండు. తెలంగాణ మలివిడత పోరాటం ఉధృతమైతున్న కాలంలో గిద్దె రామనర్సయ్య తన పాటలకు మరింత పదునుపెట్టిండు. ఈ క్రమంలో ఎక్కడో మారుమూల పల్లెలో మార్మోగుతున్న రామనర్సయ్య పాటని స్టేజీమీదికి తీసుకొచ్చిన ఘనత తన మిత్రుడు, అప్పుడు ఉగ్ర శ్రీనుకే దక్కుతుంది. అట్ల తెలంగాణ ఉద్యమంలో రసమయి బాలకిషన్‌తో కలిసి లెక్కలేనన్ని ధూంధాంలు చేసిండు. మొత్తం తెలంగాణ ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన పాట

**"కొమ్మాలల్లా కోయిలమ్మ పాటబాడుతన్నది జై తెలంగాణ అన్నది**

**అలసిపోయిన లేగదూడ గంతులేస్తున్నది కాలి గజ్జెగదుత నన్నది**

**ప్రాణంబోయే మేకాపిల్ల దప్పునైతనన్నది దండోర వేస్తనన్నది**

**ఇప్పుడు బుట్టిన లేగదూడ దుంకులాడ్తనన్నది ధూంధాం జేస్తనన్నది**

**గోరుకొల్లు బడువంగ కూతబెడుతునన్నదిా పోరుబాటనై తనన్నది**

**చెట్టు చేమాలన్ని ఊగి ఊపిరోస్తమన్నయి - ఉద్యమాలు జేస్తనన్నయి**

**పొడిసేటి పొద్దు గూడ పొద్దుగూకనన్నది- పోరుకు సైయన్నది"** అంటూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రతి ఒక్కరు నడుంగట్టింద్రన్న సంగతిని వివరిస్తరు. అందరికి అర్థమయ్యే అతి సాధారణ పదాలతో అసాధారణ భావాన్ని వ్యక్తీకరిస్తడు. అనేక కుట్రలు, కుతంత్రాలతో కూడిన సమైక్య పాలనతో అమయాకులైన తెలంగాణ బిడ్డలు ఒక్కక్కరుగా నేలరాలుతున్న దృశ్యాలను చూసి పోరాటయోధుల్ని కన్నతల్లులకు దండం పెడతడు. అదరక బెదరక యుద్ధరంగంలో ముదుకురికే శక్తినిచ్చిన కన్నతల్లుకు వందనాలని కడదాక పోరాడే స్ఫూర్తినిస్తడు.

**"అమ్మా ముద్దుబిడ్డను గన్నావమ్మ.. అమ్మా తొలిపొద్దును గన్నావమ్మ**

**కన్నందుకు నీ కాళ్ళకు దండాలు బెడుదునా.. కన్నీళ్ళతో కాళ్ళుగడిగి రుణం దీర్చుకొందునా**

**పురినిటినొప్పుల బాధ తెలంగాణ కంకితమా.. పురుడోసుఉన్నాడో ఉదయించిన సూరిడిలా**

**నేలమీదడుగు బెడితే పుడిమి పులకరించిందా.. ప్రకృతే పలకరించి హెూరు నూరిపోసిందా**

**అడవిలో ఆకులన్ని అలముకొని ముద్దాడి మోదుగుపూల మోము తిలకాన్ని దిద్దుకొని**

**ఎర్రని వర్ణములు ఆ కండ్లను తెచుకుకొని ఎదురుతిరిగి పోరాడే ధైర్యాన్ని ధారబోసి"** ॥అమ్మా॥ అంటూ పొడిసేటి పొద్దు పొడుపై కాసోజు శ్రీకాంతువంటి ఎందరో అమరవీరులను అలింగనం చేసుకుంటడు. మొకం చాటేసిన వానచినుకుని రమ్మని బతిలాడ్తడు. ఒక్క దల్లన్న వచ్చిపోవాలని వేడుకుంటడు.

**అందరికి అర్థమయ్యే అతి సాధారణ పదాలతో అసాధారణ భావాన్ని వ్యక్తీకరిస్తడు. అనేక కుట్రలు, కుతంత్రాలతో కూడిన సమైక్య పాలనతో అమయాకులైన తెలంగాణ బిడ్డలు ఒక్కక్కరుగా నేలరాలుతున్న దృశ్యాలను చూసి పోరాటయోధుల్ని కన్నతల్లులకు దండం పెడతడు. అదరక బెదరక యుద్ధరంగంలో ముదుకురికే శక్తినిచ్చిన కన్నతల్లుకు వందనాలని కడదాక పోరాడే స్ఫూర్తినిస్తడు.**

**"సినుకమ్మ సిన్నబోయిందో.. మా పల్లెంత గుండె బగిలిందో**
**అలిగినా వెందుకే సినుమ్మా ఒక్క దల్లన్న వచ్చిపోవాలమ్మా**
**పాలుదాగే పాప అడిగింది నీ రాకకై ఎదురు చూసింది**
**తల్లి రొమ్ముపాలు పిండింది ఆ సేనుకు నీరుగా పోసింది**
**పాలన్న తాపిపో వానమ్మ ఒక్క దల్లన్న వచ్చిపో సినుకమ్మ"**

ఇట్ల తెలంగాణ కరువు పరిస్థితులను కళ్ళకు కట్టినట్టు చూపిస్తడు. "నాగలి ఏడ్చింది అమ్మా గొడ్డు గోద తల్లిడిల్లేనమ్మా" అంటూ అనేక సామాజిక, తెలంగాణ పాటల్ని రాసిన గిద్దె రామనర్సయ్య తన పాటల్లో అమ్మలు, అక్కలు పాడుతుంటే విని నేర్చుకున్న పదాలే ఎక్కువని అంటడు. సామాజిక మార్పుకై పరితపించే కవి, గాయకుడిగా గిద్దె రామనర్సయ్య సినిమాల మీద తనకున్న అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్టు చెప్తడు. అర్థంలేని సినిమాలు, సీరియళ్ళతోని సమాజం ఎట్ల పాడైపోతుందో నాటకీయంగ అదరికి అర్థమయ్యే రీతిలో వివరిస్తడు. **"ఏమి సినిమాలు దీస్తున్నరయ్యో ఓ దర్శక నిర్మాతలారా**

**పోకిరి సినిమాను చూసి మా పోరడు గల్లీల గుండ అయ్యిండు మా గుండెల్ల గుణపమయ్యిండు**

**సదువుకోని సక్రమంగ ఉండుమంటె విక్రమార్కుడు జూసి వచ్చిండు అక్రమాలకు అలవాటయ్యిండు"** ఇట్ల తన పాటల ప్రస్థానంలో అనేక ఒడిదుడుకుల్ని చవిచూసిన గిద్దె రామనర్సయ్య 'మయట్టితల్లి, నేలరాలిన మందారాలు' అనే ఆడియో సి.డి.లను రికార్డు చేసిండు. మల్లి అనే లఘుచిత్రంతో పాటు నటుడిగా బతుకమ్మ, వీరతెలంగాణ, పోరు తెలంగాణ, తురుంవంటి సినిమాలు చేసిండు.

తెలంగాణ ప్రజల నాలుకల మీద ప్రతిధ్వనించే పాటల్ని ఆర్.నారాయణమూర్తి తన సినిమాలలో వాడుకుంటడు. అట్ల రామనర్సయ్య రాసిన "కొమ్మాలల్ల కోయిలమ్మ" పాటని "రాజ్యాధికారం" అనే సినిమాలో ఉపయోగించుకున్నడు. సార తాగితే సావుతప్పదనే హెచ్చరికతో అనేక వంగ్యాస్త్రాలను గురిచూసి కొట్టిన గిద్దె రామనర్సయ్య సార పాట అత్యంత ప్రజాదరణ పొందిన పాటల్లో ఒకటి. ఈ బాణీలో ఆయా సందర్భాలకు తగిన అనేక పాటలు వచ్చినయి. అయితే ఈ పాటలో సాకీలోనే గిద్దె రామనర్సయ్య అటు స్వర్గాన్ని, ఇటు నరకాన్ని చూపిస్తడు.

"కల్లుతగినోడు కైలాసమెళ్ళుతడు.. సారాతాగినోడే స్వర్గానికెళ్ళుతడు... ఏమి తాగనోడే.. యమలోకెమెళ్ళుతడు

సారా సారమ్మ సార నా ప్రాణమైతీవమ్మా సార అబ్బ నిన్ను తాగకుంటెనే సార

నా ప్రాణమంత గాయిగాయి సార నిన్ను తాగి నడుస్తుంటె సార భూమి సుట్టు తిరుగుతాంది సార

హె.. నువ్వు దొరకన్నాడు సార అరె సిన్నబోయెనం టుంది కార

బువ్వలేకుంటెమాయె రార ఒక్క పావుసేరు గుద్దు దాము సార

నిన్ను మరువనవ్వ మీద ఒట్టు నా ఇంటికిబోతె పెళ్ళం గొట్టు

నిన్ను దాగి పండుకుంటె ఇంట్ల నేనుచ్చబోస్తే పక్క దడిసె ఎట్ల

పొద్దుగాల తాగకుంట ఉండం తాగి సోయిదప్పెదాక మేము పండం

సారమ్మ నీకో దండం మేము సచ్చేదాక నువ్వో గండం" అంటూ సారా తాగడాన్ని వ్యతిరేకిస్తడు. సామాజిక చైతన్యాన్ని తీసుకురావడంలో ఎంతో ముందున్న కవి కళాకారుడు గిద్దె రామనర్సయ్యకు ప్రజల చప్పట్లే సన్మానపత్రాలు అయినయి. పాటే ఆయువుపట్టుగా జీవితాన్ని మొదలుపెట్టిన గిద్దె రామనర్సయ్యకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ఎనలేని ఆనందాన్ని కలిగించింది. ముఖ్యంగా పాటని నమ్ముకున్న కళాకారులకు ప్రభుత్వం సాంస్కృతిక సారథి ద్వార ఉద్యోగ భద్రతను కల్పించడం మరింత సంతోషాన్ని ఇచ్చింది. అయితే ఏ రంగంలోనైన తన నైపుణ్యానికి సముచిత స్థానం దక్కాలనే ఎవరైనా కోరుకుంటారు. అందుకు ఆయా సంస్థలుగాని, వ్యక్తులుగాని తగిన ప్రోత్సాహం కల్పించాలని అంటడు. సారథి చైర్మన్‌గా రసమయి బాలకిషన్ చేస్తున్న కృషిని ఎంతగానో అభినందిస్తడు. తన సారథ్యం లోనే తెలంగాణ కళలకు మహర్దశ కలుగుతుదనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తడు. ఏదిఏమైనా పాటని గుర్తించి ప్రభుత్వ ఉద్యోగాలిచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉంటానని, బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా తన పాటలు ఉంటాయని "సన్నాబియ్యం చిన్నా పిల్లల చెంతకు జేర్చిండే సారు కేసియారు" అంటూ పాటందుకుంటడు. ఈ విధంగ గిద్దె రామనర్సయ్య ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని, మరెన్నో కీర్తి శిఖరాలను అధిరోహించాలని కోరుకుందాం.

-అంబటి వేకువ
మొబైల్: 94927 55448
మెయిల్: varjj.ambati@gmail.com

## కొమ్మాలల్ల కోయిలమ్మ..

కొమ్మాలల్లో కోయిలమ్మ పాటబాడుతున్నది జై తెలంగా నన్నది
అలిసిపోయిన లేడికూన గంతులేస్తనన్నది కాలిగజ్జెగదుతున్నది
ప్రాణంబోయిన మేకాపల్లి దప్పునైతనన్నది దండోర వేస్తనన్నది
ఇప్పుడుబుట్టిన లేగదూడ దుంకులాడుతున్నది ధూంధాం జేస్తన్నది
॥కొమ్మాలల్లో॥

గోరుకోళ్ళు బడువంగ కూత బెడుతునన్నది-కోడి నిదుర లేపుతన్నది
పిడికెడంత లేడి పిచ్చుక పోరు జేస్తనన్నది- పోరుబాటనైతనన్నది
చెట్టు చేమలన్ని ఊగి ఊపిరైతనన్నయి - ఉద్యమాలు జేస్తనన్నది
పొడిసేటి పొద్దుగూడ పొద్దుగూకనన్నది- పోరుకు సైయంటున్నది
॥కొమ్మాలల్లో॥

నక్కబావ జిత్తులాతో చిత్తు జేస్తనన్నది - పెద్ద ప్లాను గీస్తనన్నది
తెలంగాణ సమరానికి సాలువ సైయన్నది - అది సవాల్ జేస్తనన్నది
పావురాలు ఏకమయ్యి కబురు దెస్తమన్నయి - కాపాడుకుంటమన్నయి
జీవారాసులక్కటయ్యి జెండాబట్టుతున్నయి- జేజేలు పలుకుతున్నయి
॥కొమ్మాలల్లో॥

నారుమడిలో నీరునైత వాటాపంచమన్నయి
-వాగు వంకాలడు గుతున్నయి
కృష్ణమ్మ గోదారమ్మ కదలివస్తనన్నయి - కన్నీరు వద్దంటున్నయి
చల్లగాలి వీచి పోరుకు ఊపిరైతనన్నది- అది పురుడుబోస్తనన్నది
పండువెన్నెల గాసి పల్లె పల్లెనడుగుతున్నది- తెలంగాణ గావాలన్నది
॥కొమ్మాలల్లో॥

అడవీలున్న ఆకులన్ని అలికిడి జేస్తన్నయి
- అలాయ్‌బలాయ్ దీసుకున్నయి
చీమలన్ని జంటబట్టి ర్యాలి దీస్తమన్నయి - మేం రణం జేస్తనన్నయి
చెట్టుకొమ్మలన్ని లేసి బాకులైతమన్నయి -బంధూకులైత్తమన్నయి
వడ్డపిట్ట ముక్కుతోటి గన్ను జేస్తనన్నది- తెలంగాణను దెస్తనన్నది
॥కొమ్మాలల్లో॥

మోదుగుపూలు అమరులాకు దండాలైతనన్నయి
- మెడల దండాలేస్తననన్నయి
ఎర్రటి ఆ మందారాలు ఎదలకద్దుకొమ్మని
- వీరుల మదిల తలుచుకున్నయి
వాన చినుకు రాలి స్థూపం కడిగివేస్తనన్నది - అది కండ్లాకద్దుకున్నది
అమరుల త్యాగాల మొలక చిగురు వేస్తనన్నది- తెలంగాణ జూస్తనన్నది
॥కొమ్మాలల్లో॥

- గిద్దె రామనర్సయ్య

# జ్ఞాపిక అనగానే గుర్తొచ్చేవి...

# పెంబర్తి మెమెంటోలు

**జ్ఞా**పిక అనగానే గుర్తుకొచ్చేవి పెంబర్తి హస్తకళారూపాలు అంటే అతిశయోక్తి కాదు. వరంగల్ జిల్లా జనగాం మండలానికి చెందిన గ్రామం పెంబర్తి హస్త కళాఖండాలకు దేశవ్యాప్తంగా గొప్ప పేరున్నది. ఇక్కడ తయారయ్యే ఇత్తడి కళారూపాలు, నగిషీలు, జ్ఞాపికలు ప్రసిద్ధి కాకతీయుల కాలం నుండి పేరొందాయి.

పెంబర్తి హస్తకళాకారుల లోహపు రేకుల కళను పెంబర్తి లోహ హస్తకళలుగా వ్యవహరిస్తారు. పెంబర్తి లోహ హస్తకళలు ఎక్కువగా ఇత్తడి, కంచు లోహాల మీద ఉంటాయి. కాకతీయుల కాలం నుండి పెంబర్తి గ్రామం హస్త కళలకు నిలయంగా మారింది. కాకతీయ శైలిని అనుసరించడం వీరి కళ ప్రత్యేకత.

పూర్వకాలం నుంచి పెంబర్తి గ్రామం హస్త కళలకు నిలయంగా మారింది. పూర్వం కాకతీయుల పాలనలో రాజకుటుంబానికి అవసరమైన పనిముట్లను అందించిన వీరు రాను రాను తమ నైపుణ్యాన్ని పెంచుకొని ప్రపంచ ఖ్యాతిని ఆర్జించారు. యాదగిరి గుట్ట నుండి తిరుపతి వరకు- గుడి, బడి సంబంధిత పనులను, సచివాలయం నుండి కళాతోరణం వరకు ప్రభుత్వ, ప్రైవేటు మెమొంటోలు ఇక్కడ తయారు చేస్తారు

**చరిత్రపుటల్లో...**

ఈ ప్రాంతం లోహపు రేకుల కళకు ప్రసిద్ధి గాంచినది. ఈ లోహపు రేకులను పురాతన కాలం నుంచి కూడా దేవాలయాలకు, రథాలకు అలంకరించడానికి ఉపయోగించేవారు. మధ్యలో కొంతకాలం ఈ కళకు ఆదరణ లేక అంతరించిపోయింది. తర్వాత నిజాం నవాబు కాలంలో ఈ కళను ప్రభువులు బాగా ఆదరించడం ఈ కళకు జీవం పోసింది.

**విశేషాలు**

పెంబర్తి హస్తకళాకారులు తయారుచేస్తున్న షీల్డ్స్, మెమెంటోలు, గృహోపకరణాల వస్తువులకు ప్రపంచ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ తయారైన కళాత్మక వస్తువులను అమెరికా, జర్మనీ, బెల్జియం, జపాన్ దేశాలు దిగుమతి చేసుకుంటున్నాయి. వీరు వివిధ దేవాలయాల గోపురాలకు, ఇత్తడి, రాగి, వెండి, బంగారు తాపడాలను తయారు చేశారు. ధ్వజస్తంభ తొడుగులు, గోపుర కలశాలు, కవచాలు రూపొందించడంలో వీరు దిట్ట. లోహాలు, లోహ మిశ్రమాలతో కుడ్యాలంకరణ చేయడంలో, గీతోపదేశం, దశావతారాలు, అష్టలక్ష్మీ, సీతారామ పట్టాభిషేకం, కాకతీయ కళాతోరణం, చార్మినార్, గణేష్, లక్ష్మీదేవి, సరస్వతి, హంస తదితం రూపాలను హృద్యంగా ఆవిష్కరిస్తారు.

**తెలంగాణకు ఖ్యాతి :**

కంచు కళా వైభవానికి పుట్టినిల్లయిన పెంబర్తి గ్రామానికి ప్రపంచ పటంలో సుస్థిరమైన పేరు ప్రతి ఉన్నాయి. కాకతీయుల కాలం నుండి పెంబర్తి గ్రామం హస్త కళలకు నిలయంగా మారింది. పెంబర్తి కళారూపాలు అనేకం గొప్ప కళాఖండాలుగా దేశ విదేశాల్లో వర్ధిల్లుతున్నాయి. సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను, దేవతల విగ్రహాలను, కళాఖండాలను, గృహ అలంకరణ వస్తువులను- గుడి, బడి మొదలైన అనేక హస్త



కళారూపాలను కళాకారులు చేతి నైపుణ్యంతో తయారు చేస్తారు.

**కాకతీయుల కాలం నుంచి...**

కాకతీయ రాజుల కాలంలో కళలు పరిఢవిల్లాయి. రామప్ప, వేయి స్తంభాల గుడి, ఏకశిలా తోరణాలు మాత్రమే కాదు, ఈనాటికీ తెలంగాణ మారుమూల పల్లెల్లో సైతం నాటి శిల్పకళ సజీవంగా అబ్బురపరుస్తుంది. కానీ, కళాకారులు చెల్లాచెదురయ్యారు. వలస వెళ్లారు. ఊరూరా ఉన్న వారిలో కొందరు నవాబ్ లను ఆశ్రయించారు. వారి కళకు ముగ్ధులైన నాటి ఏలికలు వారికంతా ఒకే చోట నివాసాల ఏర్పాటుకు సంకల్పించారు. అలా రూపుదిద్దుకున్నదే 'పెంబర్తి'.

హైదరాబాద్‌కు 55 మైళ్ల దూరంలో ఉన్న ఆ ప్రాంతాన్ని గుర్తించి వారికి అక్కడ నివాసాలు కల్పించారు. అది అప్పటికే ఉనికిలో ఉన్న జనగామ సమీప ప్రాంతం. అంతకు ముందు అయిలోని, తంగెళ్లపల్లి, మల్యాల, పోలంపల్లి, బెజ్జంకి తదితర గ్రామాల్లో ఉ

న్న కళాకారులంతా పెంబర్తి ప్రాంతానికి ఉపాధి కోసం తరలి వచ్చారు. కాలక్రమంలో గ్రామ పేర్లే వారి ఇంటిపేర్లుగా స్థిరపడ్డాయి. నవాబ్, ఆయన పరివారం, అధికారుల అభిరుచులకు అనుగుణంగా పెంబర్తి కళాకారులు ఆకృతులు తయారు చేసేవారు. అత్తర్‌దాన్, పాన్‌దాన్ నుంచి మొదలుకొని దర్బార్ హాల్‌లోని వివిధ కళాకృతులు, సింహాసనం, దాని అలంకారాలు తయారు చేసేవారు. రాగి, ఇత్తడి, కంచు లోహాల మిశ్రమంతో వీరు చేసే కళాకృతులు కళా ప్రేమికుల హృదయాలను నాటి నుంచి నేటి దాకా దోచుకుంటూనే ఉన్నాయి. నగిషీలతో గంగాళాలను వివిధ పరిమాణాల్లో తయారు చేయడం వీరికే చెల్లింది. దేవాలయాలలో మూల విరాట్టు నుంచి ఎన్నెన్నో విగ్రహాలను తయారు చేసిన ఘనత వీరి సొంతం. గీతోపదేశం, దశావతారాల చిత్రికలను లోహంతో తయారు చేసి ఎలాంటి క్రను వాడకుండా గోడలపై తాపడంలో నేర్పరితనం ఎప్పటికీ పెంబర్తి కళాకారులదే అగ్రాసనం! సంప్రదాయంగా వీరిది పూర్తిగా చేతి పని.

**లోగోలు.. షీల్డులు.. సమస్తం**

తొలి తెలుగు ప్రపంచ మహాసభలకు (1975) లోగోలు, షీల్డులను తయారు చేసిన ఘనత వీరిదే. అంతకు ముందే ఐదో దశకం ఉత్తరార్థం నుంచి అయిలా చారి అనే కళాకారుడు ఈ గ్రామ ఘనతను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. ఆయనకు రాని అవార్డు లేదు. సన్మానించని రాష్ట్రపతి, ప్రధానులు లేరంటే అతిశయోక్తి కాదు. ఆయన స్థాపించిన విశ్వకర్మ సహకార సంస్థను ఎందరో గవర్నర్లు, ముఖ్యమంత్రులు పెంబర్తికి వెళ్లి స్వయంగా సందర్శించారు. ఆయన గ్రామంలోని కళా కారులకు ప్రాతః స్మరణీయులు. 1956లో అయిలా చారి నేతృత్వంలో 'విశ్వకర్మ బ్రాస్, కాపర్, సిల్వర్, ఇండస్ట్రియల్ సొసైటీ' ఏర్పాటైంది. ఆయన పర్యవేక్షణలో కేంద్రప్రభుత్వం 30 మాసాల శిక్షణ కోర్సును ప్రారంభించింది. అందులో శిక్షణార్థులకు డ్రాయింగ్, డిజైనింగ్ నేర్పేవారు. ఆయన హయాంలో జపాన్ దేశస్తులు సైతం హోమ కలశాలను ఇక్కడి నుంచే తయారు చేయించి తీసుకెళ్లారు.



**తాపడ రారాజులు**

తాపడ కళలో పెంబర్తి వాసులను మించిన వారు కానరారు. వివిధ దేవా లయాలపై ఉన్న ఇత్తడి, రాగి, వెండి, బంగారు తాపడాలను తయారు చేశారు. ధ్వజస్తంభ తొడుగులు, గోపుర కలశాలు, కవచాలు రూపొందించడంలో వీరు దిట్టలు. లోహాలు, లోహ మిశ్రమాలతో కుడ్యాలం కరణ చేయడంలో వారు అద్వితీయులు. హైకోర్టు భవనంపైనున్న లోహ తాపడం ఇక్కడి కళాకా రుల చేతుల్లో రూపుదిద్దుకున్నదే. మహారాష్ట్రలోని తుల్జాభవానీ మాత దేవాలయంలో వీరి కళాకృతులు ఉన్నాయి. కాకతీయ శైలిని అనుసరించడం వీరి కళ ప్రత్యేకత. ఆదరణ కరువై కళాకారులు పట్టణ ప్రాంతాలకు తరలివెళ్లి ఇతర వృత్తుల్లో అవకాశాలు వెతుక్కుంటున్నారు. చాలా మంది వంటపాత్రల తయారీకే పరిమిత మయ్యారు. అలంకరణ వస్తువులు, బంగారు సిగరెట్ పెట్టెలు, యాష్ ట్రేల పైకి వారి కళ ప్రసరించింది. వీరు ఇత్తడి లోహంతో తయారు చేసే గోడ దీపాలకు (1950లలో) ఆస్ట్రేలియాలో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కళాకారులకు ఉత్పత్తికి అవసరమైన నిధుల లేమితో ఆ అవకాశాన్ని వినియోగించుకోలేకపోయారు.

**ఇ-కామర్స్ ద్వారా అమ్మకాలు**

పెంబర్తి బ్రాస్ సొసైటీని స్ఫూర్తి పథకం కింద అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర హస్తకళల అభివృద్ధి సంస్థ కమిషనర్ కుంతాటి గోపాల్ తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో 70 కార్యాలయాల ద్వారా అభివృద్ధి అధికారులు హస్త కళాకారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వడం, గ్రూపులు, ఫెడరేషన్లు ఏర్పాటుచేసి వారికి ముద్ర పథకం ద్వారా బ్యాంకు రుణాలు, బీమా సదు పాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్మల్, పెంబర్తి వంటి ప్రాంతాల్లో 1.50లక్షల మంది కళాకారులు వివిధ సొసైటీలు, సంస్థల ద్వారా ఆయా రంగాల్లో ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ముంబై నుంచి ముడిసరుకు తీసుకువచ్చి స్థానికంగా ఒక బ్యాంకు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా ఉందన్నారు. ఒకేచోట సామూహికంగా పనిచేసేందుకు వర్క్‌షెడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అభివృద్ధి చెందబోతున్న యాదాద్రిలో పెంబర్తి బ్రాస్ ఎంపోరియం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉందన్నారు. త్వరలో హస్తకళలకు సంబంధించి ఒక వెబ్ పోర్టల్ దేశవ్యాప్తంగా రూపొందించి ప్రత్యేక యాప్ ద్వారా కళాకారులు తయారుచేసే వస్తువులను రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ, సొసైటీల ద్వారా ఇ-కామర్స్‌తో అమ్మకాలు సాగించాలని నిర్ణయించామన్నారు.

కళాకారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఆధునిక ఉత్పత్తుల తయారీకి అవకాశం కల్పించాలని స్థానిక కళాకారులు వినతిపత్రం అందజేశారు.

**కీర్తితోరణం వెనుక పెంబర్తి కళ!**

ఓరుగల్లు ఘనమైన వారసత్వ సంపదకు ఇంతకాలం గుర్తుగా ఉన్న కాకతీయుల శిలాతోరణం ప్రభుత్వ అధికారిక చిహ్నంగా మారింది. కాకతీయులు అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది కీర్తి తోరణం. వరంగల్, తెలంగాణ, తెలుగు ప్రజలను సింబాలిక్‌గా చూపించేందుకు కాకతీయుల కీర్తి తోరణాన్ని మించిన చిహ్నం మరొకటి లేదు. కాకతీయుల కీర్తితోరణానికి ప్రచారం తీసుకురావడంలో పెంబర్తి గ్రామానికి చెందిన ఐలాచారి కీలకపాత్ర పోషిం

చారు. 1973లో వరంగల్ ఇండస్ట్రియల్ ఏరియాలో కొత్తగా ఆపే ట్రాక్టర్ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకుడు ఆహూతులకు ఇచ్చేందుకు ఏదైనా జ్ఞాపికను తయారుచేయమని కళాకారుడు ఐలాచారిని కోరగా... కాకతీయ కీర్తితోరణం మధ్యలో ఆపే ట్రాక్టర్ ఉండేలా ఓ జ్ఞాపికను తయారు చేశారు. షోరూం ఫంక్షన్‌లో ఆ జ్ఞాపిక హైలెట్‌గా నిలిచింది. అక్కడికి వచ్చిన ప్రతిఒక్కరూ ఆ జ్ఞాపికపై ప్రత్యేకంగా మాట్లాడుకున్నారు.

**ప్రపంచ కీర్తికి నాంది**

1974లో రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించి లోగోను రూపొందించాల్సిందిగా కళాకారులను కోరింది. దీంతో గతంలో పేరు తెచ్చిన కాకతీయ కీర్తి తోరణం ప్రధానంగా డిజైన్ రూపొందించారు. అప్పటి ముఖ్యమంత్రి వెంగళరావు ఈ డిజైన్ చూసి ముగ్ధుడై ఆ సభలో బహూకరించేందుకు 200 జ్ఞాపికలు కావాలంటూ అక్కడికక్కడే ఆర్డరు ఇచ్చారు. ఒక్కో జ్ఞాపిక తయారీకి రూ.180 కోట్ చేస్తూ ఐలాచారి టెండర్ వేశారు. ఈ కళాఖండానికి రూ.180 అంటే తక్కువ అని... రూ. 200గా కోట్ చేయమని వెంగళరావు ప్రత్యేకంగా సూచించారు. అంతేకాదు... అదనంగా మరో 300 జ్ఞాపికలు తయారు చేయాలని పురమాయించారు. అలా మొదటిసారిగా కాకతీయుల కీర్తి తోరణం ప్రపంచ వేదికలపై సగర్వంగా దర్శనం ఇచ్చింది. ప్రపంచ తెలుగు మహాసభలు ముగిసిన మూడు నెలలకు నాటి ముఖ్యమంత్రి వెంగళరావు పెంబర్తిని దర్శించారు. ఈ నేపథ్యంలో కీర్తితోరణం డిజైన్‌కు డిమాండ్ అనూహ్యంగా పెరిగిపోయింది. అప్పటి నుంచి వందల ఫంక్షన్లలో వేలాదిగా జ్ఞాపికలు పంచారు. ఆ తర్వాత నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి అయ్యాక పోలీసులకు మెడల్స్ తయారు చేసే పని పెంబర్తి కళాకారులకు అప్పగించారు. గోల్కొండ, చార్మినార్‌లతో కూడిన వివిధ డిజైన్లు ఆయనకు నచ్చలేదు. చివరకు కాకతీయ కీర్తితోరణంతో డిజైన్ తయారు చేయగా... వెంటనే ఆయన ఒప్పుకున్నారు. ఇప్పటికీ ఆ డిజైన్‌తోనే పోలీసులకు మెడళ్లు ప్రదానం చేస్తున్నారు. ప్రస్తుతం కాకతీయ మెడికల్ కాలేజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కాకతీయ యూనివర్సిటీ, కలెక్టరేట్, జిల్లా సరిహద్దులు ఇలా అంతటా కీర్తితోరణాలు నిర్మించారు. ఇలా అన్ని ప్రముఖ స్థలాల ముందు ఠీవీగా నిలబడి అందరికీ స్వాగతం పలికిన కీర్తి తోరణం తెలంగాణ ప్రభుత్వ అధికార చిహ్నంలో భాగమైంది.



**పెంబర్తి విశ్వకర్మ బ్రాస్ సొసైటీ**

పెంబర్తి గ్రామంలో 1990 ముందు వరకు పెంబర్తి విశ్వకర్మ బ్రాస్ సొసైటీ కార్యక్రమాలకు బాగా డిమాండ్ ఉండేది. దాదాపు 100 విశ్వకర్మ కుల వృత్తివారు ఈ వృత్తి మీద ఆధారపడి జీవించే వారు. దేశ విదేశాల ప్రతి నిధులు నిత్యం పెంబర్తి గ్రామానికి వచ్చేవారు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ, అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ తదితరులు పెంబర్తి గ్రామాన్ని సందర్శించారు. నిత్యం గ్రామంలో కంచు పైన సుత్తి దెబ్బల మోత కంచరి వాడల్లో ప్రతిధ్వనించేది. జాతీయ, అంతర్జాతీయ మీడియా వారు, విదేశీ టూరిస్టులతో పెంబర్తి నిత్యం రద్దీగా ఉండేది. విశ్వకర్మ బ్రాస్ సొసైటీ భవనం ఆ రోజుల్లో ఇంద్ర భవనం లాగ ఉండేది. హస్త కళాకారుల వల్ల ఆ గ్రామంలో పెరిగిన సందర్శకుల తాకిడికి- ఇతర వృత్తులవారైన గీత కార్మికులు- ఆరె కటిక, కిరాణ షాపుదారుల వస్తువులకూ బాగా ఆదరణ ఉండేది. ప్రపంచ పటంలో ఒక వెలుగు వెలిగిన పెంబర్తి హస్తకళలు నేడు మసకబారుతున్నవి. ప్రపంచీకరణ, ఆధునికీకరణ- వీరివ్ృత్తి పైన తీవ్రమైన ప్రభావం చూపుతున్నవి. రెండు దశాబ్దల క్రితం ఉన్న హస్తకళల మార్కెట్ నేడు లేకుండా ఉన్నది. సొసైటీలోని సభ్యులు కొందరు సొంత దుకాణాలు పెట్టుకున్నారు. కొంతమంది హైద్రాబాద్‌కు వలస వచ్చి కొత్తగా హస్త కళల షాపులు పెట్టుకొని జీవిస్తున్నారు. ఇత్తడి, రాగి, వెండి మొదలగు వాటికి ధరలు పెరగదంతో మార్కెట్‌లో తగిన రేటు రావడం లేదు. ఉత్పత్తి చేసిన వస్తువులు అమ్ముడు పోక పోవడం, ఆధునిక పద్ధతిలో హస్త కళా ముద్రణ మిషన్లు రావడంతో హస్త కళల వృత్తి రోజు రోజుకూ క్షీణిస్తున్నది. ఇత్తడి స్థానంలో కొత్త పద్ధతి, ఫ్లైవుడ్ షీట్స్ పై స్టిక్కరింగ్ మెమొంటోలు తయారై అవి అన్ని ప్రాంతాలలో అందుబాటులోకి రావడంతో- ఈ వృత్తి దారులకు గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే ఆధునిక పద్ధతులను సైతం వీరు ఎప్పటికప్పుడు చేరదీసుకొని ముందుకు వెడుతున్నారు. ఈ మధ్య కాలంలో విశ్వకర్మ బ్రాస్ సొసైటీ వారు కాకుండా ఇతర కులాలకు చెందిన వారు కూడా చాల వరకు ఈ వృత్తిలోకి వచ్చారు. స్వతహాగా వారు హస్తకళా షోరూంలు ఏర్పాటు చేసుకొన్నారు. తద్వారా దాదాపు వంద మంది వరకు స్వయం ఉపాధి పొందుతున్నారు. స్వయం ఆధారిత వృత్తివారైన హస్త కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా హస్త కళాకారులకు ఇత్తడి, రాగి, వెండి రేకులకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలి. ఆధునికతతో భాగంగా వీరికి హస్తకళా మిషన్లను ప్రభుత్వం కొని ఇవ్వాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్‌లో వీరి వస్తువులకు స్థానం కల్పించి, ప్రభుత్వం ముందుగానే వీరి వస్తువులకు డబ్బు చెల్లించాలి. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న హస్తకళల నైపుణ్యంపైన వీరికి ప్రతి సంవత్సరం వర్క్‌షాపులు నిర్వహించాలి.

పెంబర్తి గ్రామంలో హస్తకళల పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. హస్త కళాకారుల కుటుంబాలకు హస్తకళా సొసైటీ హౌస్ కమ్యూనిటీ ఏర్పాటు చేయాలి. 60 సంవత్సరాలు నిండిన ప్రతి వృత్తిదారుడికి నెలకు రూ. 3000 పెన్షన్ ఇవ్వాలి. వారి కుటుంబాలకు విద్య, వైద్యం అందించాలి. ఎంతో విశిష్టమైన పెంబర్తి హస్తకళలను భవిష్యత్ తరాలకు అందించ వలసిన బాధ్యత ప్రభుత్వం పైన ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం హస్తకళాకారుల జీవితాల్లో వెలుగులు నింపాలి. పూర్వవైభవం తీసుకు రావాలి.

**బ్రాండ్‌నేమ్‌తో బతికేయవచ్చు....**

'పెంబర్తి' అన్న ఒకే ఒక బ్రాండ్ నేమ్‌తో బతికేయవచ్చు. మార్కెట్ అవసరాలకు సరిపడా కళాకృతుల ఉత్పత్తి జరగడం లేదు. ఇప్పుడు యాం త్రీకరణ ప్రభావం మాపై ఉన్నది. జాతీయ రహదారి ఇరుపక్కలా గ్రామ దుకాణాల్లోని వస్తువులన్నీ ఇక్కడే తయారయ్యాయనుకోవద్దు. అడిగి తీసుకోవాలి. గతంలో విశ్వకర్మ 'కులవృత్తి'గా కొనసాగినా.. ప్రస్తుతం ఇతర కులస్తులు సైతం ఇందులో ప్రవేశించారు. మా సంఘంలో విశ్వకర్మలు కేవలం 20 శాతం మందే ఉన్నారు. మిగతా వారు ముదిరాజ్, కుమ్మరి, రజక, తురక, మాల- మాదిగ, గౌడ, కురుమ తదితర కులాల వారున్నారు. మా సభ్యులకు ప్రభుత్వం మరింత మెరుగైన శిక్షణ కల్పించి మార్కెటింగ్ మెలకువలు నేర్పించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం "గోల్కొండ" (గతంలో లేపాక్షి) ఎంపోరియం కొంత మేర మా మార్కెటింగ్ అవసరాలను తీరుస్తోంది అని అంటారు పెంబర్తి కళాకారులు.



**పెంబర్తి ప్రముఖులు**

**అయిలాచారి:** రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన కళాకారుడు. ఆయా స్థాయిల్లో అవార్డులందుకున్నారు. ఎందరికో స్ఫూర్తి ప్రదాత. గురువు. ఈయనంటే గ్రామస్తులందరికీ ఎనలేని అభిమానం.

**రుద్రోజు శ్రీనివాస చారి:** ఈయనకు 2001లో రాష్ట్ర స్థాయి ప్రథమ పురస్కారం లభించింది. దాదాపు 210 కిలోల ఇత్తడితో కెప్టెన్ ఉమ్రావ్‌సింగ్ ఇత్తడి విగ్రహాన్ని రూపొందించినందుకు ఆ పురస్కారం లభించింది.

**అయిల వేదాంతాచారి:** ఈయన సైతం రాష్ట్ర పురస్కార గ్రహీత.

**రంగు వెంకటేశ్వర్లు:** రాష్ట్ర ప్రభుత్వ పురస్కార గ్రహీత. జాతీయ స్థాయి అవార్డును సాధించారు.

**అయిలా సోమ బ్రహ్మచారి:** పంచలోహ కళాకృతులను తయారు చేయడంలో దిట్ట. అవార్డు గ్రహీత కూడా.

**అమెరికాలోని రెస్టారెంట్‌కు పెంబర్తి కళాఖండాలు**

హస్త కళలకు పుట్టినిల్లయిన పెంబర్తి కళా వైభవం ఖండాంతరాలు దాటి వెళుతోంది. అమెరికాలోనూ ఇక్కడి కళా ఖండాలకు ఘనకీర్తి దక్కుతోంది.

ఇక్కడ తయారైన ఇత్తడి కళాఖండాలు అమెరికాలోని ఓ రెస్టారెంట్‌లో అలరించనున్నాయి. హైదరాబాద్ దుర్గాభాయ్ దేశ్ ముఖ్ కాలనీకి చెందిన కొమ్మిడి బల్వంతరెడ్డి అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన న్యూజెర్సీలో మొఘల్ దర్బార్ రెస్టారెంట్‌ను నెలకొల్పుతున్నారు. ఈ రెస్టారెంట్ ముఖద్వారం, కాన్ఫరెన్స్ హాల్, భోజనశాలతో పాటు ఇంటీరియల్ డిజైన్లను పెంబర్తిలో తయారు చేయిస్తున్నారు. సుమారు రూ.7 లక్షల విలువైన 250 కిలోల ఇత్తడితో ఈ కళాఖండాలు రూపుదిద్దుకుంటున్నాయి. రెస్టారెంట్ ముఖద్వారంపై 'మొఘల్ దర్బార్ హోటల్' అని తెలుగులో రాయిస్తూ మాతృభాషపై తనకున్న మమకారాన్ని చాటుకున్నారు.

పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన మరో ఎన్ఆర్ఐ సంపత్‌రెడ్డి టెక్సాస్‌లో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ఆలయ ముఖద్వారం, ధ్వజస్తంభాల రేకులను కూడా పెంబర్తిలోనే తయారు చేయించి తీసుకెళ్లారు. ముఖద్వారం కోసం రూ.5 లక్షలతో తీర్చిదిద్దిన తలుపులను పంపించారు. కళాఖండాల తయారీ కోసం అమెరికా నుంచి ఆర్డర్లు రావడం ఆనందంగా ఉందని స్థానిక కళాకారులు అంటున్నారు. అమెరికా, జపాన్, ఇటలీ లాంటి ఎన్నో దేశాలకు ఇక్కడ తయారు చేసిన వాటిని తీసుకెళ్తున్నారని చెప్పారు.

**పెంబర్తి హస్తకళల పితామహుడు ఐలా**

ప్రపంచ వ్యాప్తంగా పెంబర్తి హస్తకళలకు ప్రాచుర్యాన్ని కల్పించిన ఐలా ఆచారి(79) గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఇటీవల మృతి చెందారు. వరంగల్ జిల్లా జనగామ మండలం పెంబర్తికి చెందిన ఆచారి విశ్వకర్మ హస్తకళల సొసైటీ ద్వారా పెంబర్తి హస్తకళలను విశ్వవ్యాప్తం చేయడానికి ఎంతోకృషి చేశారు.

ఇత్తడి, రాగి, వెండి లోహాలతో వివిధ రకాల షీల్డులు, పలు ఆకృతులను చేయడం ఆచారి కుటుంబంతోనే ప్రారంభమైంది. వీరి పూర్వీకులు నైజాం నవాబులకు వెండితో కూడిన అత్తర్‌దాన్, పాన్‌దాన్‌లను చేసేవారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా హస్తకళలను నేర్చుకున్న ఆచారి.. గ్రామంలో 1970లో విశ్వకర్మ హస్తకళల సొసైటీని స్థాపించి ఎందరో కళాకారులను తీర్చిదిద్దారు.

పలు దేశాల్లో పెంబర్తి కళలకు విశేష ప్రాచుర్యం కల్పించడంలో ఆచారి కృషి ఎంతగానో ఉంది. జాతీయ అవార్డు అందుకున్న ఆచారి: హస్తకళల విభాగంలో 1979లో అప్పటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి నుంచి ఆచారి దిల్లీలో జాతీయఅవార్డు అందుకొన్నారు. నాటి ప్రధానులు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, అప్పటి ముఖ్యమంత్రులు నందమూరి తారక రామారావు, మర్రి చెన్నారెడ్డి, జలగం వెంగళరావు తదితరుల నుంచి ఆయన అవార్డులు, సన్మానాలు పొందారు.

-వెంకట్

# జనజాతరల్లో క్లిక్.. క్లిక్!

## ఫోటోగ్రాఫర్ రామ వీరేశ్ బాబు

జనజాతరలో కానవచ్చే సందడి మదిపై చెరగని ముద్ర వేస్తుంది. ఆ ముద్రను పదిలం చేసే ప్రయత్నమే రామ వీరేశ్ బాబుచే కెమెరాను పట్టించింది. జాతరలోని జనాన్ని కెమెరాలో బంధిస్తే ఆ ఫ్రేమ్ లివింగ్ హెరిటేజ్‌కు నిర్వచనంలా నిలుస్తుంది. ఈ సత్యం తెలిసిన ఫొటోగ్రాఫర్ రామ వీరేశ్‌బాబు.

వరంగల్‌లో పుట్టిపెరిగి డిగ్రీ వరకూ అక్కడే చదువుకున్న రామ వీరేశ్ బాబు ప్రస్తుతం హైదరాబాద్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఆయన 1987లో ఫోటోగ్రఫీపై ఆసక్తితో కెమెరా చేతబట్టారు. చిన్నప్పటి నుంచి పెయింటింగ్‌పై ఉన్న ఆయన ఆసక్తి పెద్దయ్యేసరికి లెన్స్ వైపు మళ్లింది. డాక్యుమెంటరీల కోసం ఆయన పట్టిన కెమెరా తెలంగాణకు తలమానికమైన మేడారం, ఐనవోలు జాతరలను అన్ని కోణాల్లో స్పృశించింది. తపాలా శాఖలో ఉద్యోగం వచ్చినా ఆ హాబీని మాత్రం వీడలేదు.

చిన్నప్పటి నుంచే బొమ్మలు గీయడమంటే ఆయనకు ఎంతో ఆసక్తి. అలా ఎన్నో గ్రామీణ చిత్రాలు, జాతర దృశ్యాలను కాన్వాస్‌పై చిత్రించారు. కాలేజీ చదువు పూర్తయిన తర్వాత ప్రముఖ ఫొటో గ్రాఫర్ భరత్‌భూషణ్‌తో స్నేహం ఆయన్ను కెమెరా వైపు మళ్లించింది. 1977 నుంచే ఫొటోలు తీస్తున్నారు. 1980లో వరంగల్‌లోనే తపాలా శాఖలో ఉద్యోగం వచ్చింది. అయినా తన ప్రవృత్తిని విడిచి పెట్టలేదు. 1987 నుంచి ఫొటోగ్రఫీని సీరియస్‌గా తీసుకున్నారు. డాక్యుమెంటరీల కోసం ఎన్నో జాతరలకు వెళ్లి ఫొటోలు తీశారు. లంబాడాల జీవన విధానాన్ని కెమెరాలో బంధించారు.

ప్రజల నిత్య జీవితాన్ని, జాతరలను, చెట్లను, పురాతన వార సత్వ భవనాలను, వీధి దృశ్యాలను ఫోటోలుగా తీయడమంటే ఆయ నకు ఆసక్తి. సహజవాతావరణంలో ప్రజల జీవన కార్యకలా పాలను అందంగా కెమెరాలో బంధించడం ఫోటోగ్రఫీలో ఆయన శైలిగా ఉంటోంది.

మనలో చాలామందికి బోనాలు లాంటి పండుగలు ఓ సం ప్రదాయంగా, మరి కొందరికి అది అర్థం లేని ఆచారంగా కనిపి స్తాయి. ఒక ఫోటోగ్రాఫర్ లెన్స్‌కు మాత్రం ఇలాంటి పండుగలు మత విశ్వాసాలకు మించినవిగా కనిపిస్తాయి. వీరేశ్ బాబు పాతికేళ్ళుగా బోనాల పండుగ స్ఫూర్తిని తన కెమెరాలో బంధిస్తూ వచ్చారు. అందుకే ఆయన తీసిన ఫోటోలతో 'బియాండ్ ఫెయిత్' అనే డాక్యుమెంటరీ కూడా రూపొందింది. ప్రసాద్ ల్యాబ్స్‌లో దీన్ని ప్రదర్శించారు.



బోనాల పండుగ స్ఫూర్తిని చాటిచెప్పడం ఈ డాక్యుమెంటరీ ఉద్దేశం. బోనాల పండుగ విశేషాలను వీరేశ్ బాబు దృశ్యరూపంలో వివరించారు.

ఆయన ప్రధానంగా బోనాల పండుగనే ఎంచుకునేందుకు ఓ కారణముంది. నెల రోజుల పాటు జరిగే ఈ జనజాతరలో సంస్కృతి, ఆహారం, పాటలు ప్రధానపాత్ర వహిస్తాయి. పైగా దీన్ని రాష్ట్ర పండుగగా కూడా ప్రకటించిన నేపథ్యంలో దానిపై డాక్యుమెంటరీ తీసేందుకు తగిన సమయంగా భావించి ఈ డాక్యుమెంటరీ రూపొందించినట్లు ఆయన తెలిపారు. కులమతాలతో సంబంధం లేకుండా ప్రజలంతా ఒకచోట చేరి చేసుకునే ఏ పండుగైనా వీరేశ్ బాబుకూ పండుగే. తన కెమెరాతో అక్కడ వాలిపోతారు. పోతురాజులు ఆ వేషం వేసుకునేందుకు పడే కష్టాలు, బోనాల సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు పడే ఇబ్బందులు లాంటివన్నీ ఆయన ఫోటోలకు ముడిసరుకుగా మారుతాయి.

జనజాతరలకు వచ్చే ప్రజల్లో కనిపించే అమాయకత్వం, అక్కడ వెల్లివిరిసే రంగులే తనను ఆయా వేడుకల ఫోటోలు తీసేందుకు స్ఫూర్తినిస్తాయని ఆయన అంటారు. గతంలో పోతురాజులు





పసుపు రాసుకునే వారని, ఇప్పుడు సింథటిక్ రంగులు వచ్చాయని, గతంలో వారి వేషధారణ భారీస్థాయిలో ఉండేదని, ఇప్పుడంతగా ఉండడం లేదనీ ఆయన అంటారు. ఇప్పటి వరకూ వేల సంఖ్యలో బోనాల ఫోటోలు తీశారు. మరెన్నో వేల సంఖ్యలో ఇతర పండుగల ఫోటోలూ ఉంటాయి.

సిటీలో పాత గడియారాలు, చెట్లను పూజించే విధానం, వాటిని ఉపయోగించే తీరుపై లెక్కలేనన్ని ఫోటోలు తీశారు. ఇదే సమయంలో ముంబైలోని నేషనల్ సెంటర్ ఫర్ ద పర్ఫార్మింగ్ ఆర్ట్స్ డైరెక్టర్ సి.పటేల్‌తో పరిచయం ఆయన జీవితంలో గొప్ప మలుపు. ఒక్కో సబ్జెక్ట్‌ను ఎంచుకుని ఫోటోలు తీయమని ఆయన సూచించారు. జహంగీర్ ఆర్ట్ గ్యాలరీలో మేడారం జాతర ఫోటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తే మంచి స్పందన వచ్చింది. వివిధ నగరాల్లో పలు షోలు నిర్వహించారు. హైదరాబాద్ గడియారాల ఫోటోలకు ఇంగ్లండ్‌లోని అసోసియేట్‌షిప్ ఆఫ్ రాయల్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ వాళ్ల గుర్తింపు లభించింది.

“గతంలో జరిగిన జాతరలకు, ఇప్పుడు జరుగుతున్న జాతరలకు చాలా తేడాలు వస్తున్నాయి. అప్పుడు నేను తీసిన డాక్యుమెంటరీలు భవిష్యత్ వాళ్లు గతంలో జాతర ఇలా జరిగేదే అని తెలుసుకునేందుకు చక్కగా ఉపయోగపడతాయని నా అభిప్రాయం” అని అంటారు రామ వీరేశ్ బాబు.

**వ్యక్తిగతం:**

పేరు: రామ వీరేశ్ బాబు
జననం: 1956, వరంగల్
చదువు: బిఎస్సీ
వృత్తి: పోస్టల్ అసిస్టెంట్, హైదరాబాద్
నివాసం: రాంనగర్, హైదరాబాద్

**సోలో ప్రదర్శనలు:**

2012: ఇమేజెస్ ఆఫ్ హైదరాబాద్ బోనాలు, ఐసీసీఆర్ ఆర్ట్ గ్యాలరీ, హైదరాబాద్
2008: ఇమేజెస్ ఆఫ్ హైదరాబాద్ ట్రీస్ – జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ కాలేజ్, హైదరాబాద్
2004: ఇమేజెస్ ఆఫ్ ఫెయిత్– మేడారం సమ్మక్క – సారలక్క జాతర, జహంగీర్ ఆర్ట్ గ్యాలరీ, ముంబై 2004: ఇమేజెస్ ఆఫ్ హైదరాబాద్ ట్రీస్ – ఆర్ట్ హెరిటేజ్, న్యూఢిల్లీ
2001: ఇమేజెస్ ఆఫ్ హైదరాబాద్ క్లాక్స్ – పిరమల్ గ్యాలరీ, ఎన్‌సీపీఏ, ముంబై
1998: ఇమేజెస్ ఆఫ్ జాతర – ఐసీసీఆర్ ఆర్ట్ గ్యాలరీ
1993: పీపుల్ యాక్టివిటీ– చెన్న విశ్వేశ్వరయ్య హాల్, వరంగల్

**గ్రూప్ ఎగ్జిబిషన్స్:**

2006-07: హోమ్‌లాండ్స్ జిందాల్ ఫుజి ఫిల్మ్ సూపర్ సిక్స్ ఫోటోగ్రాఫర్స్ ఎగ్జిబిషన్ – భారతదేశంలో ఐదు మెట్రో నగరాల్లో
2011: ‘సమ్‌థింగ్ దట్ ఐ విల్ నెవర్ రియల్లీ సీ’తో కలసి ‘ఫోటోగ్రాఫిక్ థాట్స్’ – హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో కాంటెంపరరీ ఎగ్జిబిషన్ ఫ్రమ్ వి & ఎ మ్యూజియం, లండన్
2011: హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియం లో గోతె–జంత్రమ్, జర్మన్ ఆధ్వర్యంలో “The Changing Hyderabad’ & ‘Die Stadt. Vom Werden und Vergehen’

**అవార్డులు:**

2000: రాయల్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ అసోసియేట్‌షిప్
2005: ‘ఐ ఇన్ ప్రోగ్రెస్’కు గాను ఇండియా హాబిటేట్ సెంటర్ ఫోటోగ్రఫీ ఫెలోషిప్ అవార్డు (న్యూఢిల్లీ)
1996: నికాన్ ఫోటో కాంటెస్ట్ ఇంటర్నేషనల్
1998: హానరబుల్ మెన్షన్డ్ అవార్డు (సింగపూర్)

– రాజేశ్

ద

# ఎం.ఎస్. సుబ్బులక్ష్మి

# భారతీయ సంగీత హిమశిఖరం

పదేళ్ల ఆ అమ్మాయి పాఠశాల ఆవరణలో ఇసుకలో తోటి పిల్లతో ఆడుకుంటోంది. ఇంతలో ఎవరో వచ్చి బట్టలకు చేతులకు అంటుకున్న దుమ్ముదులిపి ఎత్తుకుని తీసుకెళ్ళి వేదిక మీద వీణ వాదన చేస్తున్న తల్లి ప్రక్కన కూర్చోబెట్టారు. ఆ పాపను దగ్గరగా తీసుకున్న తల్లి పాడమని చెప్పింది. ఏవో రెండు పాటలు రాగరంజితంగా పాడిందాచిన్నారి. పసి వయసులోనే పాప గాన ప్రావీణ్యతకు అక్కడున్న వారంతా సంభ్రమాశ్చర్యాలతో కరతాళధ్వనులు చేసి అభినందించారు.

**అయిదు దశాబ్దాల తర్వాత...**

అది ఓ అంతర్జాతీయ సంగీతోత్సవాల వేదిక. ఎందరో విశ్వఖ్యాతిగాంచిన సంగీతజ్ఞులతో నిండి వుంది. ఆ వేదికపై అప్పుడే "ఆమె" గాత్రకచేరీ ముగిసింది. తన్మయభావనతో అందరి కళ్ళలోనూ ఓ స్వచ్ఛమైన ఆధ్యాత్మిక వెలుగు కనబడుతోంది. "ఆమె" తదనంతరం మరో సుప్రసిద్ధ సంగీత సమ్మేళనంగా చెప్పుకొనబడే 'జుబిన్ మెహతా' కచేరీ చేయాలి. ఆయన కనీసం 150 వాయిద్యాలతో వేదికను అలంకరించి కచేరీ చేస్తారు. వాస్తవానికి ఆయన ప్రపంచంలోని గొప్ప సంగీతకారుల్లో ప్రసిద్ధులు. కానీ ఆ రోజు వేదిక నెక్కడానికి సంకోచిస్తున్నారు. కారణం తన ఒకేఒక్క స్వరంతో వేల మంది సంగీతాభిమానులను పారవశ్యంలో తేలియాడించిన 'ఆమె' ప్రతిభావ్యుత్పత్తుల ముందు తన వందలాది వాద్య సమ్మేళనం ఏ పాటిదిగా నిలుస్తుందని. ఏమైతేనేం అనే భావనతో భక్తి వినయాలతో జుబిన్‌మెహతా వేదిక దిగి "ఆమె" ముందు నిలిచి చేతులు జోడించి ఆశీర్వచనాలందుకుని వేదిక నెక్కారు.



పై రెండు సందర్భాల నడుమ చాలా సమయాంతరం కనిపిస్తుంది. మనకు కానీ అనితరసాధ్యమైన గాత్ర సంగీత సామ్రాజ్ఞిగా పేరుగాంచిన "ఎం.ఎస్. సుబ్బులక్ష్మి"ల నాటి "అమ్మాయి" ఆ తరువాత "ఆమె".

ఏడు దశాబ్దాలపాటు తన అద్భుత గానకౌశలంతో కర్ణాటక సంగీతాన్ని చకచ్చకితం చేసిన ఎం.ఎస్.సుబ్బులక్ష్మి సంగీత స్వర యాత్ర భారతీయ శాస్త్రీయ సంగీత ప్రపంచంలో ఓ సువర్ణాధ్యాయం. ఈ సెప్టెంబర్ 16న ఎం.ఎస్. 99వ జయంతి అంటే శత జయంతి సంవత్సరం మొదలు కానున్నది.

1916 సెప్టెంబర్ 16న మధురైలోని సంగీత కుటుంబంలో జన్మించిన "సుబ్బులక్ష్మి" అసలు పేరు 'కుంజమ్మ'. అమ్మమ్మ అక్కమ్మాళ్ వయోలిన్ వాదకురాలు. తల్లి 'వీణాషణ్ముక వడివు' వీణా వాదన, తరచూ ఇంట్లో జరిగే సంగీతచర్చలు ఆమెను కళా ప్రపంచం లోకి తీసుకువచ్చాయి. "కుంజమ్మ" ఆరో తరగతిలో ఏదో తప్పు చేసిందని ఉపాధ్యాయుడు తీవ్రంగా దండించడంతో బడి కెళ్ళడం మానుకొని సంగీతాన్ని సర్వసంగా ఎంచుకున్నారామె. ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యార్ వంటి దిగ్గజాల వద్ద శిక్షణ పొందిన ఎమ్మెస్ తన 12వ ఏట తల్లితో కలిసి వేదికనెక్కి పాడినపుడు కర్ణాటక సంగీతాకాశంలో ఓ కొత్త తారక వెలసినట్లయింది.

1932. "మద్రాస్ మ్యూజిక్ అకాడమి" వేదికపై ప్రఖ్యాత అరియక్కుడి రామానుజ అయ్యార్ కచేరీ చేయవలసి ఉంది. కానీ అనుకోని కారణాల వల్ల హాజరు కాలేని ఆయన సభా నిర్వాహకులకు ఓ లేఖ రాస్తూ నా స్థానంలో ఈ ఎమ్మెస్ పాడుతుందని పంపారు. అప్పటికి పదహారేళ్ళ వయస్సున్న ఎమ్మెస్‌ను చూసి సభలోని వారంతా నిరుత్సాహపడ్డారు. ఈ అమ్మాయి ఏం పాడుతుందని" పరస్పరం గుసగుసలాడుకున్నారు. కానీ ఎమ్మెస్ వేదికనెక్కి కచేరీకి సిద్ధమైంది. తన స్వరంతో కోమల గంధర్వగాన సౌరభాన్ని రవళించేలా పాడింది. ఎదురుగా సంగీత ప్రపంచాన శివయ్యర్ చెంబైవేద్యనాథ భాగవతారు వంటి వారు ఆసీనులై ఉన్నారు. ఎమ్మెస్ నిర్భయంగా తన కచేరీని ముగించింది. అందరి ముఖాల్లోనూ రసానందడోలిక ఊగిసలాడింది. అంత చిన్న వయస్సులో మ్యూజిక్ అకాడమీ వేదికపై పాడే అవకాశం రావడం, పాడి అందరి ప్రశంసలు అందుకున్న వారు అరుదు. అందరి నోటా పొగడ్తలే. "అమ్మడూ నీకంఠంలో వీణాతంత్రులు మ్రోగుతున్నాయి" అని హాజరైన వారు ఆశీర్వదించారు.

ఎమ్మెస్ జీవితంలో సాధించిన విజయాల వెనుక ఒక పురుషుడున్నాడు. అతనే "త్యాగరాజన్ సదాశివం". 1930ల్లో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటూ కాంగ్రెస్ వాలంటీర్‌గా సుబ్రహ్మణ్య భారతి గేయాలు పాడుతూ ప్రజలను చైతన్యం చేసిన ఆయన

జర్నలిస్ట్‌గా పని చేస్తూ ఎం.ఎస్. జీవితంలోకి ప్రవేశించి ఆమె బంగారు భవిష్యత్‌ను నిర్వహించిన పాత్ర గణనీయమైనది. 1940 లో వీరి వివాహం జరిగింది. గాంధీ, నెహ్రూ, శాస్త్రీ, రాజాజీ ఇందిర వంటి వారితో ఈయనకున్న పరిచయాలు ఎమ్మెస్ గానం జాతీయం కావడానికి దోహదపడినవే. ఎమ్మెస్ కచేరీల నిర్వహణలో సదాశివం మార్గ దర్శకత్వం కీలకమైంది. ఎక్కడ, ఎప్పుడు కచేరీ చేయాలో, ఏ కీర్తన ఏ క్రమంలో పాడాలో నిర్ణయించేది సదాశివమే.

సుబ్బులక్ష్మి పాడుతుంటే ఆమె వదనంలో ప్రశాంతత, ప్రసన్నత లాస్యం చేస్తుంటాయి. రాగాలాపన, కీర్తన, నెరవు, స్వరకల్పన, ఏదైనా సరే అవి నాద సౌందర్యంతో నిండి ఉంటాయి. కర్ణాటక సంగీతంలో తలమానికమైన 'పల్లవి'ని పాడటంతో తల్లి ఆమెకు ప్రత్యేక శిక్షణనిప్పించారు. అందుకు ఆమె మృదంగ సంబంధమైన లెక్కలన్నీ తెలుసు. 'పల్లవి' పాడటమంటే పాండిత్య ప్రకర్షతో కూడిన పని. నిర్ధిష్టమైన లయజ్ఞానం, ధారణశక్తి, గణితశాస్త్ర సూక్ష్మాలు ఇవన్నీ కలిగి ఉండాలి. ఇవన్నీ ఆమెలో పుష్కలంగా ఉండటం వల్లనే సాధ్యమైనది.

**వెండితెరపై**

ఎం.ఎస్. గాన ప్రతిభ సినిమాల్లోనూ భాసించింది. 'సేవా సదన్' (1938), 'శకుంతల'(1940), 'సావిత్రి'(1941), 'మీరా' తమిళ (1944), హిందీ (1947) చిత్రాల్లో నటించారామె. శకుంతలలో ముగ్ధమనోహర మునికన్యగా ఆమె నటన అసామాన్యం. 'సేవాసదన్'లో ఆధునిక యువతిగా నటించారు. 'శకుంతల'లో ఆమె పాడిన పాటలన్నీ జనాదరణ పొందినవే. దక్షిణ భారతంలో ఆమె పాటలు వినపడని ఇల్లులేదు. ఆ రోజుల్లో 'సావిత్రి'లో ఎం.ఎస్. నారదునిగా నటించిన పాడిన సంగతి చెప్పనవసరం లేదు. 'మీరా' చిత్రంలో సాక్షాత్తూ మీరాబాయినే ఆమె ఆవిష్కరించారు. ఆమె సరసన నటించిన వారు మన చిత్తూరు నాగయ్య.

ఏడు దశాబ్దాల కాలంలో తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ, హిందీ, మరాఠీ వంటి పది భాషల్లో కలిసి సుబ్బులక్ష్మి చేసిన కచేరీల సంఖ్య రెండు వేలపై చిలుకే ఉంటుంది. వాటిలో స్వలాభం కోసం చేసినవి పాతికశాతం కూడా ఉండవు. మిగతా కచేరీలన్నీ ప్రజా సంక్షేమం కోసం సేకరించే నిధుల కోసం చేసినవే. ఇలా సేకరించిన సొమ్ము రెండు కోట్లపైనే ఉంటుంది. స్వంతంగా సంపాదించినది కూడా దాన ధర్మాలకు, విరాళాలకు వినియోగించారామె. ఇంకా భర్త వెలువరించే 'కల్కి' పత్రిక నిర్వహణ కూడా దాన ధర్మాలకు, విరాళాలకు వినియోగించారామె. ఇంకా భర్త వెలువరించే "కల్కి" పత్రిక నిర్వహణ కూడా ఈమె సొమ్ముతోనే. జాతిపిత మహాత్మగాంధీకి ఎమ్మెస్ గానం ప్రీతిపాత్రమైంది. "భక్తిభావం ఆమె కంఠంలో ద్యోతకమైనట్లు మరే గాత్రంలోనూ ఉండదని" ఆయనే ఓ సందర్భంలో ప్రస్తావించారు.

"అసలు తను పాడగలనని ఏనాడూ అనుకోలేదనే" సుబ్బలక్ష్మికి సంగీతం తరువాత భర్తే దైవం. ఆయనను భర్తగా పొందే విషయంలో తానెంతో అదృష్టవంతురాలునని ఆమె చెప్పే వారు. తన

**ఎం.ఎస్. కళాజీవన శిల్పి సదాశివం**

ప్రతి పురుషుడి విజయం వెనుక ఓ స్త్రీ ఉందనేది ఓ నానుడి. అలాగే ఓ స్త్రీ విజయం వెనుక ఒక పురుషుడుంటాడనే విషయం ఎమ్మెస్ విషయంలో నిజమైంది. ఆయన "త్యాగరాజన్ సదాశివం". ఆయన ఓ భర్తగా గాక ఎమ్మెస్ కళా జీవితంలో ఓ మార్గదర్శిగా వ్యవహరించారు. ఆయన ఎం.ఎస్.కి స్నేహితుడు. మార్గదర్శకుడు. ఒక ఫిలాసఫర్ కూడాను.

భర్తను ఎంపిక చేసుకొనే విషయంలో తప్పటడుగు వేసి ఉంటే తన జీవితం దుర్భరమయ్యేదని" ఆమె భావించారు. ఆయన తన తోడు నీడగా ఉండటం వల్ల తనకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమైందని ఒక ఇంటర్వ్యూలో చెప్పుకున్నారు. 56 ఏళ్ళపాటు తోడు, నీడగా గురువుగా ముందుండి నడిపించిన సదాశివం 1997లో మరణించారు. భర్త మృతి ఆమెను ఒంటరిగా మిగిల్చింది. వారికి సంతానం లేదు. సదాశివం తొలిభార్యగారి సంతానాన్ని ఆమె పెంచారు. సదాశివం మృతి తరువాత ఆమె మళ్ళీ పాడేందుకు తంబూరానైనా తాకలేదు. ఆమె పాడాలని, పాడితే వినాలని దేశవ్యాప్తంగా ఉన్న ఆమె సంగీతాభిమానులు ఆశించారు. కానీ ఆమె పాడకుండానే 2004 డిసెంబర్ 11న తన జీవనయానాన్ని చాలించారు. భౌతికంగా ఎమ్మెస్ మన మధ్య లేరు. కానీ ఆమె గాత్రం నిరంతరం నేపధ్యగీతంలా సంగీత భారతరత్నంగా నిరంతరం మన తోడై సాగుతూనే ఉంటుంది. వచ్చే ఏడాది జరగనున్న ఎం.ఎస్.సుబ్బులక్ష్మి శతజయంతి ఉత్సవాలను భారతీయ సంగీత సమాజం ఘనంగా జరుపుకోనుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

నాటి ప్రధాని నెహ్రూ ఎం.ఎస్. పాట విన్న తరువాత "ఈ సంగీత సామ్రాజ్ఞం ముందు నేనెంత. నేనొక మామూలు ప్రధాన మంత్రిని మాత్రమే" అన్నారు. ఆమె నటించిన 'మీరా' చిత్రం చూసిన సరోజినీనాయుడు నా నైటింగేల్ బిరుదును ఈమెకు ఇచ్చేశానన్నారు. "తప్పిపోయిన నా ఆత్మను తిరిగి కనుగొన్నాను." అని పండిత గోవిందవల్లబ్ పంత్ ప్రశంసించారు. ఉస్తాద్ బడే గులాం అలీఖాన్ ఎం.ఎస్.గానం విని "బేటీ ఖూబ్ ఖావో ఖూబ్ గావో" అని అభినందించారు. ఆమెకే గురువైన సెమ్మంగుడి వారైతే ఓ సందర్భంలో "ఈమెను పొగిడేందుకు నా వద్ద మాటలు లేవ"న్నారు. తన కర్ణాటక సంగీతమే గొప్పదనుకోకుండా ఆమె నారాయణరావు వ్యాస్ వద్ద హిందుస్థానీ సంగీతాన్ని, సిద్దేశ్వరీదేవి వద్ద 'టప్పా టుమ్రీ', దిలీప్‌రాయ్ వద్ద రబీంద్ర సంగీతాన్ని భక్తి సంగీతాన్ని నేర్చుకున్నారు. వైవిధ్యాలున్న ఎన్నో సంగీత బాణీలను అవగతం చేసుకోవడం వల్ల పండిత పామరులను సమాంతరంగా అలరిస్తూ ప్రపంచవ్యాప్తంగా కచేరీలు చేసారామె.

సదాశివంకు ఎమ్మెస్‌తో పరిచయం 1936 జూన్ 10న జరిగింది. అప్పటికే ఆయన 'ఆనంద వికటన్" విలేకరిగా పేరొంది ఉన్నారు. 1934లో మ్యూజిక్ అకాడమి వేదికపై కచేరీ చేసి ఎమ్మెస్ సృష్టించిన సంచలనం ఆయనను ప్రభావితం చేసింది. ఆ తరువాత

## ప్రజలకు చేరువలో పాలన

# కొత్త జిల్లాలకు జైకొట్టిన తెలంగాణ

దసరా పండుగ రాష్ట్ర ప్రజానీకానికి మరో శుభసందర్భాన్నీ అందిం చనుంది. సరిగ్గా ఇదే రోజు నుంచి తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో సరికొత్తగా స్థానిక పాలన మొదలు కానుంది. రాష్ట్రంలో మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానున్నది. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఇచ్చిన హామీ మేరకు కొత్త జిల్లాల ఏర్పాటు సంకల్పం సాకారం కానున్నది. బంగారు తెలంగాణ లక్ష్యసాధనకు కొత్తజిల్లాల ఏర్పాటు సరికొత్త బాట వేయనుంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు చారిత్రకంగా, రాజకీయంగా ఎంతటి ప్రాధాన్యత ఉందో కొత్త జిల్లాలకూ అంతే ప్రాధాన్యం ఉంది.

పరిపాలన ఫలాలు అందాలంటే చిన్న రాష్ట్రాలే మేలు. తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటులో కీలకంగా ఉన్నది కూడా ఈ సూత్రమే. పది జిల్లాల తెలంగాణ ఇప్పుడు 27 జిల్లాల తెలంగాణగా మారుతున్నది. ప్రభుత్వం ఉత్తమ పాలనను అందించేందుకు ప్రయత్నించడమే కాకుండా, వ్యవస్థాగతమైన మార్పులను చేపట్టడం ద్వారా పరిపాలనా రంగాన్ని సమూలంగా సంస్కరిస్తోంది. ఇందుకు అనుగుణంగానే ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో చిన్న జిల్లాలు రూపొందుతున్నాయి.




తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన చేపట్టడం ప్రగతిశీలమైన చర్య. దీని వల్ల ప్రభుత్వ పాలనా సామర్థ్యం ఇనుమడిస్తుందనడంలో సందేహం లేదు. జిల్లా పరిపాలన గ్రామీణ ప్రజలకు మరింత దగ్గరవుతుంది. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా గ్రామీణ, నగర స్థానిక ప్రభుత్వాలు కొంత మేర బలోపేతమయ్యాయి. అయితే దీనికి తోడుగా జిల్లాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభం కావడం హర్షణీయమైన పరిణామం.

పరిపాలన వికేంద్రీకరణ అనేది ప్రభుత్వం యొక్క వివిధ స్థాయిల్లో ప్రజాసేవలు అందించేందుకు వీలుగా అధికారం, బాధ్యతల,  ఆర్థిక వనరుల పున:పంపిణిని నిర్దేశిస్తుంది. నిర్దిష్ట ప్రజా విధుల ప్లానింగ్, ఫైనాన్సింగ్, మేనేజ్ మెంట్ అన్నీ కూడా కేంద్రీకృత వ్యవస్థ నుంచి వికేంద్రీకృతమవుతాయి. ఈ యూనిట్ ఎంత చిన్నదిగా ఉంటే అంతగా ప్రజల భాగస్వామ్యం అధికమై ప్రజలకు మేలు జరుగుతుందనడంలో సందేహం లేదు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ కేవలం పరిపాలనా సౌలభ్యం కోసమే కాకుండా అనేక అభివృద్ధి కారక విషయాలను దృష్టిలో ఉంచుకొని జరుగుతున్న పరిణామం.

నేడు ప్రపంచమంతా కూడా పరిపాలన వికేంద్రీకరణ దిశలో పయనిస్తోంది. మరీ ముఖ్యంగా పట్టణాలు, నగరాల విషయానికి వస్తే ఎన్నో దేశాల్లో ఈ విధమైన వికేంద్రీకరణ అత్యధిక స్థాయిలో ఉంది. ఈ విధమైన వికేంద్రీకరణతో ప్రజలు స్థానిక పాలనతో మమేకం కాగలుగుతారు. తాము కోరుకున్న అభివృద్ధి పనులు చేయించుకోగలుగుతారు.

వికేంద్రీకరణ ఆవశ్యకతను, దానివల్ల జరిగే ప్రయోజనాలను దక్షిణాఫ్రికా, బ్రెజిల్, కొలంబియా, మొరాకో, చైనా, నేపాల్, శ్రీలంక, జోర్డాన్ వంటి అనేక దేశాల్లో ఐక్యరాజ్యసమితి అభివృద్ధి సంస్థ (యూఎన్‌డీపీ) అధ్యయనం చేసి విశదీకరించింది. వికేంద్రీకరణ ప్రపంచ ధోరణిగా మారుతున్న తరుణంలో తెలంగాణ రాష్ట్ర, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని 27 జిల్లాలు రూపుదిద్దుకున్నాయి.

### దేశంలో జిల్లాల పరిస్థితి

భారత పాలనా వ్యవస్థలో జిల్లా ఒక పాలనా విభాగంగా మౌర్యుల కాలం నాటి నుంచి అమలులో ఉన్నది. ప్రపంచానికి ఈ విధంగా చిన్న పరి పాలక విభాగాన్ని పరిచయం చేసింది భారతదేశమే. ఈ పాలనా విభాగాన్ని మౌర్యుల కాలంలో ఆహార అనేవారు. గుప్తుల కాలంలో విష్వా, మొఘల్ కా లంలో సర్కార్ అనేవారు. ఈస్టిండియా కంపెనీ హయాంలో, ఆ తర్వాత బ్రిటిష్ ప్రత్యక్ష పాలనలో జిల్లా కలెక్టర్, జిల్లా పాలన ప్రాధాన్యం పెరుగుతూ పో యింది. బ్రిటిష్ పాలనలో 14 రాష్ట్రాలతో ప్రారంభమైన భారతదేశం, కాలానుగుణంగా 29 రాష్ట్రాలుగా రూపాంతరం చెందినప్పుడు కూడా ఈ విధమైన పునర్వ్యవస్థీకరణపై వ్యతిరేకత రాలేదు. ప్రజాస్వామిక ఆంకాక్షలను నెరవేర్చడం గా దీన్ని భావించారు. పది జిల్లాలతో ప్రారంభమైన తెలంగాణ రాష్ట్రం 27 జ్లిలాలుగా రూపాంతరం చెందడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు.

దేశంలో జిల్లాకు సగటు జనాభా సుమారు 15 లక్షలుగా ఉండగా, తెలంగాణలో సగటు జనాభా 36.5 లక్షలుగా ఉంది. తెలంగాణ కంటే తక్కువ విస్తీర్ణం అతి తక్కువ జనాభా కలిగిన పలు రాష్టాల్రో ఎక్కువ సంఖ్యలో జిల్లాలున్నాయి. మనకన్నా చిన్నగా ఉన్నకేరళ తదితర రాస్ట్రాల్లో జిల్లాల సంఖ్య ఎక్కువగానే ఉంది.

రెండు పార్లమెంటు స్థానాలున్న అరుణాచల్‌ప్రదేశ్‌లో 17 జిల్లాలుండగా అన్నే స్థానాలున్న గోవాలో రెండే జిల్లాలున్నాయి. అలాగే 11 పార్లమెంటు స్థానాలున్న ఛత్తీస్‌ఘడ్‌లో 27 జిల్లాలుండగా, పది పార్లమెంటు స్థానాలున్న హర్యానాలో 21 జిల్లాలున్నాయి. ఆరు పార్లమెంటు స్థానాలున్న జమ్ముకాశ్మీర్‌లో 22 జిల్లాలున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 17 పార్లమెంటు స్థానాలున్నప్పటికీ పది జిల్లాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం దాదాపు 12 అసెంబ్లీ స్థానాలకు కలిపి ఒక జిల్లా ఉన్నది. దీన్ని విభజించి ప్రతి ఐదు నియోజక వర్గాలకు (అంటే 10 నుంచి 15 లక్షల జనాభా) కలిపి ఒక జిల్లాను ఏర్పాటు చేయాలనే నిర్ణయం స్వాగతించాల్సిందే!

### రాష్ట్రంలో జిల్లాల ఏర్పాటు చరిత్ర

నిజానికి జిల్లాల పెంపు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వంలో 1953లో వరంగల్ జిల్లాను విభజించి ఖమ్మం జిల్లాను ఏర్పాటు చేశారు. అప్పటి వరకు నల్లగొండ జిల్లాలో భాగమైన జనగామ ప్రాంతాన్ని ఇదే కాలంలో వరంగల్ జిల్లాలో చేర్చడం జరిగింది. తదనంతర కాలంలో మర్రి చెన్నారెడ్డి పూనిక మేరకు 1978 ప్రాంతంలో గతంలో అత్రాఫ్‌బల్దా పేరిట ఉన్న ప్రాంతంతో రంగారెడ్డి జిల్లా ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ జిల్లాల ఏర్పాటు జరగలేదు. అప్పటికి ఇప్పటికీ జనాభా రెండింతలు పెరిగింది. నిజానికి హైదరాబాద్ రాష్ట్రం ఏర్పాటు జరిగిన సమయంలో దాదాపు పది లక్షల మందికి ఒక జిల్లా ఉండింది. ఇప్పుడు కొత్తగా 10-12 లక్షల మంది జనాభాకు ఒక జిల్లా ఏర్పాటు కానుంది.




### ఇదీ కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యం

నిత్యం ప్రజలతో సంబంధాలుండే రెవెన్యూ, న్యాయ, మున్సిపల్, విద్య, వైద్యం తదితర ముఖ్య కార్యాలయాలన్నీ జిల్లా కేంద్రాల్లోనే కేంద్రీకృతమై ఉంటాయి. జిల్లాలు పెద్దవిగా ఉంటే మారు మూల ప్రాంతాల ప్రజలకు అసౌకర్యం కలుగుతుంది. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి అంతా ఒకే దగ్గర కేంద్రీకృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా వికేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. ఈ అవసరమే కొత్త జిల్లాల ఏర్పాటుకు నేపథ్యంగా మారింది.

రాష్ట్ర సాధన పోరాటంలో నీళ్లు, నిధులు, నియామకాలలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది తెలంగాణను సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపించుకోవాల్సిన అవసరం ఉంది. ఆ దిశలో ప్రభుత్వం పనిచేస్తున్నది. అందులో భాగంగానే కొత్త జిల్లాల ఏర్పాటు చోటు చేసుకుంది. వీలైనంతగా శాస్త్రీయ పద్ధతులను అనుసరించి 27 జిల్లాలతో కూడిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రజలకు సూచనలను, అభ్యంతరాలను తెలియజేయడానికి నెల రోజుల సమయం ఇచ్చింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ పట్ల ప్రజలు సానుకూలంగానే స్పందిస్తున్నారు.

జిల్లాల పునర్వ్యవస్థీకరణ మ్యాపుల లోనే గీతలు గీయడం ద్వారా జరుగడం లేదు. ఒక ప్రాంత విస్తీర్ణం, జనాభా, సహజవనరులు, మౌలిక వసతులు, ప్రజల అవసరాలు లాంటి ఎన్నో అంశాలను దృష్టిలో ఉంచుకొని కొత్త జిల్లాల ప్రతిపాదనలు రూపొందించారు. ప్రజల నుంచి పలు సూచనలు, అభ్యంతరాలు ప్రభుత్వానికి అందుతున్నాయి. వీటన్నింటినీ పరిశీలించి ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

### ప్రజలకు చేరువలో పాలన

ప్రజలు తమ అవసరార్థం వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రాలకు వెళ్ళడం ప్రస్తుతం కష్టంగా ఉంది. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న పలు పట్టణాలను జిల్లా కేంద్రాలుగా తీర్చిదిద్దడంద్వారా వికేంద్రీకరణ సాధ్యపడుతుంది. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన వారికి సత్వరంగా అందుబాటులోకి రావడానికి, నిర్వహణ, తనిఖీ, నిఘా వ్యవస్థలు పటిష్టంగా పనిచేయడానికి పరిపాలన వికేంద్రీకరణ కావాలి. అందుకు ఈ జిల్లాల పెంపు ఉపయోగపడుతుంది. అంతేగాకుండా ప్రతి జిల్లా కేంద్రంలోనూ కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంట్, మెడికల్, హెల్త్, ఎడ్యుకేషన్, ఇరిగేషన్ ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాలొస్తాయి. కొత్త కార్యాలయాలంటే కొత్త ఉద్యోగాలు, ఉన్న వారికి ప్రమోషన్లు. వీటన్నింటికి తోడు ఆయా జిల్లా కేంద్రాల్లో రియల్‌ఎస్టేట్ కార్యకలాపాలు పెరగడమే గాకుండా నేరుగా హైదరాబాద్‌కు నాలుగులేన్ల కనెక్టివిటీ రోడ్డు ఏర్పడుతుంది. అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పుంజుకుంటుంది. జిల్లా కేంద్రాలతో పాటుగా పదుల సంఖ్యలో మండలాలు కూడా కొత్తగా వస్తాయంటే ఇప్పటికే మండల కేంద్రాలకు దూరంగా ఉన్న కొన్ని గ్రామాలు కొత్తగా మండల కేంద్రాలుగా మారుతాయి. వీటివల్ల ఇప్పటి వరకు రెసిడెన్షియల్ కాలేజీలు, గురుకులాలు లేని ప్రాంతాలకు కొత్తగా ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటయ్యే అవకాశముంటుంది. మండల కేంద్రంలో ప్రస్తుతముండే ఎంఆర్ఓ, ఎంపిడిఓలతో పాటుగా ప్రభుత్వ రంగంలోని వివిధ కార్యాలయాలు మారు మూల గ్రామాలకు కూడా వచ్చే అవకాశముంటుంది. దీంతో గ్రామస్థాయిలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి.

### ప్రజలకు చేరువలో అధికార యంత్రాంగం

జిల్లాపెద్దదిగా ఉండటం వల్ల ఇంత కాలం ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది కలుగడమే కాకుండా జిల్లా యంత్రాంగానికి మొత్తం అన్ని గ్రామాలపై అవగాహన కొరవడింది. ఇప్పుడా సమస్య తొలగిపోతున్నది. ప్రజలు, ప్రజా ప్రతినిధులు పరిపాలనకు చేరువ అవుతారు.

– వంశీ

ద

# 27 జిల్లాలతో రాష్ట్రం

## ఇదీ నవ తెలంగాణ

**రాష్ట్ర చరిత్రలో 'కొత్త' శకం**

**పాత, ప్రతిపాదిత కొత్త జిల్లాల సరిహద్దులు..**

**మండలాలు, శాసనసభ నియోజకవర్గాలు..**

**ప్రధాన రహదారులు, నదులు,**

**రైల్వేలైన్ల వివరాలు కూడా**

**రూపొందించిన రెవెన్యూ శాఖ**

**వెబ్‌సైట్‌లో అందుబాటులోకి**

**రా**ష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న కొత్త జిల్లాల మ్యాప్‌లను తెలంగాణ సర్కార్ శుక్రవారం (ఆగస్టు 26) విడుదల చేసింది. తెలంగాణ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ ఈఆర్‌ఏసీ సహాయంతో భూ పరిపాలన ప్రధాన కమిషనర్ రేమండ్ పీటర్ వీటిని రూపొందించారు. మొత్తం ప్రతిపాదిత 27 జిల్లాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఇందులో పొందు పరిచారు. ప్రతిపాదిత 27 జిల్లాలతో పాటు కొత్త జిల్లాల మ్యాప్‌లను వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచారు. ప్రతిపాదిత కొత్త జిల్లాల రూపురేఖలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల వివరాలను ఆ పోర్టల్‌లో ప్రభుత్వం జిల్లాల వారీగా తెలియజేసింది.

హైదరాబాద్‌కు సంబంధించి ఎటువంటి మార్పులు లేకపోవడంతో ఆ వివరాలను ముసాయిదాలో ప్రస్తావించలేదు. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో 10 జిల్లాలు, 44 రెవెన్యూ డివిజన్లు, 459 మండలాలున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన పునర్విభజన ముసాయిదా ప్రకారం 27 జిల్లాలు, 58 రెవెన్యూ డివిజన్లు, 490 మండలాలు అవుతాయి. మరోవైపు జిల్లాల డ్రాఫ్ట్‌పై భారీగా అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకూ 5వేలకు పైగా విజ్ఞప్తులు, అభ్యంతరాలు స్వీకరించారు. ఇదిలా ఉంటే తొమ్మిది జిల్లాలకు వేర్వేరుగా ప్రభుత్వం సోమవారం (ఆగస్టు 22) నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా పైనున్న పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆయా జిల్లాల వారీగా ప్రజలు తమ అభ్యంతరాలను ఆన్‌లైన్ ద్వారా తెలియజేయవచ్చు. అందుకోసం ప్రభుత్వం 30 రోజుల గడువునిచ్చింది. తెలంగాణలో అక్టోబర్ 11 దసరా రోజున కొత్త జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. ద



## 1 అదిలాబాద్ జిల్లా



అదిలాబాద్, మావల, బజార్ హత్నూర్, బేల, బోథ్, జైనాథ్, థంషీ, తలమడుగు, గుడి హత్నూర్, ఇంద్రవెల్లి, జైనూర్, నార్నూర్, తిర్యాని, ఉట్నూర్, ఇచ్చోడ, నేరెడికొండ

## 2 నిర్మల్ జిల్లా



నిర్మల్, దిల్వార్‌పూర్, ఖడ్డం, ఖానాపూర్, మమడ, లక్ష్మణ్‌చంద, సారంగపూర్, కుబీర్, కుంతల, భైంసా, ముధోల్, లోకేశ్వరం, తానూరు

## 3 కొమరం భీం జిల్లా



చెన్నూర్, జైపూర్, కోటపల్లి, లక్సెట్టిపేట్, మంచిర్యాల్, నస్పూర్, మందమర్రి, దండెపల్లి, జన్నారం, కాసిపేట్, బెల్లంపల్లి, బ్రాహ్మణపల్లి, నెన్నెల్, తిర్యాని, తాండూర్, భీమిని, దయేగాం, ఆసిఫాబాద్, బెజ్జూర్, కాగజ్‌నగర్, కౌతల, రెబ్బన, సిర్పూర్, కెరమెరీ, వంకిడి

## 7 కరీంనగర్ జిల్లా



కరీంనగర్, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్, మానకొండూరు, తిమ్మాపూర్, బెజ్జంకి, గంగాధర, రామడుగు, చొప్పదండి, వి. సైదాపూర్, చిగురుమామిడి, వీణవంక, శంకరపట్నం, సిరిసిల్ల, గంభీరావుపేట, వేములవాడ, చందుర్తి, బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట, కోనారావుపేట

## 8 పెద్దపల్లి జిల్లా



పెద్దపల్లి, ఓదెల, సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడు, ధర్మారం, రామగుండం, అంతర్గాం, శ్రీరాంపూర్, కమాన్‌పూర్, మంథని, ముత్తారం

## 9 సంగారెడ్డి జిల్లా



కల్హేర్, కంగ్టి, నారాయణ్‌ఖేడ్, శిర్గాపూర్, మానూర్, సంగారెడ్డి, కొండాపూర్, సదాశివపేట్, పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, పుల్కల్, జిన్నారం, గుమ్మడిదల, హత్నూర, ఆందోల్, నర్సాపూర్, మునేపల్లి, కోహీర్, రాయ్‌కోడే, ఝరాసంగం, న్యాలకల్, జహీరాబాద్

## 13 వరంగల్ జిల్లా



వరంగల్, ఖిలా వరంగల్, హసన్‌పర్తి, ఐనవోలు, వర్ధన్నపేట, ఆత్మకూర్, గీసుగొండ, సంగెం, పర్వతగిరి, శాయంపేట, పరకాల, నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపూర్, నెక్కొండ

## 14 జయశంకర్ జిల్లా



భూపాలపల్లి, ఘన్‌పూర్ (ములుగు), వేగొండ, మొగుళ్లపల్లి, చిట్యాల, మల్హర్‌రావు, కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరు నాగారం, మంగపేట

## 15 మహబూబాబాద్ జిల్లా



మహబూబాబాద్, కురవి, కేసముద్రం, డోర్నకల్, నెల్లికుదురు, మరిపెడ, నర్సింహులపేట, తొర్రూర్, గూడూరు, కొత్తగూడ, బయ్యారం, గార్ల

## 4 నిజామాబాద్ జిల్లా



నిజామాబాద్(ద), నిజామాబాద్(ఉ), నిజామాబాద్ రూరల్, ముప్కాల్, డిచ్‌పల్లి, దర్పల్లి, ఇందల్‌వాయి, జక్రాన్‌పల్లి, సిరికొండ, నవీపేట, ఆర్మూర్, ఆలూర్, బాల్కొండ, మెండోర, కమ్మర్‌పల్లి, వేల్పూర్, మోర్తాడ్, భీంగల్, మాక్లూర్, నందిపేట, బోధన్, ఎడపల్లి, రెంజల్, కోటగిరి, వర్ని, రుద్రూర్

## 5 కామారెడ్డి జిల్లా



బిక్నూర్, రాజంపేట్, తాడ్వాయి, కామారెడ్డి, దోమకొండ, గాంధారి, లింగంపేట్, మాచారెడ్డి, సదాశివనగర్, రామారెడ్డి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, బాన్సువాడ, బిర్కూర్, బిచ్‌కుంద, జుక్కల్, మద్నూర్, నిజాంసాగర్, పిట్లం

## 6 జగిత్యాల జిల్లా



జగిత్యాల, రాయికల్, సారంగపూర్, ధర్మపురి, పెగడపల్లి, గొల్లపల్లి, మల్యాల, కొడిమ్యాల, వెల్గటూరు, కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మేడిపల్లి, కథలాపూర్

## 10 మెదక్ జిల్లా



మెదక్, పాపన్నపేట్, రామాయంపేట్, శంకరంపేట–ఆర్, శంకరంపేట–ఎ, టేక్మల్, అల్లాదుర్గ్, రేగోడ్, కుల్చారం, తూప్రాన్, చేకుంట, కౌడిపల్లి, శివ్వంపేట, వెల్దుర్తి

## 11 సిద్దిపేట జిల్లా



దౌల్తాబాద్, గజ్వేల్, జగదేవపూర్, కొండపాక, ములుగు, వర్గల్, చేర్యాల, మద్దూర్, దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, నంగునూర్, చిన్నకోదూరు, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, కోహెడ, హుస్నాబాద్, ముస్తాబాద్, ఇల్లంతకుంట

## 12 హన్మకొండ జిల్లా

హన్మకొండ, కాజీపేట, ధర్మసాగర్, చిల్పూర్, వేలేరు, స్టేషన్ ఘన్‌పూర్, రాయపర్తి, జఫర్‌గఢ్, నర్మెట, రఘునాథపల్లి, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పల, హుజూరాబాద్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్, జమ్మికుంట, ఇల్లంతకుంట



## 16 ఖమ్మం జిల్లా



ఖమ్మం (అర్బన్), ఖమ్మం (రూరల్), తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, బోనకల్, చింతకాని, ముదిగొండ, కొణిజెర్ల, సింగరేణి, కామేపల్లి, రఘునాథపాలెం, సత్తుపల్లి, వేమ్సూర్, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, వైరా, ఎన్కూరు, జూలూరుపాడు, మధిర, ఎర్రుపాలెం

## 17 కొత్తగూడెం జిల్లా



కొత్తగూడెం, పాల్వంచ, టేకులపల్లి, ఇల్లెందు, చంద్రుగొండ, అశ్వారావుపేట, ములకలపల్లి, దమ్మపేట, గుండాల, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు, బూర్గంపహాడ్, అశ్వాపురం, మణుగూరు, పినపాక

## 18 రంగారెడ్డి జిల్లా



మర్పల్లి, మోమిన్‌పేట, వికారాబాద్, ధారూర్, బంట్వారం, పెద్దేముల్, తాండూర్, బషీరాబాద్, యాలాల, నవాబ్‌పేట, శంకర్‌పల్లి, మొయినాబాద్, చేవెళ్ల, దోమ, గండేడ్, కుల్కచర్ల, పరిగి, పొందూరు, షాబాద్

## 19 మల్కాజ్‌గిరి జిల్లా



మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, దుండిగల్, బాలానగర్, ఉప్పల్, కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట్, జవహర్‌నగర్

## 20 శంషాబాద్ జిల్లా



కందుకూర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, మంచాల్, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, సరూర్‌నగర్, బాలాపూర్, శంషాబాద్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, గండిపేట్, కొందుర్గ్, ఫరూక్‌నగర్, కొత్తూరు, కేశంపేట్

## 21 హైదరాబాద్ జిల్లా

బహదూర్‌పుర, ఆసిఫ్‌నగర్, ముషీరాబాద్, సైదాబాద్, బండ్లగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, చార్మినార్, తిర్మలగిరి, గొల్కొండ, నాంపల్లి, మారేడుపల్లి, అంబర్‌పేట, సికింద్రాబాద్, హిమాయత్‌నగర్, అమీర్‌పేట్



## 22 యాదాద్రి జిల్లా



ఆలేరు, గుండాల, రాజపేట, జనగామ, లింగాల ఘన్‌పూర్, దేవరుప్పల, బచ్చన్నపేట, మోత్కూర్, తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, బీబీనగర్, బొమ్మల రామారం, ఆత్మకూర్(ఎం), బి.పోచంపల్లి, రామన్నపేట, వలిగొండ, చౌటుప్పల్, మోటకొండూర్, అడ్డగూడూరు

## 23 నల్లగొండ జిల్లా



చందూర్, చిట్యాల, కనగల్, కట్టంగూర్, మునుగోడ్, నకిరేకల్, నల్లగొండ, నారాయణ్‌పూర్, నార్కెట్‌పల్లి, తిప్పర్తి, కేతపల్లి, శాలిగౌరారం, గట్టుప్పల్, దామరచర్ల, మిర్యాలగూడ, వేములపలి, అనుమల (హాలియా), మిడ్‌మానూర్, పెదవూర, త్రిపురారం, మాడ్గులపల్లి, తిరుమలగిరి (సాగర్), చందంపేట్, చింత పల్లి, దేవరకొండ, గుర్రంపూర్, కొండమల్లెపల్లి, మర్రిగూడ, నాంపల్లి, పీఏ పల్లి

## 24 సూర్యాపేట జిల్లా



ఆత్మకూర్, చివ్వెంల, జాజిరెడ్డిగూడెం, నూతనకల్, పెన్‌పహాడ్, సూర్యాపేట, తిరుమలగిరి, తుంగతుర్తి, గరిడేపల్లి, నేరేడుచర్ల, నాగారం, చిల్కూర్, హుజూర్‌నగర్, కోదాడ, మఠంపల్లి, మేళ్లచెర్వు, మోతె, మొనగాల, నడిగూడెం, అనంతగిరి

## 25 మహబూబ్‌నగర్ జిల్లా



మహబూబ్‌నగర్ రూరల్, అడ్డకల్, భూత్పూర్, హన్వడ, కోయిల్‌కొండ, మహబూబ్‌నగర్ అర్బన్, నవాబ్‌పేట్, జడ్చర్ల, మిడ్జిల్, బాలానగర్, రాజ్‌పూర్, దేవరకద్ర, మరికల్, బొమ్మరజ్‌పేట్, దామరగిడ్డ, దన్వాడ, దౌల్తాబాద్, కొండంగల్, కోస్గి, మద్దూర్, మగ్నూర్, మక్తల్, నారాయణ్‌పేట్, నర్వ, ఉట్కూర్, ఫరూఖ్‌నగర్, కొత్తూర్, కేశంపేట్, కొందుర్గ్

## 26 నాగర్‌కర్నూల్ జిల్లా



బిజినపల్లి, కొల్లాపూర్, కొడైర్, నాగర్‌కర్నూల్, పెద్దకొత్తపల్లి, తెల్కపల్లి, తిమ్మాజిపేట్, తాండూర్, కల్వకుర్తి, ఆమంగల్, మద్గుల్, తలకొండపల్లి, వెల్దండ, వంగూర్, చిన్నంబావి, అచ్చంపేట్, అమ్రాబాద్, పదర, బాల్మూర్, లింగాల్, ఉప్పునూతల

## 27 వనపర్తి జిల్లా



వనపర్తి, గన్పూర్, గోపాల్‌పేట్, కొత్తకోట, పెబ్బేర్, పెద్దమందడి, దీపనగండ్ల, పంగల్, ఆత్మకూర్, అమరచింత, సీసీకుంట, గద్వాల్, మల్దకల్, దరూర్, గట్టు, నందిన్నె, ఐజ, ఇటిక్యాల, ఆలంపూర్, మానోపాడ్, వడ్డేపల్లి

# జిల్లాల ఏర్పాటుకు చారిత్రక ప్రాధాన్యం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చారిత్రకంగా, రాజకీయంగా ఎంతటి ప్రాధాన్యత ఉందో అంతే ప్రాధాన్యత కొత్త ఏర్పాటు చేయబోతున్న జిల్లాకు ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి వెంటనే అందుబాటులోకి రావాలన్నా, నిర్వహణ, తనిఖీ, నిఘా వ్యవస్థలు పటిష్టంగా పనిచేయడానికి పరిపాలన వికేంద్రీకరణ అవసరం. అందుకోసమే తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పెంపు ఉపయోగపడుతుంది. ప్రజలు తమ అవసరార్థం వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రాలకు వెళ్ళడం ప్రస్తుతం కష్టంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం జిల్లా, మండల యూనిట్‌గా తీసుకొని బడ్జెట్ కేటాయించడం, పలు పథకాలని అమలు చేస్తున్నారు. దీంతో జిల్లాల ప్రాధాన్యత, మండలాల ఆవశ్యకత పెరిగింది.

### పాలనలో ప్రజలకు మరింత భాగస్వామ్యం

దేశ చట్టాలను అనుసరించి పంచాయతీ, మున్సిపాలిటీ లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సుమారు యాభై శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ వల్ల బడుగు, బలహీన వర్గాలకు, మహిళలకు పాలనలో అధిక భాగస్వామ్యం కలుగుతుంది. జిల్లాల పునర్వ్య వస్థీకరణ ద్వారా అంబేద్కర్ కలలుగన్న విధంగా బడుగు, బలహీన వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యమయ్యే అవకాశం పెరుగుతుంది.




### కొత్తగా ఉద్యోగాలు - ఉపాధి

కొత్త జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు పెరగడం వల్ల ఓ రకంగా కొత్తగా ఉద్యోగాల కల్పన జరుగనుంది. దీంతో మరిన్ని అవకాశాలు పెరుగుతాయి. ప్రత్యక్షంగా ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశంతో పాటుగా పరోక్షంగా అనేక విధాలుగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇది నిరుద్యోగులకు వ రం కానుంది. నిరుద్యోగులు స్వయం ఉపాధి పెంచుకునే వీలు కలుగు తుంది.

### కేంద్రం నుంచి మరిన్ని నిధులు

కేంద్ర ప్రభుత్వం జిల్లాని, బ్లాక్‌ని (మండలం) యూనిట్‌గా తీసుకొని బడ్జెట్ కేటాయించడం, పలు పథకాలని అమలు జేస్తుండడంతో జిల్లాల ప్రాధాన్యత, మండలాల ఆవశ్యకత పెరిగింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఇటీవలి మార్గదర్శకాలలో జిల్లా ప్రణాళికా కమిటీల పాత్ర, కేంద్ర ప్రభుత్వం పంచా యతీలకు కేటాయించే గ్రాంట్ల గూర్చి తెలియజేసింది. అనేక కేంద్ర ప్రభుత్వ నిధులు నేరుగా కేంద్రం నుంచి పంచాయతీలకు తీసుకెళ్లే విధానాన్ని రూపొందించారు. పంచాయత్ వికేంద్రీకరణ సూచిక ప్రాముఖ్యాన్ని వివరించారు. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ స్థాపించిన ప్లాన్ ప్లస్ అనే సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ ద్వారా నిధులు కేటాయించడమే కాకుండా, పంచాయతీల పని తీరును ఎప్పటికప్పుడు కేంద్రం పరిశీలిస్తుంది. కేంద్ర ప్రభుత్వం బ్యాక్‌వర్డ్ రీజియన్ గ్రాంట్ ఫండ్ ప్రోగ్రాంలో భాగంగా ఇచ్చే నిధులను జిల్లా ఒక యూనిట్‌గా ఇస్తుంది. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నియమావళిని అనుసరించి కనీసం రూ.పది కోట్లు ప్రతి సంవత్సరం వెనుకబడిన జిల్లాగా ప్రకటించిన దానికి కేటాయించాలి. ప్రతి వెనుకబడిన జిల్లాకు ప్రతీ సంవత్సరం రూ.కోటి కేటాయించాలని కేంద్ర పంచాయతీరాజ్ నియమావళిలో ఉన్నది. ఈ నియమావళిని అనుసరించి జిల్లాల పునర్వ్యవస్థీకరణ వ్లల తెలంగాణకు అథమపక్షంలో సంవత్సరానికి సుమారు రూ.150 కోట్ల ప్రయోజనం కలుగవచ్చు. రాజీవ్‌గాంధీ పంచాయత్ సశక్తికరణ్ అభియాన్ ద్వారా వచ్చే నిధులు కూడా పెరిగే అవకాశం ఉన్నది.

### మరెన్నో ప్రయోజనాలు

తెలంగాణ మానవాభివృద్ధి సూచీని పెంచడమే కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడం కోసం జిల్లాల పునర్వ్యవస్థీకరణ ఎంతో దోహదపడుతుంది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలతో మాత్రమే కాకుండా, టీఎస్ ఐపాస్ ద్వారా అనేక కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం వల్ల ఉద్యోగ కల్పన పెరుగుతున్నది. కొత్త జిల్లాల్లోనూ కొత్తగా అనేక పరిశ్రమలు వచ్చే అవకాశం ఏర్పడుతుంది.

### వివిధ రంగాల్లో కీలక మార్పులు

వివిధ మంత్రిత్వ శాఖలలో అనేక గణనీయమైన మార్పులు సంభవించి ప్రజలకు జిల్లా యంత్రాంగం చేరువై, ప్రజలను ప్రగతి పథంలో తీసుకువెళ్లే అవకాశం వికేంద్రీకరణ ద్వారా సాధ్యమవుతుంది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా తెలంగాణను నడిపించే ప్రయత్నంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణను చూడాలి. జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం తెలంగాణ పంచాయతీ రాజ్ వ్యవస్థను కేరళ రాష్ట్రం స్థాయిలో పటిష్టపరిచేందుకు చర్యలు చేపట్టాలి.

### కొత్త జిల్లాల ఏర్పాటుతో

### పలు రంగాల్లో కీలక మార్పులకు నాంది

**వ్యవసాయం:** వ్యవసాయంలో అనేక సబ్సిడీలు,లోన్లు, ఇన్సూరెన్స్ కరువు నివారణకు సంబంధించిన నిర్ణయాలు జిల్లాలను యూనిట్‌గా చేసుకొని జరుగుతాయి. జిల్లాల పునర్వ్యవస్థీకరణ

**'జిల్లా' విశేషాలు!**

ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాల్లో పాలనాపరమైన సౌలభ్యం కోసం ఏర్పాటైన చిన్న యూనిట్లను వివిధ రకాల పేర్లతో వ్యవహ రిస్తుంటారు. భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో ఈ యూ నిట్లను జిల్లాలుగా వ్యవహరిస్తుంటారు. భారతదేశంలో ఉన్న సుమారు 683 జిల్లాల పేర్లు దేనికవే విశిష్టంగా ఉన్నప్పటికీ, కొన్ని మినహాయింపులు మాత్రం ఉన్నాయి.

**భారతదేశంలో 7 జిల్లాల పేర్లు రెండు రాష్ట్రాల్లోని జిల్లాలకు ఉ ండడంతో కొంత అయోమయం ఏర్పడుతోంది.**

1. ఔరంగాబాద్ జిల్లా (బీహార్, మహారాష్ట్ర)
2. బీజాపూర్ (చత్తీస్‌గఢ్, కర్నాటక)
3. బిలాస్‌పూర్ (చత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్)
4. హమీర్‌పూర్ (హిమాచల్ ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్)
5. ప్రతాప్‌గఢ్ (రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్)
6. బలరాంపూర్ (చత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్)

**భారతదేశం వెలుపల దక్షిణాసియా పరిధిలో 7 జిల్లాలు అదే విధమైన పేర్లతో ఉన్నాయి.**

1. భోజ్‌పూర్ (బీహార్, నేపాల్)
2. డామన్ (డామన్, ఆఫ్ఘనిస్థాన్)
3. ఘజియాబాద్ (ఉత్తర్‌ప్రదేశ్, ఆఫ్ఘనిస్థాన్)
4. గోపాల్‌గంజ్ (బీహార్, బంగ్లాదేశ్)
5. హైదరాబాద్ (తెలంగాణ, పాకిస్థాన్)
6. లలిత్‌పూర్ (ఉత్తర్‌ప్రదేశ్, నేపాల్)
7. పూంచ్ (జమ్మూకశ్మీర్, పాకిస్థాన్)

దక్షిణాసియాకు వెలుపల పరిశీలిస్తే, పంజాబ్‌లో మన్సా జిల్లా ఉండగా, అదే పేరుతో ఒక జిల్లా జాంబియాలో ఉంది.

వల్ల రైతులకు పంట బీమా, కరువు నివారణ మొదలగు విషయా లలో ఇప్పుడున్న నిబంధనల మేరకు అధిక ప్రయోజనం కలుగు తుంది.

**బ్యాంకింగ్, ఫైనాన్స్:** పట్టణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ కార్యకలాపాలు అధికమవుతాయి. రుణసౌకర్యాలు పెరుగుతాయి.




**శాంతిభద్రతలు:** పోలీసు బలగాలు ప్ర జలకు మరింత చేరువ అవుతాయి. శాం తిభద్రతలను నెలకొల్పడం సులభమవు తుంది.

**న్యాయవ్యవస్థ:** కోర్టులు మరింతగా ప్రజలకు చేరువ అవుతాయి.

**విద్య:** కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు వారి నియ మావళిని అనుసరించి కనీసం జిల్లాకు ఒకటి కేటాయించ వలసి ఉంటుంది. కాబట్టి జిల్లాలు పెరిగినప్పుడు సుమారు 10-12 కేంద్రీయ విద్యాలయాలతో పాటు నవోదయ విద్యాల యాలు కొత్తవి కేంద్రం ప్రకటించ వలసి ఉంటుంది. తద్వారా కొన్నివేల మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా ప్రయోజనం జరుగుతుం ది. అంతే కాకుండా పరోక్షంగా ఆ విద్యాలయాలు ఏర్పడినప్పుడు ఆ ప్రాంత ప్రజలకు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాల ద్వారా ఉపాధి పెరుగుతుంది.

**పరిశ్రమలు:** కొత్తగా ఏర్పడే జిల్లాకేంద్రాల్లో పారిశ్రామిక వాడలను నెలకొల్పడం ద్వారా నూతనంగా పరిశ్రమలను ఏర్పాటు చేయదల్చిన ఔత్సాహికులకు ప్రోత్సాహం అందుతుంది.

**ఆరోగ్యం:** జిల్లా హాస్పిటల్స్ పెరుగడం ద్వారా పేదవారికి వైద్యం చేరువ అవడమే కాకుండా, కేంద్రం ఇచ్చే గ్రాంట్ల ద్వారా ఐసీయూ యూనిట్స్, స్త్రీ,శిశు సంక్షేమ యూనిట్స్, డయాలసిస్ యూనిట్లు పెరిగే అవకాశం ఉంటుంది.

**మౌలిక వసతులు:** కొత్తగా ఏర్పడే జిల్లాకేంద్రాల్లో మౌలిక వసతులు వృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

**కార్మిక శక్తి:** ఇప్పటి వరకూ రకరకాల కారణాలతో హైదరా బాద్ వంటి ప్రధాన నగరాలకు వలసపోయిన కార్మికశక్తికి స్థానికంగా వారి స్వస్థలాలకు దగ్గర్లోనే ఉపాధి లభ్యమయ్యే అవకాశాలు అధికమవుతాయి.

**పర్యాటకం:** కొత్తగా ఏర్పడే జిల్లాకేంద్రా లతో ఆయా ప్రాంతాల్లో రహదారులు, హో టళ్ళు వంటి మౌలికవసతులు మెరుగుపడి పర్యాటక రంగానికి ఊతం లభిస్తుంది.

**అడవులు, వన్యప్రాణులు:** జిల్లా స్థాయిలో పటిష్ఠ పాలనాయంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవడం ద్వారా అడవులు, వన్య ప్రాణులను కాపాడుకోవడం సులభమవుతుం ది.

**గ్రామీణ, పట్టణ ప్రాంతాలు:** గ్రామీణ, పట్టణ కేంద్రాలకు మధ్య దూరం తగ్గి వివిధ రకాలుగా ప్రజల మధ్య అంతరాలు తగ్గే అవకాశం ఉంటుంది.

**విద్యుత్, ఇతర ఇంధన వనరులు:** వివిధ శక్తి వనరులను ప్రజలకు మరింతగా అందించే అవకాశం కలుగుతుంది.

**టెలికమ్యూనికేషన్స్:** సమాచారవ్యవస్థ లాంటివి మెరుగు పర్చుకునే అవకాశం లభిస్తుంది.

**రవాణా వ్యవస్థలు:** స్థానికంగా మాత్రమే గాకుండా రాష్ట్ర రాజధాని నగరంతో అనుసంధానం కలిగి రహదారి వ్యవస్థ మెరుగు పడుతుంది.

**క్రీడలు:** జిల్లా కేంద్రాలుగా పట్టణ స్థాయిలో అధునాతన క్రీడావసతులు అందుబాటులోకి వస్తాయి. కొత్తగా ఎన్నో స్టేడియంలు రూపుదిద్దుకుంటాయి.

ఇలా వివిధ రంగాల్లో నూతన జిల్లా కేంద్రాల్లో వసతులు, సదుపాయాలు మెరుగుపడనున్నాయి. **- శివ**

ద

ఎమ్మెస్ తల్లి వద్దకు వెళ్లి తాను మంచి కచేరీలు ఏర్పాటు చేసి ప్రచారంలోకి తీసుకు వస్తానని మాట ఇచ్చారు. ఆ ప్రకారంగా 1940 నాటికి ఎమ్మెస్‌కు దక్షిణ భారతంలో గొప్ప శాస్త్రీయ గాయని గా మార్చారు. తాను జర్నలిస్టు కావడంతో తనకున్న పెద్ద పెద్ద పరిచయాలతో గాంధీ, నెహ్రూ, రాజాజీలకు పరిచయం చేశారు. ఇవన్నీ ఎమ్మెస్ కెరియర్‌కు దోహద పడినవి. ఈ క్రమంలో వీరి సాన్నిహిత్యం 1940 జూలై 10 నాటికి వివాహంగా పరిణమించింది. అయితే, సదాశివం అప్పటికే వివాహితుడు. ఇవేమీ వారి పెళ్ళికి నాటి పరిస్థితులలో అవరోధం కాలేదు. వివాహానంతరం సదాశివం పూర్తిగా ఎమ్మెస్ సంగీత కార్యక్రమాల ఏర్పాటుకు పరిమితమైనారు. ఇక్కడి నుండి ఆమె పాడిన ఒక్కొక్క కచేరీ కీర్తి శిఖరాలను చేరే ఒక్కో సోపానంగా ఆయన తీర్చిదిద్దారు. ప్రచారానికి సంబంధించిన కిటుకులన్నీ ఆయనకు తెలుసు. వాస్తవానికి ఎం.ఎస్. పుట్టింది కళావంతుల కుటుంబంలోనే. అయినా, సదాశివంతో పెళ్లైన తర్వాత ఆమె ఆ ముద్రను పూర్తిగా చెరిపేసుకున్నారు. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి – సదాశివంల జంటను నాడు ప్రముఖులెందరో 'సావిత్రి – సత్యవంతుల'తో పోల్చారు. రాజాజీ గారైతే 'మీ ఇద్దరిని చూస్తే.. ఎవరు సావిత్రో, ఎవరు సత్యవంతులో తెలియడం లేదు.. మీరిద్దరి మధ్య ఉన్న అనురాగం అలాంటిది' అన్నారొక సందర్భంలో. మంగళంపల్లి వారైతే 'మాలాంటి వారము ఏకంగా ప్రజల్లోకి వెళ్లలేము. ఎవరో ఒకరు మీడియేటర్ కావాలి. కానీ సుబ్బులక్ష్మి గారికి ఆ ఇబ్బంది లేదు. అందుకు సదాశివం గారున్నారు' అన్నారు.

త్యాగరాజన్ సదాశివం తిరుచ్చి జిల్లా మనక్కాలిలో 1902, సెప్టెంబర్ 4న జన్మించారు. చిన్నతనంలోనే బడి వదిలి స్వాతంత్ర్య పోరాటంలో చేరారు. యువ కాంగ్రెస్ వాలంటీర్‌గా రాజాజీకి అత్యంత సన్నిహితులైనారు. సుబ్రహ్మణ్య భారతి, నామక్కల్, రామలింగం పిళ్లై రచించిన దేశభక్తి గీతాలను రాగయుక్తంగా పాడుతూ ప్రజలను ఉత్తేజితులను చేసేవారు.

ఖాదీ ప్రచారోద్యమానికి రాజాజీ సదాశివాన్ని నియమించారు. ఎం.ఎస్.తో వివాహం తర్వాత 'కల్కి' పత్రికను ప్రారంభించారు. కళారంగం కోసం 'శృతి' అనే పత్రికను కూడా నిర్వహించారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో జైలుకెళ్లారు.

ఎం.ఎస్. కోసం సదాశివం స్వయంగా 'శకుంతల', 'మీరా' చిత్రాలు నిర్మించారు. గాంధేయవాదిగా నిరాండబరత, నిజాయితీ గల వ్యక్తిత్వంతో జీవించిన ఆయన 1997, నవంబర్ 21న 95వ ఏట మృతి చెందారు.

66 ఏళ్ళ అన్యోన్య దాంపత్య జీవితంలో సదాశివం మృతి ఎం.ఎస్‌లో నిర్లిప్తతను నింపింది. ఆనాటి నుండి ఆమె చివరి శ్వాస వరకు కచేరీలకు దూరంగా ఉండిపోయారు.

(రచయిత 2016లో ఎం.ఎస్.సుబ్బులక్ష్మి శతజయంతి సంచికను తీసుకురానున్నారు.)

**– హెచ్.రమేష్‌బాబు,**

**మొబైల్: 94409 25814**

**మెయిల్ :** hrameshbabu5@gmail.com

### గాంధీ మెచ్చిన గాత్రం

గాంధీజీ హత్యకు కొన్ని నెలల ముందు ఆయన నుండి సదాశివంకి ఓ కబురు వచ్చింది. అదేమిటంటే "ఎమ్మెస్ నోట హరి తుమ్ హరో" పాటను వినాలని ఉందని. అయితే ఆ పాట ఆమెకు రాదని తిరుగు సమాచారం పంపగా, గాంధీజీ "ఈ పాట ఎమ్మెస్ నోట మాటల్లో చదివినా చాలు ఆమె పాడాలని" మళ్ళీ కబురు పంపారు. ఆయన కోరిక మేరకు ప్రత్యేకంగా పాడి చేసిన రికార్డును పంపారు. సరిగ్గా ఆ రోజు 1947, అక్టోబర్ 2, అలా ఆ పాట గాంధీకి జన్మదిన కానుకైంది. ఆ తరువాత 1948 జనవరిలో మహాత్ముని మరణ వార్త ప్రసారం చేసిన ఆకాశవాణి వారు వెంటనే ఎమ్మెస్ ఆయన కోసం గానం చేసిన "హరితుమ్‌హరో" ప్రసారం చేశారు. ఇది విన్న సుబ్బులక్ష్మి స్పృహతప్పిపడిపోయారు.

### కీర్తి కిరీటంలో మైలురాళ్ళు

తన సంగీత యాత్రలో ఆరు దశాబ్దాల పాటు ఎం.ఎస్. అందుకున్న పురస్కారాలు, సత్కారాలు అసంఖ్యాకం. పాతికేళ్ళ వయసు నాటికి ప్రఖ్యాత 'ఇసైవాణి' (1940) అవార్డు అందుకున్నారామె. 'పద్మభూషణ్' బిరుదును 1954లో అందుకున్న ఎమ్మెస్ 1956లో కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డును, రాష్ట్రపతి పతకాన్ని 1967లో రవీంద్రభారతి విశ్వవిద్యాలయం వారి గౌరవ డాక్టరేటును, 1968లో మద్రాసు మ్యూజిక్ అకాడమి "సంగీత కళానిధి" బిరుదుని పొందిన తొలి సంగీత విద్వన్మణి అయ్యారు. ఈ నేపథ్యంలో ఎం.ఎస్. 'ఇసైపెరిఞ్ఞర్ (1970), శ్రీ వెంకటేశ్వర వర్సిటీ గౌరవ డాక్టరేటు, 'రామన్ మెగసెస్' అవార్డు, సంగీత నాటక అకాడమి ఫెలోషిప్ (1974) సంగీత సార్వభౌమి, 'పద్మభూషణ్', టిటిడి సప్తగిరి సంగీత విద్వన్మణి బిరుదం (1975) మధ్యప్రదేశ్ వర్సిటీ డాక్టరేటు ఆఫ్ లెటర్ (1980), అంతర్జాతీయ సంగీత సంఘంలో గౌరవ సభ్యత్వం, శాంతినికేతన్ దేశికొత్తమ అవార్డు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్వాంసురాలిగా నియామకం (1981), మద్రాస్ యూనివర్సిటీ డి.లిట్ (1987) ఇందిరాగాంధీ నేషనల్ చాంబర్ ఆఫ్ ఆర్ట్స్‌కి ట్రస్టీగా నియామకం, "కాళీదాస్ సమ్మాన్ (1988), ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా అవార్డు (1990), "కోణార్క్ సమ్మాన్" (1991) గుప్తా ఫౌండేషన్ అవార్డు (1996) స్వరాలయ అవార్డు (1997), భారత ప్రభుత్వ అత్యున్నత "భారతరత్న" (1998) "సంగీత సాగర్" అవార్డు (1998) ఐటిసి వారి సంగీత అవార్డు, కేంద్ర ప్రభుత్వం లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డులు (2004) ఎమ్మెస్‌ను వరించి తమ గౌరవాన్ని పెంచుకున్నవి.

ద

# ఆనాటి నా గొడవ



స్వాతంత్ర్య దినోత్సవం శ్రద్ధలేని తద్దినమని అందరూ అనుకుంటున్న మాటే.. దేశోద్ధరణం అంతా వేషాలని, మోసాలని అందరూ అనుకుంటున్నదే.. సత్తా రాగానే కన్నులు నెత్తికెక్కి పోతాయనీ, త్యాగులు సైతం ఘడియలో భోగులైపోతారని ఇప్పుడు అందరూ అనుకుంటున్నదే.. అలా ఎందుకనుకుంటున్నారో మహాకవి కాళోజీ వృద్ధాప్యంలో సైతం సునిశిత పరిశీలనా వైదుష్యం కొరవడకుండా ఎలా వివరిస్తున్నారంటే..

1947 ఆగస్ట్ 15 నాడొచ్చిన స్వాతంత్ర్యం మా కొచ్చిన స్వాతంత్ర్యం కాదు. మాకు స్వాతంత్ర్యం వచ్చింది 17 సెప్టెంబర్ 1948లో నైజాం సరెండర్ అయింతర్వాత, పోలీస్ యాక్షన్ తర్వాత. కాబట్టి అక్కడ (బ్రిటీష్ ఇండియా) జరిగిన స్వాతంత్ర్య సమరమేదైతే ఉన్నదో అది కాకుండా 1935-34 నుంచి ఇక్కడ స్టేట్ కాంగ్రెస్ లాంటి సంస్థల పక్షాన ఆదోళన నడిచింది. అంతే కాదు 1947 ఆగస్ట్ 15 తర్వాత 1948 సెప్టెంబర్ వరకూ మా పోరాటం సాగింది. భారతదేశంలోని తక్కిన భాగాలలో జరిగిన పోరాటానికి ఇక్కడి మా పోరాటానికి బేధం ఉన్నది.

అక్కడ కేవలం పోరాటం సాగింది విదేశీ ప్రభుత్వంపైనే. విదేశీ ప్రభుత్వం పోయినట్లయితే స్వాతంత్ర్యం వస్తుందన్న అభిప్రాయంతో అక్కడ ఉద్యమం జరిగింది. అక్కడ పోరాటం చేసిన వారికి తగాగా ప్రభుత్వం తోటే. కానీ ఇక్కడ మా తెలంగాణా పోరాటం-అది పెత్తందార్లతోటి. సనాతన చాదస్తుల తోటి, భాషా పరంగా గ్రంథాలయ పరంగా భాషకు సంబంధించిన పోరాటాన్ని కూడా మేం సాగించినం. మతపరంగా కూడా మా ఆందోళన సాగింది. అలా జీవితానికి సంబంధించి ఎన్ని రంగాలున్నాయో అన్ని రంగాల్లోనూ మాకు పోరాటం చేయవలసి వచ్చింది.

బ్రిటిష్ ఇండియాలో ఉన్నవారి పోరాటం రాజకీయ స్వాతంత్ర్యం కోసం. విదేశీయులను బయటికి పంపించటం కోసం. ఇది చాలా గమనించవలసిన విషయం. అక్కడి వాళ్ల ఇబ్బందులు కేవలం ప్రభుత్వం నుంచే అయితే ఇన్ని రకాల వర్గాల నుంచి మాకు విరోధం కలిగింది. ఉదాహరణకి చెప్పదల్చుకుంటే 1934-35లో ఆంధ్రమహాసభ మూడవ వార్షికోత్సవం జరిగింది. ఖమ్మం మెట్టులో జరిగిన ఈ సమావేశంలో బాల్య వివాహాల విషయంలో ఒక తీర్మానం చేయాలని ఉద్దేశం.

అయితే ప్రభుత్వం వారి వైపు నుంచేమో అక్కడ ఏ విధంగా ఉపన్యాసాలిస్తారో ముందే చెప్పాలని, కాపీలివ్వాలని ఆంక్షలు, సనాతనుల వైపు నుంచేమో బాల్య వివాహాలు వద్దని గనక ఉంటే రక్తం పారుతుందని హెచ్చరికలు..

భాష విషయం లోపటా చిక్కులే. ఉర్దూ వాల్లు ఉర్దూనే ఉపయోగించాలన్నారు. పోరాటంలో మా పరిస్థితి ఎట్లు ఉండెనంటే..

ఉర్దూగానిది తెలుగు - ఈ తెలుగులో ఏం జరిగిన గాని ఉర్దూకు విరోధమైంది. ఉర్దూకు విరోధమైంది కాబట్టి ముస్లిమ్స్‌కు విరోధమైంది. కాబట్టి అది స్టేట్‌కు (రాజ్యానికి) విరోధమైంది. మత పాక్షిక దృష్టితోటే భాషాపాక్షిక దృష్టితోటే ఇలా ఉర్దూకానిదల్లా రాజ్యానికి విరుద్ధమైపోయింది.

గ్రంథాలయాల విషయం లోపటా, గుళ్ల విషయం లోపటా, పూజా పునస్కారాల విషయంలోపటా ఇట్లనే జరిగింది.

1939లోపట రాజకీయానికి సంబంధించిన ఆందోళన 'స్టేట్ కాంగ్రెస్' వైపునుంచి జరిగితే, మత హక్కులకు సంబంధించిన ఉద్యమం ఆర్యసమాజ్, హిందూ మహాసభల వైపు నుంచి జరిగింది.

1924-26లో మాడపాటి హనుమంతరావు ద్వారా నడిచిన ఆంధ్రమహాసభ ఆంధ్ర జన కేంద్రసంఘం యాక్టివిటీ ఏమిటంటే, వెట్టి చాకిరీ ఉండకూడదనీ ప్రభుత్వ అధికారులు 'దౌర'కు పోయినప్పుడు ధరణచ్చి మాత్రమే వస్తువులను కొనాలన్నా ఆందోళన చేయటం. ఈ వెట్టిచాకిరి మీదనే పెత్తందారితనం ఆధారపడి ఉండేది. ఈ వెట్టిచాకిరిపై ఆ తర్వాతి కాలంలో కమ్యూనిస్టులు పోరాటం నడిపారు. చివరికి అది సాయుధ పోరాటం అయ్యింది.

పోరాట క్రమంలో ఆంధ్రమహాసభ మొట్టమొదటిది. ఆ తర్వాత పదేళ్ళకు - మహారాష్ట్ర పరిషత్తు ఏర్పడ్డది. నిజాం స్టేట్‌లా! తెలంగాణా, మరాఠ్వాడా, కర్నాటక అని మూడు భాగాలు. కర్నాటక వారి 3 జిల్లాలూ, మహారాష్ట్రవి 5 జిల్లాలూ, తెలంగాణావి 9 జిల్లాలు ఇదంతా నిజాం రాజ్యం.

ఆ రోజుల్లో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో యువకుడిగా ఉన్న రావి నారాయణరెడ్డి పాల్గొన్నారు. మాడపాటి హనుమంతరావు ఆదేశానుసారం. దాన్ని నేను సివిల్ లిబర్టీస్ కోసం కొట్లాడటం అంట. ఇవాళ పౌరహక్కుల కోసం జరుగుతున్న ఆందోళనలాంటిదే అది. అయితే ఏ ఉద్యమం జరిగినా అది పౌర హక్కుల కోసమే జరుగుతుందని గమనించాలి. మొదలు, మానవ

హక్కులు ప్రాథమికమైనవి. ఆ తర్వాతే ఏదైనా.

ఇట్లా మానవ హక్కులకోసం పౌర హక్కుల కోసం జరిగిన ఆందోళనల్ల నేను పాల్గొన్న మొదటి స్టూడెంట్స్ యూనియన్ తరుపు నుంచి ఇట్లాంటి ఉద్యమాలు మొదలు పెట్టినం. 1932-36 వరకూ ఇలా ఆందోళనల్లో పాల్గొన్న.

మొదట వర్కింగ్ కమిటీ మెంబరుగా ఆ తర్వాత జాయింట్ సెక్రటరీగా ఆ తర్వాత జనరల్ సెక్రటరీగా కూడా ఆ స్టూడెంట్ యూనియన్లలో పని చేసినం. హైస్కూల్ కాలేజి రోజుల్లోనే ఆందోళనలు నడిపినం. వీటిల్లో అన్నిటికంటే ముందు గణపతి ఉత్సవాల సంగతి చెప్పుకోవాలి. ఆ తర్వాత దసరా ఉత్సవాలు.. గ్రంథాలయ సమావేశాలూ..

స్టేట్ కాంగ్రెస్ కంటె ముందు నుంచి ఇక్కడ ఆర్యసమాజం నిజాం నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తూ వచ్చింది. అందుకే నేను వరంగల్‌లో ఆర్యసమాజంలో కలసి పని చేసిన. యాక్టివ్‌గా.

ఊరేగింపులు తీయటం లాంటివి చేసినం. అప్పుడు నేను స్టేట్ కాంగ్రెస్ సభ్యుడిని కూడా. ఆ రోజులలో ఆంధ్రమహాసభ, కన్నడ పరిషత్తు, మహారాష్ట్ర పరిషత్తు కలిసి స్టేట్ కాంగ్రెస్‌గా ఫామ్ అయినై. అయితే స్టేట్ కాంగ్రెస్‌ని నిజాం రాజ్యం బ్యాన్ చేసింది. ఆంధ్రమహా సభలో అంతకు ముందు పని చేసిన వాడిని కాబట్టి నేను స్టేట్ కాంగ్రెస్ లోపటనె ఉన్నా.

మొదటి నుంచి నా వ్యవహారం ఏంటంటే - ఏ ఉద్యమం నడిస్తే దాంతో కలిసి పని చేయటం. అది ఆర్యసమాజం ఉద్యమమైనా అది గణేశ ఉత్సవ సమితి ఉద్యమమైనా వేరే సామూహిక ఉద్యమమైనా.. వాటితో కలిసి సాగిన. వారూ వీరని లేదు.

వరంగల్లోనే ఆర్యసమాజ మందిరం ఒకటి ఏర్పాటు చేసుకున్నాం. అక్కడ పది పదిహేను మందిమి కూడేవాళ్లం. అప్పుడు శుక్రవారం హాలిడే. ఆ రోజు ఇనుప కుంపటి ఒకటి పెట్టుకుని హవనం చేసేది. నిజానికి నాకు హవనం మంత్రాలు గానీ ఆ పద్ధతి గానీ తెలవదు. కానీ ఒక్కడ్ని కూడా హవనం చేసేటోన్ని. ఆ హుతులిచ్చుకుంట హవనం చేస్తున్నా. ఒకనాడు ఒక సబ్- ఇన్‌స్పెక్టర్ నా దగ్గరికి వచ్చాడు. అప్పుడు నేను హవనం చేస్తున్నా. "నేను రావచ్చా లోపటికి" అని అడిగిండు. "రావచ్చు. చెప్పులిడిచిరా" అని అన్న. వచ్చి కూర్చున్నాడు.

"ఇదేమిడిది! గణేష్ ఉత్సవాలల్ల నువ్వే ఉంటవు. ఆర్యసమాజంల నువ్వే ఉంటవు. దసరా ఉత్సవంల నువ్వే ఉంటవు. అసలు నువ్వేమిటిది?' అని అడిగిండు.

"ఏమిడిదేముంది! పౌరహక్కుల కసం నేను పనిజేస్త" అని చెప్పిన. ఒకసారి పోచమ్మ గుడికాడ పీర్లెత్తుకుని తిరిగేటోళ్లు అపవిత్రం జేసిరంటే అక్కడికి పోయిన. పసుపు, కుంకుమలతో పూజ చేయించిన. నా ధోరణి గురించె చెపుతునాన. పోచమ్మలూ, మైసమ్మలూ ఆర్యసమాజ విశ్వాసాలకి విరుద్ధం. అయినా తరుకలొచ్చి పోచమ్మ గుడికాడ అట్ల జేసింరని తెలిసి అక్కడికి పోయిన. హవనం

**నిజాం రాజ్యంలో నాన్ ముస్లిం అనేవాడు యాంటీముస్లిం. యాంటీ ముస్లిం అన్నవాడు యాంటి స్టేట్. ఇవన్నీ సమానార్థకాలై పెయినై. తెలుగు లైబ్రరీకి వెళ్ళినవాడు కూడా యాంటీ స్టేట్. మా హన్మకొండ లైబ్రరీ చాలా పాతది. 1904లో స్థాపించబడింది. అది తెలంగాణా ప్రాంతంలో నెలకొల్పబడిన రెండవ గ్రంథాలయం. మొదటి గ్రంథాలయం హైదరాబాద్ సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ భాషా నియలం. అది 1901లో స్థాపితం.**

గూడా అంతె! హవనం చేయొద్దన్నది నిజాం రాజ్యం. వద్దన్న దాన్ని చేయటం ద్వారా నిరసన ప్రకటించడం ఒక ధిక్కారం ఒక ఏజిటేషన్‌గా ఇట్లా చేయటం జరిగింది.

అప్పట్లో ఆర్యసమాజం స్టేట్ కాంగ్రెస్ పని చేస్తున్నట్లే ఇత్తెహాదుల్ ముస్లిమన్ అని ఒక సంస్థ నడిచేది. బహద్దూర్ యార్జంగ్ దీనికి నాయకుడు. వాళ్లొక స్కీమ్ తీసింద్రు. అదేమిటంటే అణచివేతకు గురైన షెడ్యూల్డు కులాల వారిని ముస్లిములుగా మార్చటం. ముస్లిం -ముస్లిమేతర జనాభాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించటం దీని ఉద్దేశం. హరిజనులు ముస్లింలైతే హిందువుల సంఖ్య తగ్గటంతో పాటు ముస్లింల సంఖ్య పెరుగుతుంది కదా! అదీ వ్యూహం. దీనికోసం ఒక సీక్రెట్ సర్క్యులర్ కూడా తీసింద్రు. దీనినే పనిగ పెట్టుకున్నారు కూడా. దానికి విరుద్ధంగా ఆర్యసమాజం వైపు నుంచి నేనూ బల్‌దేవ్ పతంగే, పెండ్యాల రాఘవ రావు పనిచేసినం. మేం వెల్లి అలా కన్వర్ట్ అయిన వారిని రీకన్వర్ట్ (శుద్ధి) చేసేటోళ్లం.

అయితే ముస్లిం మతం మారిన ఒక హరిజనుడు దసరా ఉత్సవాలు జరిగే చోటికి గుర్రం ఎక్కి నిజాం జండా చేతుల బట్టుకుని వచ్చిండు. ఊరేగింపులో అక్కడున్నోళ్లు అతడి మీద పడి జండా చించేసిన్రు. ఈ ఘర్షణ మీద పోలీసులు కేసు పెట్టారు. నామీద, మా అన్న గారి (కాళోజీ రామేశ్వరరావు) మీదా మరికొందరి మీదా ఆ కేసు మూడు నాలుగు నెలలు నడిచి కాంప్రమైజ్ అయింది.

నిజాం రాజ్యంలో నాన్ ముస్లిం అనేవాడు యాంటీముస్లిం. యాంటీ ముస్లిం అన్నవాడు యాంటి స్టేట్. ఇవన్నీ సమానార్థకాలై పెయినై. తెలుగు లైబ్రరీకి వెళ్ళినవాడు కూడా యాంటీ స్టేట్. మా హన్మకొండ లైబ్రరీ చాలా పాతది. 1904లో స్థాపించబడింది. అది తెలంగాణా ప్రాంతంలో నెలకొల్పబడిన రెండవ గ్రంథాలయం. మొదటి గ్రంథాలయం హైదరాబాద్ సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ భాషా నియలం. అది 1901లో స్థాపితం.

గ్రంథాలయాల దగ్గర సబలు జరపటం రివాజుగా వుండేది. వార్షికోత్సవాలు చేసుకోవటం జరిగేది. సాంఘిక జాగృతిని కలిగించటానికి ఈ గ్రంథాలయాలు ఎంతో పనిచేసినై. గ్రామాలలో కూడా గ్రంథాలయాల్ని స్థాపించడం జరిగింది ఆరోజుల్లో. అక్కడ కూడా వార్షికోత్సవాలలాంటివి జరిగేవి. ఒక జాగృతి తేవటం కోసం జరిగిన ప్రయత్నం ఇదంతా. ఇలా జాగృతి తేవటం సనాతన వాదులకు ఇష్టంలేదు. అటు నిజాం ప్రభుత్వానికీ ఇష్టంలేదు. ఒక సంఘటన చెపుతా. తొమ్మిదో ఆంధ్ర మహాసభ హనుమకొండ

సమీప గ్రామంలోనే జరిగింది. వేలమంది అక్కడ చాపల మీద కూర్చున్నారు. ఖమ్మంలోని హరిజన బాలికల పాఠశాల నుండి విద్యార్థుల్ని పిలిపించి వారితోనే ఈ సభలోనివారికి నీళ్ళు ఇప్పించినం. దానిమీద చాలా గొడవైంది. సనాతన వాదులు దీన్ని వ్యతిరేకించారు. మా పనిలో ఎన్నిరకాల అడ్డంకులుండేవో చెప్ప టానికే ఇది చెపుతున్నా.

ఇక్కడ ఒక విషయం చెప్పుకుని తీరాలి. తెలంగాణాలో ఇంత ప్రతికూల పరిస్థితులు మధ్యన మేం పోరాడుతూ ఉంటే ఆంధ్ర ప్రాంతం వారు రాను రాను మాట వరకసకైనా మా పోరాటంపై సానుభూతి ప్రకటించలేదు. ఏనాడూ వాళ్ళు మాకు సహాయం చేయలేదు. అసలు నిజాం రాష్ట్రంలో అడుగుపెట్టాలంటేనే వాళ్ళకి భయం. బ్రిటిష్ దొరతనానిన వ్యతిరేకిస్తూ ఉద్యమాలు నడుపుతున్న వాళ్ళు కూడా హైదరాబాద్‌కి రాగానే కిమ్మనకుండా ఉండేవాళ్ళు. సరోజినీ నాయుడు దీనికి మంచి ఉదాహరణ.

సరోజినీ నాయుడు తండ్రి అఘోరనాథ్ బెంగాల్‌నుండి ఇక్కడి కొచ్చి మదరసే అలియాకో మరో స్కూలుకో ప్రిన్సిపాల్‌గా ఉం దేవాడు. ఆమె తమ్ముడు హరీంద్ర ఛటోపాధ్యాయుడు కూడా మంచి కవి. సరోజినీదేవి మేజర్ గోవిందరాజులు నాయుడిని పెండ్లాడింది. ఆమె కాంగ్రెస్ ప్రెసిడెంటుగా గాంధీగారి వెంట తిరిగేది. లెక్చర్లూ ఇచ్చేది. హైదరాబాద్ గనుక వస్తే గోల్డెన్ త్రెషోల్డ్ బిల్డింగులో కూచుని నవాబుగారితో పొయెట్రీ మాట్లాడుతూ కాలక్షేపం చేసిది. కీట్స్ కవిత్వంతోనో, బైరన్ కవిత్వంతోనో పొద్దుపుచ్చేది తప్ప కాంగ్రెస్ మాటలేం ఉండేవి గావు. అవతలికి పోతే మాత్రం పెద్దలీడరు! తెలంగాణా పట్ల పెద్దపెద్ద లీడర్లనుకేవాళ్ళకి ఉండిన అవగాహనిది. నిజాం స్టేట్ నేటివ్ స్టేట్ కాబట్టి ఇక్కడ ఏ ఉద్యమాన్నీ ప్రారంభించ లేదనేవాళ్ళు వాళ్ళు.

ఆంధ్రప్రాంతంవారి సంగతి ఎట్లా ఉండేదో చెప్పటానికి రాయప్రోలు సుబ్బారావుని గురించి చెప్పుకోవాలి. "ఆంధ్రాఫేమ్" రాయప్రోలు పేరుకి జాతీయకవే. బెజవాడ అవతలి సభల్లో తన పద్యాల్ని ధాటిగా చదివెటోడు. ఎర్రుపాలెం దాటి ఇవతలికొస్తే సభలూ లేవు పద్యాలూ లేవు. అసలు తెలంగాణా వాళ్ళతో నిలవడ మే లేదు. తెలంగాణవాళ్ళతో అంటీ ముట్టనట్లు ఉండేటోళ్ళు. ఏళ్ళ కేళ్ళు ఇక్కడ గడిపినా రాయప్రోలు ఏనాడూ ఇక్కడి వాళ్ళ గురించీ, వాళ్ళ పోరాటం గురించీ ఒక్క మంచి మాట అనలేదు. పైగా నవాబులతోటే పెద్ద పెద్ద వాళ్ళతోటే తిరిగేటోడు. ఇదీ వాళ్ళ దోరణి. అందుకే రాయప్రోలుమీద నేను ఒక కవిత రాసి దాన్ని ఆనాడు సభాముఖంగా వినిపించాను.

"లేమావి చివరులను లెస్సగా మేసేవు
రుతురాజు వచ్చెనని అతి సంభ్రమముతోడ
మావి కొమ్మలమీద మైమరచి పాడేవు
తిన్న తిండెవ్వారిదే కోకిలా!
పాడు పాటెవ్వారిదే కోకిలా!
పేరు ఊరూలేని పిచ్చుకవు: దయదలచి

**తెలంగాణాలో ఇంత ప్రతికూల పరిస్థితులు మధ్యన మేం పోరాడుతూ ఉంటే ఆంధ్ర ప్రాంతం వారు రాను రాను మాట వరకసకైనా మా పోరాటంపై సానుభూతి ప్రకటించలేదు. ఏనాడూ వాళ్ళు మాకు సహాయం చేయలేదు. అసలు నిజాం రాష్ట్రంలో అడుగుపెట్టాలంటేనే వాళ్ళకి భయం. బ్రిటిష్ దొరతనానిన వ్యతిరేకిస్తూ ఉద్యమాలు నడుపుతున్నవాళ్ళు కూడా హైదరాబాద్‌కి రాగానే కిమ్మనకుండా ఉండేవాళ్ళు.**

చేరదీసి నిన్ను గారవము చేసినా
మావి గున్నల మాట మాటవరసకునైన
ఎన్నాడైనను తలచితె కోకిలా!
ఎప్పుడైనను పాడితే కోకిలా!"

ఇదీ ఆ కవిత. వీళ్ళ తీరు ఇట్లా ఉన్నా మేం మాత్రం బ్రిటీష్ ఇండియా స్వాతంత్ర్య పోరాటాన్ని సమర్థించినం. మా దృష్టిలో ని జాం బ్రిటీషువాళ్ళ తొత్తు. అందుకే బ్రిటీష్‌వాళ్ళూ పోవాలని కోరు కున్నాం.

నేనూ, వట్టికోట ఆళ్వారు స్వామీ గుంటూరుకు పోయి అనంతశయనం అయ్యంగార్ అధ్యక్షతన ఆనాడూ జరిగిన ఆంధ్ర మహాసభలో పాల్గొన్నాం. అప్పట్లో ఆంధ్రప్రాంతంవారి సభలు తమిళ ఆధిపత్యాన్ని నిరసించేవి. తమిళులకి వ్యతిరేకంగా తీర్మానాలు చేసే వాళ్ళు. ఇవాళ మేం అదే అంటున్నాం. తమిళ ఆధిపత్యాన్ని ఆంధ్ర ప్రాంతం వాళ్ళెట్లా నిరసించారో ఇవాళ మేం కూడా తెలంగాణ మీద ఆంధ్ర ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఒకనాడు నిజాం ఇక్కడ ఐదుశాతం మంది మాట్లాడే ఉర్దూను అధికార భాషచేశాడు. ఇపుడు ఒకటిరెండు కోస్తా జిల్లాల భాషను (ఆ మాటకొస్తే రెండు, మూడు కులాల భాషను) మా మీద రుద్దుతున్నారు. మేం రెండింటినీ వ్యతిరే కిస్తున్నాం.

నా గురించి చెప్పుకోవాలంటే నేను ఎక్కడ అన్యాయం జరి గినా ప్రతిఘటిస్తూ వచిచన. అన్ని ఉద్యమాల్లోపట డైరెక్టుగా పాల్గొన్న. ఎక్కడ అక్రమం జరిగినా దాన్ని ధిక్కరిస్తూ గేయమో, కథో రాసిన. నా గేయాలలో తొభై ఐదు శాతం ఉద్యమాలపై రాసినవే. అవన్నీ గేయరూపంలో వున్న స్టేట్‌మెంట్లే.

అపట్లో నిజాం రాజ్యంలో "అనల్‌మాలిక్" అని ఒక నినాదం బయల్దేరింది. ప్రతి ముస్లిమూ నేనే రాజునని అనుకోవాలని దాని అర్థం. నిజాం రాజ్యం ముస్లిం ఆధిపత్యానికి ప్రతీక అని అనుకు న్నారు. ఆ మాట మళ్ళీ నిజాం ఒప్పుకోడు. అది తన సొంతరాజ్యం అని అతడనుకునేవాడు. అట్లాంటప్పుడు హైదరాబాద్ స్టేట్ తురకల రాజ్యం ఎట్లా అవుతుంది? ఏదో కొద్ది మంది సెలెక్టెడ్ కుటుంబాలకే అన్నీ సమకూరినవిగాని! అయినప్పటికీ ఈ రాజ్యం తరుకల రాజ్యం అని ప్రతి ముస్లిం మెదడులో జొప్పించిందు. ఈ కారణంగా 1945 లో హిందూ ముస్లిం వర్గాల మధ్య ఉద్రిక్తత తలెత్తింది. నిజాం పాలనకి వ్యతిరేకంగా జరిగే ఆందోళనని ముస్లింలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంగా చిత్రీకరించింద్రు. ఆ ఉద్రిక్తతల్లో కొందరు

చనిపోయింద్రు. వరంగల్‌లో అట్లా పట్టుపగలే డాక్టర్ నారాయణ రెడ్డినీ, మొగిలయ్యనీ చంపింద్రు. 1946లో కాంగ్రెస్ పతాకాన్ని ఎగరేసినందుకు వరంగల్ కోటలో మొగిలయ్య బలయ్యిండు. మహ్మద్ ఖాసి అనే రజాకార్ యాభై అరవైమంది గూండాలతో వచ్చి మొగిలయ్యను హత్య జేసిండు. అట్లా చంపినాక ఆ నెత్తురు మరకల తోటే వాళ్ళు ఊరంతా తిరిగింద్రు. అగిడినవాడు లేదు. బల్లెంతో పొడిచి చంపింద్రు.

అప్పుడు నేను ఒక కవిత రాసిన. అది నా పబ్లిక్ స్టేట్‌మెంటు.

"పట్టపగలె పట్టణములో పెట్టి పౌరుల కొట్టి చంపిన దుష్ట కూటమితో ప్రభుత్వం దొంగబేరము చేసినట్టే" అన్నా. అట్లనె..

"రక్ష నాకు ఏర్పడ్డ బలగమే
రక్కసుల పక్షంబు చేరిన రాక్షసుల ఇష్టానుసారం రాజ్యము నడిపించినట్లే...
హత్య దోపిడీ మానభంగాలు
నిత్య కర్మలయినట్టే" అని కూడా అన్న.

కోర్టులో ఇత్తెహయల్ ముస్లిమీన్ లాయర్ల నడుమ కూర్చున్న నేను "పచ్చి నెత్తురు వాసనేస్తున్నది" అన్నా. ఆ తర్వాత నన్ను వరంగల్ జిల్లా నుంచి మూడు నెలలపాటు వెళ్లగొట్టింరు. అక్కడి నుంచి వచ్చి హైదరాబాద్‌లో మకాం పెట్టిన.

అప్పటి ప్రధాని సర్‌మీర్జా ఇస్మాయిల్ వరంగల్‌లోని పరిస్థితులు విచారించటానికి పోతున్నడని తెల్సింది. అప్పుడు నేనొక లేఖ రాసిన.

"వరంగల్‌ల పరిస్తితి ఉద్రిక్తంగా ఉన్నదని నువ్వుపోతున్నవ్. ఆ పరిస్థితికి నేను కారకుడినని జిల్లానుంచి బహిష్కరించినవు. నేను వరంగల్ వాడిని. నేను లేనప్పుడు అక్కడి పరిస్థితులు విచారించె టందుకు పోతన్నవ్. నన్ను నీవెంట తీసుకపో. దానికి నేనెట్ల కారకుడినో నాముందే విచారించు. దానిమీద ఏ శిక్ష వేసినా నేను సిద్ధం. కానీ నన్ను తీసకపోకుండ నువ్వు ఒక్కడివె పోయి విచారణ జేస్తె మాత్రం అది బూటకపు విచారణ అవుతుంది" అని.

కాని ప్రధానమంత్రి నన్ను రమ్మనలేదు. ఒక్కడే పోయివచ్చిండు. అట్లా రాంగానే గేయం రాసి కొన్ని ప్రశ్నలడిగిన.

"ఎన్నాళ్ళనుండియో, ఇదిగొ యనుచు
ఈనాటికైనను ఏగివచ్చితివా?
కోటగోడల మధ్య ఖూనీ జరిగిన చోట
గుండాల గుర్తులు గోచరించినవా?
జెండా యెత్తిన యంత జాంబియాలు దూసిన
శిక్ష తప్పదంచు చెప్పవచ్చితివా?
బజార్లొ బాలకుని బల్లెంబుతో పొడుచు
బద్మాషునేమైన పసిగట్టినావ?
సూబాధికారులు జో హుకుం అనువారు
చుట్టూ చేరి అంత చూపెట్టినరా?
కాలానుగుణ్యమౌ కాళోజీ ప్రశ్నలకు
కళ్ళెర్రజేసి ఖామోషీ అంటవా?
ఖామోష్ వుంటవా?"




ఈ కవిత 'గోల్కొండ' పత్రికలో అచ్చయ్యింది.

"బాధ్యతలేని ప్రభుత్వ భటులు
పెట్టిన బాధలు చాలింక
బాధ్యతగల పరిపాలన లేక
బతికిన బతుకులు చాలింక
పల్లెపల్లెలో పాలన పేరిట
జరిగే పాపం చాలిక
రాజుపేరిట అరాజకమునకు
జరిగిన పూజలు చాలింక
పేదల సర్వస్వముతో
ధనికులు చేసిన బేరము చాలింక
లంచము దొరికిన యంతనే
న్యాయము తలను వంచడం చాలింక"

అని ఆ రోజుల్లోనే గేయం రాసిన. ఇది ఇప్పటి పరిస్థితికి కూడా వర్తిస్తది.

ఆకునూరు, మాచిరెడ్డి పల్లెల్ల జరిగిన రజాకారీ దురంతాలూ పోలీసుల అరాచకాలమీద కూడా గేయాలు రాసిన.

జైలు జీవితం గురించి..

నేను మొత్తం మూడు మార్లు జైలుకు పోయిన.

1938లో నాలుగంటె నాలుగు రోజులపాటు శిక్ష అనుభవిస్తే 1943లో రెండేండ్ల ఆరునెలల శిక్ష పడింది. అయితే నా అనారోగ్యం కారణంగా నన్ను ఐదు నెలల తర్వాత విడిచిపెట్టింద్రు.

చివరగా 1947 సెప్టెంబర్ 3 నుంచి 1948 సెప్టెంబర్ 26 వరకూ జైలు జీవితం గడిపిన.

1943 జనవరి 3 నాడు 'క్విట్ ఇండియా' ఉద్యమంల భాగంగా వరంగల్ చౌరస్తాలో సత్యాగ్రహం చేసినం. హయగ్రీవాచారి ఎక్కడ్నుంచో కాని ఒక సైక్లోస్టైల్ మిషన్ తెచ్చిండు. దాంతో తెలుగుల ఒకటీ, ఉర్దూల ఒకటీ ప్రకటనలు తయారుచేసినం. చౌరస్తల ఆ ప్రకటనలన్నీ పంచినం. దీనికి పోలీసులు మమ్మల్ని అరెస్ట్ చేసి జైలుకు తీసుకుపోయారు. అక్కడే కోర్టుపెట్టి శిక్ష వేసింద్రు.

1947 సెప్టెంబర్‌ల శిక్ష పడ్డప్పుడు జైలులో ఎక్కువ కాలం వున్న. మా అన్ననే నా బాగోగులన్నీ చూసెటోడు. ఆయన నన్ను ముసలితనంల కూడ పిల్లగాని లెక్క సాదిండు. ఆయన ఉన్నాడు కాబట్టే నేను ఇదంతా చేయగలిగిన.

నా గర్వభంగానికి సంబంధించిన సంఘటన చెప్పుకుని తీ రాలి.

నాకు కాంగ్రెస్‌తో సంబంధం ఉన్నదన్న 'అనుమానం'మీద పోలీసులు (1948లో) మా ఇంటిని (అది రామేశ్వరరావుగారి ఇల్లు) సోదా చేసింరు. రాత్రి 10.30 గంటలకి వచ్చి అర్ధరాత్రి 2 గంటల దాకా సోదా సాగింది. వారికి ఏమీ దొరకకున్నా నన్ను అరెస్టు చేసింరు.

అక్కడికెల్లి హన్మకొండ వీధుల్లోంచి నన్ను పోలీస్ స్టేషన్‌కి తీసుకుపోయింల్రు. పోలీస్ స్టేషన్ల నన్నూ నాతో పాటు అరెస్టు చేసిన ఆంజనేయులునూ లాకప్‌లో పెట్టింల్రు. అయితే అంతకుముందు నుంచీ ఆ లాకప్‌లో ఒక దొమ్మరాయన ఉన్నాడు. అట్లా ఒక హాబిచ్యువల్ క్రిమినల్‌తో నన్నూ ఉంచినందుకు అవమానంగ తోచింది నాకు. ఆ దొమ్మరాయన చెవిలో సగం కాలిన ఆకు చుట్టతీసి కొరికి అక్కడే ఉమ్మివేసి "అగ్గిపుల్ల ఉన్నదా" అని అడిగిండు. నేను చీదరించుకున్న. అయితే దర్వాజ దగ్గరుండే సెంట్రీ చుట్ట అంటించిండు. అక్కడికెల్లి ఆ దొమ్మరాయన నేనే బేరం చేసిననో ఆరాతీసుడు మొదలుపెట్టిండు. రాజకీయాల గురించి వాడికి ఏం చెప్పినా ఏం తెలుస్తదన్న చిన్న చూపుతో ఏం సమాధానం చెప్పకుండ ఊరుకున్న.

"చోరీ చేస్తివా? ఎవడి తలన్న పగలగొడితివా? ఎవడినన్న సంపినవా, ఎవని పెళ్ళాన్నన్న ఎత్కచ్చునవా?" ఇట్లా సాగినయి వాడి ప్రశ్నలు. అన్నిటికీ "కాదు కాదు" అనుఖుంట జవాబిచ్చిన.

చివరికి అతడు ఒక ప్రశ్న అడిగిండు. "గాంధీ మహరాజ్‌కీ, హుజూర్ నైజాంకీ లడాయ్ జరుగుతున్నదంట, దాంట్లగిన రాలేకద నువ్వు!" అన్నాడు. ఈ ప్రశ్నతో నేను నిశ్చేష్టుడ్నే అయిన. "వీడికి ఏం తెలుస్తుందిలే" అని నేననుకుంటే గాంధీగారి ఉద్యమం అతడి దాకా చేరిందని నాకర్థమయింది. నేను అహంకరించి జనానికి దూరమైపోయిన గాని గాంధీ మాస్‌కాంటాక్ట్ సాధించిండని తెలిసొచ్చింది. అట్లా నాకు గర్వభంగం జరిగింది. (ఈ సంగతి చెబుతూ కాళోజీ ఒక్కసారిగా కదలిపోయి కన్నీరు కార్చారు).

ఏమైతేం. కాశీంరజ్వీ అరెస్టయినంకనే నేను జైలు నుంచి విడుదల అయన. మిలెట్రీ యాక్షన్‌తో హైదరాబాద్ రాష్ట్రం విముక్తమయింది. అట్లా మేం 1949 ఆగస్ట్ 15నే తొలి స్వాతంత్ర్యదినంగా చూసినం. అయితే పీడన, పేదరికం, లంచగొండితనం పోలే. అందుకని..

"స్వాతంత్ర్యదినోత్సవం
శ్రద్ధలేని తద్దినమని
దేశోద్ధారణం అంతయు
వేషాలని మోసాలని ఎవరనుకున్నారు..!



సత్తారాగానే కన్నులు నెత్తికెక్కి పోతాయని
త్యాగులు సమితం ఘడియలో
భోగులైపోతారని ఎవరనుకున్నారు..!
కంట్రోలు అనగానె సరుకులు
కనబడకుండ పోతాయని
నిండిన గోదాముల ముందట
తిండిలేక చస్తామని
ఎవరనుకున్నారు..!" అని రాసిన.

ఇప్పటిదాకా అధికారం వెలగబెట్టిన అన్ని ప్రభుత్వాలమీద నా నిరసన ఇది.

స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాళ్ళూ అధికారానికి దూరంగా కళ్ళు మూసుకు వుండిపోయిన స్వాతంత్ర్య సమరయోధులూ ఈ దుర్భర పరిస్థితికి కారకులు.

ఇప్పటికైనా అధికార రాజకీయాలకు దూరంగా ఉండి పోయిన వాళ్ళు నడుంబిగించాలె. లేనిదే ఆడంబరాలతో స్వర్ణోత్సవాలు జరుపుకోవటం బూటకం అయితది.

అన్యాయాన్ని ఎదిరిస్తే
నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నా గొడవకు ముక్తి ప్రాప్తి.

**ఇంటర్వ్యూ: వై.శ్రీనివాసరావు**

**(సెప్టెంబర్ 9న కాళోజీ జయంతి సందర్భంగా...**
**ఆంధ్రప్రభ స్వాతంత్ర్య స్వర్ణోత్సవ విశేష సంచిక స్వర్ణప్రభ సౌజన్యంతో)**

ద

# 'తెలంగాణ తల్లి రూపకర్త'

## తోపారపు గంగాధర్



నిజాంకాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగిన సభలో గంగాధర్‌ను సన్మానిస్తున్న టీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు. చిత్రంలో బి.ఎస్.రాములు తదితరులు

**జీ**వితసాఫల్యపురస్కారం సాధిస్తే ఇక జీవితంలో అంతకు మించింది మరొకటి ఉండదు. తెలంగాణ సమాజంలో అలాంటి ఘనతను సాధిస్తే, తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతే అంతకు మించిన విజయం మరొకటి ఉండదు. అలాంటి ఘనతను సాధించిన కళాకారుడు తోపారపు గంగాధర్. చిత్రకళ, శిల్పం తదితరాల్లో తనదైన ప్రతిభను చాటుకున్న గంగాధర్ 'తెలంగాణ తల్లి రూపకర్త'గా కేసీఆర్ నుంచి సన్మానం పొందారు. 2007లో నిజాం కాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ సత్కారాన్ని పొందారు. తెలంగాణ తల్లిని ఆయన చిత్రించిన తీరు అందరినీ ఆకట్టుకుంది.

గంగాధర్ అద్భుత ప్రతిభాపాటవాలకు 'మెచ్చు'తునకలు ఎన్నో. హైదరాబాద్‌లో నెక్లెస్ రోడ్ వద్ద ఐమాక్స్ చౌరస్తా వద్ద 2009లో నెలకొల్పిన ఇందిరాగాంధీ విగ్రహం ఆయన రూపొందించిందే. జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో 2002లో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహం రూపకర్త కూడా ఆయనే. అదే విధంగా 1996లో ఎన్టీఆర్ గార్డెన్స్‌లో నెలకొల్పిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన రూపొందించారు. హైదరాబాద్, కాకినాడ, అనంతపూర్‌లలోని జేఎన్‌టీయూ కేంద్రాల్లో 2007లో నెలకొల్పిన జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాల రూపకర్త కూడా ఆయనే. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మరెన్నో విగ్రహాలు కూడా గంగాధర్ రూపొందించినవే.

గంగాధర్ వేసిన చిత్రాలెన్నో వివిధ ప్రచురణల్లో,





పాఠ్యపుస్తకాల్లో, పిల్లల పత్రికల్లో ముద్రితమయ్యాయి. బాలచెలిమి, చెకుముకి, అక్షరదీక్ష లాంటివి వీటిలో ఉన్నాయి. గంగాధర్ ప్రస్తుతం హైదరాబాద్ లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో అప్లయ్‌డ్ ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

గంగాధర్ పుట్టింది నిజామాబాద్ జిల్లాలో అయినా చిన్నప్పటి నుంచి పెరిగింది మాత్రం హైదరాబాద్‌లోనే. నాలుగో తరగతి నుంచి ఏడో తరగతి వరకు వి.వి. అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో, ఎనిమది నుంచి పదో తరగతి వరకు వి.వి. బాయ్స్ హైస్కూల్‌లో చదివారు. జేఎన్‌టీయు ఫైన్‌ఆర్ట్స్ కాలేజీలో అప్లయ్‌డ్ ఆర్ట్‌లో ఐదేళ్ళ డిప్లొమా కోర్సు చేశారు. ఆ తరువాత అక్కడే పీజీ చేశారు.





**వ్యక్తిగతం:**

**పూర్తి పేరు:** తోపారపు గంగాధర్
**తల్లిదండ్రులు:** బాబయ్య, లక్ష్మీబాయి
**పుట్టిన తేదీ:** 30.4.1965
**పుట్టిన ఊరు:** నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం
**చదువు:** మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (అప్లయిడ్ ఆర్ట్) జేఎన్‌టీయు **-శ్రీనాథ్**









## తెలుగుకు ప్రాచీన హోదా దక్కడంలో మూలస్తంభంగా నిలిచిన

# బొమ్మలమ్మగుట్ట శాసనం!

**తెలంగాణా సాంస్కృతిక ఘనతను ఇనుమడించిన తెలుగుశాసనం!**

**మద్రాస్ హైకోర్టులో ఆధారంగా నిలిచిన కరీంనగర్ జిల్లా తెలంగాణ చారిత్రక శాసనాలు, స్థూపాలు, నాణాలు**

తెలంగాణా భాషా, సాంస్కృతిక, రాజకీయ చరిత్రలో తొలి నాళ్ళ నుండే కరీంనగర్ జిల్లా ప్రముఖ స్థానం వహిస్తోంది. దేశ ప్రధానిగా అత్యున్నత పదవిలో పనిచేసిన పి.వి.నర్సింహారావు ఈ జిల్లావాడే. ఆయన గొప్ప రచయితగా ప్రసిద్ధి చెందాడు. అలాగే జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.సినారే, డా.జె.బాపురెడ్డి, నృత్య కళాకారుడు కళాకృష్ణ వంటి వారు ఈ జిల్లా సాహిత్య, సాంస్కృతిక చరిత్రకు జీవం పోసినవారే. తెలుగు భాషకు ప్రాచీన భాషా హోదా రావడానికి, మద్రాస్ హైకోర్టులో వేసిన వాజ్యంలో కరీంనగర్ జిల్లా కురిక్యాలకు చెందిన క్రీ.శ.945 వే ములవాడ చాళుక్యుల కాలం నాటి బొమ్మలమ్మగుట్ట శాసనంతోపాటు, కోటిలింగాల తొలిశాతవాహనుల కాలపు నాణాలు, శాసనాలు, ధూళికట్ట బౌద్ధ స్థూపం, ఇక్కడి పలకల్లో లభించిన ఆధారాలు ముఖ్యభూమికను పోషించాయి.



డా.వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 2008 అక్టోబర్ 31న తెలుగు, కన్నడ భాషలకు ప్రాచీన హోదాను కట్టబెడుతూ తొలిసారిగా అప్పటి యుపిఏ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు 2004లో జరిగిన లోక్‌సభ ఎన్నికల అనంతరం యుపిఏ కేంద్ర ప్రభుత్వం తమిళం, తదుపరి సంస్కృతానికి ప్రాచీన హోదాను మొట్టమొదటిసారిగా ప్రకటించింది. తమిళులు తమ భాషా సాంస్కృతిక వారసత్వం నిలుపుకోవడానికి అక్కడి రాజకీయ నాయకుల చొరవ, ఆసక్తి చెప్పనలవి కాదు. తమిళ వాఙ్మయం, భాషా సంస్కృతులు అక్కడి రాజకీయ నాయకులతో ముడిపడి వుంటాయి. అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం లోని కేంద్రం తన మిత్రపక్షమైన డిఎంకే కరుణానిధి డిమాండ్‌కు తలవొగ్గక తప్పలేదు. కొంతకాలానికి మలయాళానికి, ఒరియాభాషలకు కూడా కేంద్రం ప్రాచీన హోదాను కట్టబెట్టింది. ప్రస్తుతానికి జాతీయభాషల్లోని 22లో ఆరు భాషలకి కేంద్రం ప్రాచీన హోదాను కట్టబెట్టింది. ఇదే అదునుగా తీసుకున్న తమిళులు తమ భాషా విద్వేషాన్ని వెల్లగక్కుతూ, తమిళమే ప్రాచీన భాష హోదా కలిగి వుందని అంటూ, తెలుగుతో సహా ఇతర భాషలకు ఈ హోదా దక్కే అవకాశాలు లేవని ఛాలెంజ్ చేశారు. 2009లో మద్రాస్ హైకోర్టులో తెలుగుకి ప్రాచీన హోదాను కట్టబెట్టిన కేంద్రం నిర్ణయాన్ని సవాల్ చేస్తు, ఒక రిట్ పిటిషన్‌ను ఆర్.గాంధీ అనే తమిళ న్యాయవాది దాఖలు చేశారు. దాదాపు 8 ఏళ్లుగా నడిచిన ఈ కేసును 2016, ఆగస్టు 8న కొట్టివేయడంతో ఫుల్‌స్టాప్ పడింది.

ఈ కేసు నడుస్తున్న కాలంలోనే తెలుగుసీమ తెలంగాణ ప్రత్యేక ఉద్యమం వల్ల రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ అధికారికంగా విడిపోయింది. 2014 జూన్ 2వ తేదీన, తెలంగాణా 29వ రాష్ట్రంగా అవతరించింది. మద్రాస్ వాజ్యంలో తెలంగాణా ప్రభుత్వం ఏడాది క్రితం తమ వంతుగా అఫిడవిట్ దాఖలు చేసి ఈ వాజ్యంలో వాదించడానికి ముందుకు వచ్చింది. తెలంగాణా ప్రాంతంలో సుమారు వెయ్యేళ్ళకు పూర్వం సాహిత్యం వర్ధిల్లిందని, ఇక్కడి శాసనాలు, పలు గ్రంథ రచనలు తెలుపుతున్నాయని తెలంగాణా ప్రభుత్వం వాదించింది. తాము సేకరించిన పలు ఆధారాల్ని హైకోర్టు ముందు వుంచింది. తెలంగాణా ప్రభుత్వం తరపునుండి ఏడాది క్రితం భాషా సాంస్కృతిక, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శిగా వున్న బిపి.ఆచార్య, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, చీఫ్ సెక్రటరీ రాజీవ్‌శర్మలు ఆసక్తిని కనబరచి, సంబంధిత ఆధారాలకోసం ప్రయత్నించి సఫలమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం తరపు నుండి పర్యాటక, భాషా, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, మద్రాస్ వెళ్ళి తగిన సమాచారాన్ని తెలంగాణా న్యాయవాదులకు అందజేశారు. తెలంగాణాలో తెలుగు ప్రాచీన చరిత్ర మూలాలు, ప్రాచీన కవుల సాహిత్యం తగినంతగా వుందంటూ జులై నెలలో మరో అఫిడవిట్‌ను దాఖలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ కేసును సరిగా పట్టించుకోకపోవడం, ప్రస్తుత ఎపి సర్కార్ చేసిన వాదనలు నిలువకపోవడం వల్ల తెలుగుకు ప్రాచీన హోదా దక్కే విషయంలో తెలంగాణ ప్రభుత్వమే ముఖ్యభూమికను పోషించి, విజయం సాధించింది.

10వ శతాబ్దం నాటి తెలుగు ఆదికవి నన్నయ్య రాసిన మహాభారతాన్ని అనువాద గ్రంథమని తమిళనాడు పిటిషనర్ వాదించారు. దీనివల్ల ఆంధ్రాకు ప్రాచీన భాషా హోదా విషయమై చేసిన వాదనలకు పసలేకుండా పోయింది. ప్రాచీన భాషా హోదాకు వెయ్యేళ్ళ సాహిత్య చరిత్ర వుండాలి, అరువుభాష (కొనితెచ్చుకున్న భాష) కాకుండా వుండాలి. 1500 సంవత్సరాల భాషా చరిత్ర కలిగి ఉండాలి. ఈ రెండు అంశాలకు ఆధారంగా ఆంధ్రప్రదేశ్ నుండి తగిన స్పందన రాకపోవడం, చివరకు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో, తెలంగాణా ప్రభుత్వం నెరపిన వాదనలు తెలుగుకు ప్రాచీన భాషా హోదా రావడానికి సరైన ఆధారాలుగా నిలిచాయి. వేములవాడ చాళుక్యుల కాలంలో రెండవ అరిసకేసరి క్రీ.శ. 945లో కన్నడ ఆదికవైన పంపకవి సోదరుడైన జైనమతాదార్యుడు, కవి జినవల్లభుడు వేయించిన కురిక్యాల శాసనంలోని మూడు తెలుగు కందపద్యాలు, పాల్కురికి సోమన రచనలు, ఇతర ప్రాచీన కవుల రచనలు, క్రీ.శ. మొదటి శతాబ్దంలో శాతవాహనుల కాలం నాటి కోటిలింగాల, ధూళికట్ట బౌద్ధస్థూపం ప్రాంతంలో



బొమ్మలమ్మగుట్ట శాసనం, గుట్ట పరిరక్షణకు హైదరాబాద్ నుండి విచ్చేసిన చరిత్రకారులు, సాహితీవేత్తలు

దొరికిన ప్రాచీన తెలుగు నాణేలను, శాసనాలను, ఇతర ఆధారాలను తెలంగాణా ప్రభుత్వం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తుల ముందు వుంచింది. తన వాదనలను పక్కాగా సాగించి, న్యాయమూర్తులను సంతృప్తి పరచింది.

10వశతాబ్దం రాజ మహేంద్రవర నివాసి నన్న య కంటే వందేళ్ళకు ముందే కరీంనగర్ జిల్లాలోని కుడిక్యాల బొమ్మలమ్మగుట్ట శాసనంలో తెలుగు కంద పద్యాలు వున్నాయని రూఢిగా చూపించింది. (వేయ్యేళ్ళ కరీంనగర్ జిల్లా సాహిత్యంపై కరీంనగర్ సాహితీవేత్త డా.మలయశ్రీ ఇరవై ఏళ్ళ కిందటే ఉస్మానియాలో పిహెచ్‌డి చేసి, తన థీసిస్‌ను గ్రంథరూపంలో వేశాడు. అందులో కురిక్యాల శాసనం గూర్చి గొప్పగా రాశాడు) ఇందుకు సంబంధించిన ఆధార ప్రతులను అందజేసింది. తెలంగాణా తెలుగు ప్రాచీన భాషా, సాంస్కృతిక వికాసాలకు నిలయమని తెలంగాణా ప్రభుత్వపు వాదనలకు మద్రాస్ హైకోర్టు ధర్మాసనం లోని న్యాయమూర్తులు ఇరువురు సంతృప్తి వ్యక్తం చేస్తు, తమిళ పిటిషనర్, సీ నియర్ న్యాయవాది ఆర్.గాంధీ 2009లో వేసిన పిటిషన్‌ను కొట్టి వేసింది. ఈ కేసులో తీర్పు ఇచ్చింది హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్కేకౌర్, న్యాయమూర్తి ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం. ఈ కేసు సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ప్రాచీన భాషా సాంస్కృతిక వికాసానికి స్ఫూర్తినిచ్చేలా ఉన్నాయి. ఇకముందు ఇలాంటి వివాదపు వ్యాజ్యాలకు తావులేకుండా న్యాయమూర్తుల వ్యాఖ్యలు వున్నాయని న్యాయనిపుణులు, భాషావేత్తలు భావిస్తున్నారు. తెలుగు ప్రాచీన భాషాహోదాపై తాము జోక్యం చేసుకోలేమని, ప్రాచీన హోదా నిబంధనలకు తెలుగుతోపాటు, ఇతర భాషలు తగిన అర్హత కలిగి ఉన్నాయని నిపుణుల కమిటీ సంతృప్తి వ్యక్తం చేసిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రాచీన భాషా హోదాపై సవాల్ చేస్తు పిటిషనర్ గాంధీ వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తు, నాలుగు భాషలకు హోదా కల్పించే కేంద్రం విషయంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ భాషలు ప్రాచీన భాషల అర్హతలకు నిబంధనలకు లోబడి వున్నాయని తాము భావిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. ఆ నిర్ధారణలు, వాస్తవాలను నిపుణుల కమిటీ తమ ముందు ఉంచిందని అంది. వాటి పరిశీలన చేబట్టాలని తాము అనుకోవడం లేదని పేర్కొంది. ప్రాచీన హోదా కల్పించిన ఇతర భాషలతో సమానంగా చూడటం వల్ల ప్రాచీన హోదా దక్కించుకున్న తమిళానికి ప్రాముఖ్యం తగ్గుతుందని పిటిషనర్ చేసిన వాదనను ధర్మాసనం తిరస్కరించింది. ఒక భాషా ప్రాముఖ్యం ఇతర భాషల ఉత్థాన పతనాలపై ఆధారపడి వుంటుందని భావించడం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. నిజానికి భాషాభివృద్ధి ఆ భాష ఉపయోగం, కళా, సాహిత్య రూపాల ద్వారా జరిగే సృజనాత్మక కృషిపై ఆధారపడి ఉంటుందని వ్యాఖ్యానించింది. ఇలాంటి వ్యహారాల్లో వాదోప వాదాలకు న్యాయస్థానాల్ని వేదికగా తీసుకోవాలని కోరుకోవడం లేదు అని ధర్మాసనం అంది. పిటిషనర్‌కు ఈ కేసు విషయంలో ఇంకా సంతృప్తి కలగకపోతే సంబంధిత అధికారులను సంప్రదించవచ్చునని సూచించింది. తెలంగాణా ప్రభుత్వ వాదనల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన కురిక్యాల గుట్టపైన బొమ్మలమ్మగుట్ట (కురిక్యాల) శాసనంతోపాటు, తొలి కోటిలింగాల శాతవాహనుల నాణాలు ఆధారాలుగా నిలిచాయి. కరీం నగర్ జిల్లాలోని తొలి రాజధాని కోటిలింగాలలో శాతవాహనుల

కాలంలోనే క్రీ.శ.1వ శతాబ్దంలో, గుణాఢ్యుడి బృహత్కథ, హాల చక్రవర్తి గాథాసప్తశతి వంటి కావ్యాలు రాయబడ్డాయి. ఇవి పైశాచీ, ప్రాకృతం వంటి ఆనాటి ప్రజల వాడుక భాషల్లో రాయబడ్డా, అనేక తెలుగు పదాలు ఇందులో వున్నట్లు మన సుప్రసిద్ధ భాషాపరిశోధక వేత్తలైన డా. తిరుమల రామచంద్రతో సహా, పలువురు ఆధారాలతో నిరూపించా రు. భాషావేత్తలైన డా.భద్రిరాజు కృష్ణమూర్తి, డా.పుచ్చా పరబ్రహ్మ వాసుదేవశాస్త్రి, బూదరాజు రాధాకృష్ణ, వేలూటూరి వేంకటరమణ య్య, డా.వి.వి.కృష్ణశాస్త్రి, బిఎస్,శాస్త్రి వంటి భాషా, చారిత్రకవేత్తలు తెలుగు భాషాపూర్వాపరాలపై అనేక పరిశోధనలు చేసి, పలు వ్యాసాలు రాసియున్నారు. అంటే సుమారు రెండువేల ఏళ్ళ భాషా చరిత్ర తెలంగాణా తెలుగుకి సొంతమైపోయిందన్న మాట. త్రిలింగదేశాల్లో ఒకటిగా పిలువబడే గోదావరి తీరస్థ సంగమ క్షేత్రం కాళేశ్వరం కరీంనగర్ జిల్లాకు చెందినదే కావడం గమనార్హం. ఇలా చెప్పుకుంటూ పోతే కరీంనగర్ జిల్లా ప్రాచీన సాహిత్య, సాంస్కృతిక చరిత్రలకు ఆలవాలంగా నిలిచిందని తేటతెల్లమైంది.

**గ్రానైట్ మాఫియా కోరల్లో నుండి రక్షించబడ్డ కుడిక్యాల శాసనం!**

కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలం కురిక్యాల బొమ్మ లమ్మ గుట్ట తొలి కందపద్యాల శాసనం 2011లో గ్రానైట్ మాఫియా కోరల్లో చిక్కి భాషావేత్తల పోరాటంతో ఆఖరుకు రక్షించడింది. ప్రాచీన భాషా హోదాను తెలుగుకు కట్టబెట్టడంలో, మద్రాస్ హై కోర్టుకు సమర్పించిన ఆధారాల్లో ముఖ్య ఆధారంగా నిలిచిన ఈ శాసనం వున్న గుట్టను గ్రానైట్ మాఫియావారు విధ్వంసం చేసే సమయంలో హైదరాబాద్ నుండి వచ్చిన భాషావేత్తలు, చరిత్ర పరిశోధకుల సహకారంతో స్థానికులు పోరాటం చేశారు.

ఈ వ్యాసకర్తతో పాటుగా హైదరాబాద్ నుండి ఆచార్య జ యధీర్ తిరుమలరావు, ఆర్కియాలజిస్టు ఎం.ఎస్.రామచంద్ర మూ ర్తి, డా.దెమె రాజిరెడ్డి, కె.జితేంద్రబాబు, డా.సామల రమేష్ బాబు, ప్రొపెసర్ హైమావతి, ఆచార్య సూరేపల్లి సుజాత, గ్రామస్థులు విచ్చేసి ధర్నా చేయడంతో ఈ గుట్ట విధ్వంసం ఆఖరు క్షణాల్లో ఆగిపోయింది.

అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రోశయ్యకు కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి యడ్యూరప్ప ఈ గుట్టను విధ్వంసం నుండి కాపాడాలని కోరుతూ ఒక లేఖను రాశారు. ప్రస్తుతం ఈ గుట్టకు సుమారు రూ.8 లక్షలతో మెట్ల మార్గాన్ని నిర్మించారు. ర్యాంపు వంటి మరికొన్ని పనులను చేయడానికి నిధుల్ని మంజూరు చేయాల్సి వుంది. ఈ గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎతైనా వుంది.

**హైకోర్టు తీర్పుపట్ల టి.సాహితీవేత్తల హర్షం**

**డా.సినారే:** మద్రాస్ హైకోర్టు తీర్పు హర్షణీయం. తెలుగుకు ప్రాచీన భాషా హోదా రావడానికి తెలంగాణా సారస్వత పరిషత్ ముదుంనుండే కృషి చేస్తున్నది.

**ప్రొ.ఎస్వీ. సత్యనారాయణ:** తెలంగాణా బలమైన వానదల వల్లె తెలుగుకు ప్రాచీన హోదా దక్కడం ఆనందంగా వుంది. ప్రాచీన హోదా కోసం తెలంగాణా ప్రభుత్వం చేసిన కృషి అనిర్వ చనీయం.



**బొమ్మలమ్మగుట్ట వద్ద డా॥ మలయశ్రీ, వేదకుమార్, ఆర్కియాలజీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ మల్లికార్జున రావు, సంకేపల్లి నాగేంద్రశర్మ**

**మామిడి హరికృష్ణ:** తెలంగాణా చరిత్ర, సాహిత్యం అండగా నిలిచి, మద్రాస్ హైకోర్టులో తీర్పు రావడానికి ఉపకరించాయి. ఇది తెలంగాణా బిడ్డలు గర్వపడాల్సిన సమయం.

**దేశపతి శ్రీనివాస్:** తెలంగాణాలోని ప్రాచీన సాహిత్య మూలా లు, తెలుగుకు ప్రాచీన హోదా రావడానికి మూలకారణమయ్యా యని మద్రాస్ తీర్పు నిరూపించింది. తెలుగు భాషాభివృద్ధికి కృషి జరగాల్సి వుంది.

తెలుగు ప్రాచీన భాషా హోదా రావడానికి ఎబికె.ప్రసాద్, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, డా.సామల రమేశ్‌బాబు, మండలి బుద్ధప్రసాద్, డా. కాలువ మల్లయ్య వంటి ఉద్దండుల కృషి మరవ రానిది.

**-సంకేపల్లి నాగేంద్రశర్మ,**
సీనియర్‌చరిత్రకారులు,
కరీంనగర్,
సెల్: 9441797650

ద




## ఉద్యోగుల రక్షణ చట్టం తేవాలి

విద్యుత్తు ఉద్యోగులపై దాడులను జరగకుండా 'విద్యుత్తు ఉద్యోగుల రక్షణ చట్టం' తేవాలని టీఈఈఏ ఛైర్మన్ శివాజీ డిమాండ్ చేశారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఈఈఏ) ఆధ్వర్యంలో తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. రాత్రనక పగలనకా విధులు నిర్వర్తిస్తున్న విద్యుత్తు ఇంజినీర్లపై ఇటీవల దాడులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

## గుజరాత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన

గుజరాత్ రాష్ట్రంలో దళితుల హత్యాకాండను నిరసిస్తూ తెలంగాణ ఆది ధరమ్ సమాజ్, వాల్మీకీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ ఆది ధరమ్ సమాజ్ అధ్యక్షులు రాజుసింగ్, పలు వాల్మీకీ సంఘాల నేతలు సమయ్‌సింగ్, వీరమ్‌జీ రామ్‌రథ్, భూపాల్ వాల్మీకన్, రాజువీర్ తదితరులు మాట్లాడుతూ.. గుజరాత్‌లో దళితులపై మతోన్మాదుల దురాగతాలు పెచ్చు మీరు తున్నాయని, వీటికి వెంటనే అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.

## డీఎస్సీ 2008 అర్హులకు న్యాయం చేయండి

డీఎస్సీ 2008 పరీక్షలో అర్హత సాధించిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలువురు అర్హులు కోరారు. ఇందిరా పార్కు వద్ద డీఎస్సీ 2008 అర్హత సాధించి ఉద్యోగం లేక బాధ పడుతూ ఇటీవల మృతిచెందిన ఎలిగేటి గంగాధర్ సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్సీ 2008 అర్హులైన మిత్ర బృందం ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎన్‌రెడ్డి, మాధవరెడ్డిలు మాట్లాడుతూ అర్హత పొందినప్పటికీ నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన తప్పిదంతో ఉద్యోగాలు పొందలేకపోయామని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సమస్య పూర్తిగా తెలిసినందున తగిన న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

## ఫిజికల్ టెస్ట్‌కు మరో అవకాశం ఇవ్వాలి

అనారోగ్య కారణాలతో ఫిజికల్‌టెస్ట్ ఈవెంట్ మొదటి దఫాలో పాల్గొనని పోలీసు ఉద్యోగ అభ్యర్థులకు ప్రత్యేకంగా రెండో దఫా అవకాశం ఇవ్వాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సుందరయ్య కళానిలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 24 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించారన్నారు.అర్హత సాధించిన వారికి జులై 15 నుంచి ఆగస్టు 6 వరకు ఫిజికల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తేదీలను సైతం ప్రకటించారని గుర్తు చేశారు. ఈ ఫిజికల్ టెస్టుకు మొదట హాజరుకాలేక పోయిన అభ్యర్థులకు మరో అవకాశం ఇవ్వాలని డిమాండు చేశారు. ఆయా జిల్లాల్లో ఇదే ఈవెంట్స్‌కు రెండు మార్లు అవకాశం కల్పిస్తున్నారని అదే హైదరాబాద్ జిల్లాలో ఒకసారి ముగించడం సరి కాదన్నారు.

## ఆదివాసీలపై నిర్బంధం ఆపాలి

ఆదివాసీల పంటల విధ్వంసాన్ని, అక్రమ నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి హైదరాబాద్-రంగారెడ్డి జిల్లా కమిటీలు నారాయణగూడ ఫ్లైఓవర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశాయి. నగర కమిటీ కార్యదర్శి జి.ఝాన్సీ మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధికి తిలోదకాలివ్వడమే కాకుండా జీవించే హక్కులనూ ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. ఆదివాసీ హక్కుల పోరాటాల ఫలితంగా సాధించుకున్న 1/70 చట్టం, 2006 ఆదివాసీల అటవీ హక్కుల చట్టం అమలు జరగడం లేదన్నారు. అటవీ ప్రాంతంలో లక్షల ఎకరాలను ధ్వంసం చేస్తూ.. బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం అధ్యక్షురాలు అరుణ, ఎస్.ఎల్.పద్మ, వి.ప్రవీణ్, కిరణ్, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ఏలకు కనీస వేతన స్కేల్ ఇవ్వాలి

ప్రభుత్వంతో ఘర్షణ పద్ధతిలో కాకుండా సమస్య పరిష్కారమయ్యేలా పోరాటాలు సాగించాలని తెలంగాణ రాజకీయ ఐకాస అధ్యక్షుడు కోదండరాం గ్రామ రెవెన్యూ సహాయకులకు సూచించారు. తెలంగాణ గ్రామ రెవెన్యూ సహాయకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వీఆర్ఏలకు కనీస వేతన స్కేలు అందించాలని, మూడేళ్లు పూర్తయిన వారికి వీఆర్ఓగా పదోన్నతి కల్పించాలని, పదోన్నతి కోటా 70 శాతానికి పెంచాలని, పార్ట్‌టైమ్ పదం తొలగించాలని కోరారు. ఐకాస నేతలు వెంకట్‌రెడ్డి, పిట్టల రవీందర్, అసోసియేషన్ అధ్యక్షుడు వింజమూరి ఈశ్వర్, సహఅధ్యక్షుడు అంబాల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి పాల్వాయి వెంకన్న, కోశాధికారి ముత్యాలు, బాలమణి పాల్గొన్నారు.

## మెట్రో, హైటెక్ బస్సుల్లో అవకాశం కల్పించాలి

గ్రేటర్ పరిధిలో సుమారు రెండు లక్షలకుపైగా ఉన్న వికలాంగులకు ఆర్టీసీ మెట్రో, హైటెక్ బస్సుల్లో ప్రయాణించే సదుపాయం కల్పించాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కమిటీ రవాణ మంత్రి మహేందర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించింది. సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి గోరెంకల నర్సింహ తెలిపారు. సంఘం నేతలు అడివయ్య, వెంకట్, చంద్రమోహన్, శ్రీరాములు, మల్లేష్ పాల్గొన్నారు.

## కనీస వేతనాలు అమలు చేయాలి

అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాల అమలు కోసం ఆప్ పార్టీ పరంగా తెలంగాణలో పెద్ద ఎత్తున ఉద్యమించనున్నట్లు ఢిల్లీ ఆప్ పార్టీ ఎమ్మెల్యే సోమనాథ్ భారతి తెలిపారు. సుందరయ్య కళానిలయంలో శ్రామిక వికాస సంఘటన ఆవిర్భావం (ఆప్ పార్టీ అనుబంధం) ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికులపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను పటిష్ఠంగా అమలు చేయకుండా వారి హక్కులను హరిస్తున్నాయన్నారు. అదే బహుళజాతి సంస్థలకు మాత్రం అధిక ప్రయోజనాలను కల్పిస్తూ వారి సేవలో తరిస్తున్నాయని విమర్శించారు. పార్టీ నేతలు సరోజ్‌సిన్హా, రాజీవ్, ప్రొ.పీఎల్ విశ్వేశ్వర్‌రావు, ఆర్.వెంకట్‌రెడ్డి, నమ్రతా జైస్వాల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## పార్కింగ్ స్థలాన్ని కేటాయించండి

ఆటోలకు పార్కింగ్ స్థలం కేటాయించాలని తెలంగాణ ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. యూనియన్ -సైఫాబాద్ (సీఐటీయూ) అధ్యక్షుడిగా మహ్మద్ జబ్బార్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సంఘం కార్యదర్శి మహ్మద్ జమాల్, ఉపాధ్యక్షులు రహెమత్, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి షకీల్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నగర రోడ్డు రవాణాలో ఆటోలు కీలకంగా పని చేస్తున్నాయని వాటికి పార్కింగ్‌లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొన్నేళ్లుగా రవీంద్రభారతి ఎదురుగా ఆటో స్టాండ్‌ను కొనసాగిస్తున్నామని.. అధికారికమైన స్టాండ్ కాకపోవడం వల్ల పోలీఉలు ఈ-చలాన్లను పంపిస్తున్నారని జబ్బార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ట్రాఫిక్ ఏసీపీ, సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లను కలిసి వినతి పత్రాలను ఇచ్చామన్నారు. వెంటనే తగిన నిర్ణయం తీసుకొని, తమకు ఈ-చలాన్ల నుంచి విముక్తి కల్పించాలని జబ్బార్ పోలీసులను కోరారు.

## ప్రవాస భారతీయులను ఆదుకోవాలి

ప్రవాస భారతీయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలని, వివిధ దేశాల్లో ఉన్న లక్షలాది ప్రవాస భారతీయుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం చర్యలు చేపట్టే విధంగా ఆయా దేశాల్లో పౌర సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయాలని మాజీ ఐఎఫ్ఎస్ అధికారి డా.వినోద్ కుమార్ అన్నారు. సుందరయ్య కళానిలయంలో అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'వలసలు అభివృద్ధి -భారత ప్రవాసుల పాత్ర' అంశంపై సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. వలసలు అనేవి ప్రజల హక్కు అని, దీనికి ప్రభుత్వం సహకరించి వారిని ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా దేశాల్లో ఉపాధి, ఉద్యోగం కోసం వెళ్లిన ప్రవాస భారతీయుల లెక్కను తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. తాము సేకరించిన లెక్కల ప్రకారం 3.2 కోట్ల మంది గల్ఫ్ ఇతర దేశాల్లో జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. విదేశీ ఉద్యోగాలు భర్తీ చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండు చేశారు. కార్మిక చట్టాలను అంతర్జాతీయ కంపెనీలు కాలరాయకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

## 'హమాలీలపై ప్రభుత్వం నిర్లక్ష్యం'

పౌర సరఫరాల గోదాముల్లో పనిచేస్తున్న హమాలీలపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెరాస కార్మిక విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. అధికారుల తీరును నిరసిస్తూ ఎర్రమంజిల్‌లోని పౌర సఫరాల భవన్ వద్ద హమాలీలు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద బస్తాలు లోడింగ్, అన్‌లోడింగ్‌కు జిల్లాల్లో రూ. 12ల నుంచి రూ. 15లు గ్రేటర్‌లో రూ.16ల వరకు పెంచినా అమలు మాత్రం చేయడం లేదన్నారు. న్యాయం చేయాలని మంత్రి ఈటల రాజేందర్, పౌరసరఫరాల కమిషనర్, డైరెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. పరిష్కరించే దాకా ఆందోళన కొనసాగిస్తామన్నారు.

## సంచార జాతుల జీవన స్థితిగతులపై కమిటీ

తెలంగాణ రాష్ట్ర పరిధిలోని సంచార జాతుల జీవన స్థితిగతులపై ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రొ. తిరుమలి ప్రభుత్వాన్ని కోరారు. సుందరయ్య కళానిలయంలో తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వారి సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుమలి మాట్లాడుతూ.. సంచారజాతుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. దీనికోసం ఒక కమిషన్ ఏర్పాటు చేసి, గుర్తింపు లేని సంచార జాతులను ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఒంటెద్దు నరేందర్, యర్ర వెంకటనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కాటెపల్లి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి మందుల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీలను ఏబీసీడీలుగా విభజించాలి

జాతీయ స్థాయిలో ఓబీసీగా కొనసాగుతున్న సామాజిక వర్గాలను ఏబీసీడీలుగా విభజించాలని అఖిల భారతీయ తైలిక్ సాహు మహాసభ డిమాండ్ చేసింది. ఎంతో వెనుకబాటులో ఉన్న కులాలు వర్గీకరణ లేని కారణంగా వెనుకబాటుకు గురవుతున్నాయని మహాసభ సలహా మండలి సభ్యులు పి.రామకృష్ణయ్య పేర్కొన్నారు. ఓబీసీలను వర్గీకరిస్తూ తెలీ సామాజిక వర్గాన్ని 'ఏ' గ్రూపులో చేర్చాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సమావేశంలో మహాసభ ప్రాంతీయ అధ్యక్షులు సునీల్‌సాహు (అమరావతి), రామ్ లఖన్‌గుప్తా (అలహాబాద్), టీసీచౌదరి (రాజస్థాన్) తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.హన్మంతరెడ్డి, ఎన్.రాములు ముదిరాజ్ మాట్లాడుతూ.. విశ్రాంత ఉపాధ్యాయులకు రావాల్సిన తొమ్మిది నెలల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పెన్షనర్లకు నగదు రహిత చికిత్స పథకాన్ని అమలు చేయాలన్నారు. అరవై ఏళ్లు పైబడ్డ వారికి ఆర్టీసీ బస్సుల్లో నలభైశాతం రాయితీ కల్పించాలన్నారు. అలాగే గ్రాట్యుటీ బకాయిలను, కరవు భత్యాన్ని చెల్లించాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర నేతలు కేవీఎన్ అవతారం, విశ్వేశ్వర్‌రావు, జయంత్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, మల్లేషం, సతీష్, వెంకటయ్య, శివశరణప్ప, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్ర పరిధిలోని సుమారు 14 లక్షల మంది కౌలు రైతులకు 2011 కౌలుదారుల చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు ఇవ్వాలని హైకోర్టు విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. తెలంగాణ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో.. సుందరయ్య కళానిలయంలో, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలంటూ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, బలవన్మరణాలకు పాల్పడుతున్న వారిలో అధికులు కౌలు రైతులేనన్నారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులకు రూ.6 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు.

## లక్ష ఉద్యోగాలు భర్తీ చేయాలి

ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో భాగంగా వెంటనే లక్ష ఉద్యోగాలను భర్తీచేయాలని, రూ.3500 కోట్ల బోధన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర శాఖ సచివాలయ ముట్టడికి ప్రయత్నించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా హామీలు నెరవేర లేదన్నారు. అన్ని జిల్లాల్లో నిమ్స్‌స్థాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించాలని, ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేయాలని కోరారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.5 వేల భృతి ఇవ్వాలని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అమలు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో అనీల్‌కుమార్, ఎం.శ్రీకాంత్, నదీమ్, బాలకృష్ణ, ఆర్‌కేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 'రమ్య చట్టం తీసుకురావాలి'

నిర్భయ చట్టంలాగా 'రమ్య చట్టం' తీసుకొచ్చి మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి రమ్య తల్లి రాధిక ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జులై నెల పంజాగుట్టలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రమ్య కుటుంబ సభ్యులు ముగ్గురు చనిపోయిన విషయం తెలిసిందే. రమ్య జన్మదినం నేపథ్యంలో అన్ని విద్యాలయాల్లో ప్రార్థన అనంతరం రెండు నిముషాలు మౌనం పాటించాలని కోరారు. ప్రమాదానికి కారణమైన నిందితులను నేటికీ అరెస్టు చేయలేదన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పెద్దపల్లి జిల్లాకు వెంకటస్వామి పేరు

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పెద్దపల్లి జిల్లాకు కేంద్ర మాజీ మంత్రి దివంగత జి.వెంకటస్వామి పేరు పెట్టాలని జాతీయ మాలల ఐక్య వేదిక (జేఎంఐవీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఐదు సార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా పెద్దపల్లి నియోజకవర్గం అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని, బతికున్నంత కాలం తెలంగాణ కోసం తపించారని సంఘం నాయకులు పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి జిల్లాకు దళితుల అభ్యున్నతికి కృషి చేసిన భాగ్యరెడ్డి వర్మ పేరు పెట్టాలని కోరారు.

## 'ఒక జిల్లాకు బాపూజీ పేరు పెట్టాలి'

కొత్తగా ఏర్పాటు కానున్న జిల్లాల్లో ఒక దానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని కొండా లక్ష్మణ్ బాపూజీ స్మారక సమితి విజ్ఞప్తి చేసింది. సమితి అధ్యక్షుడు వన్నాల శ్రీరాములు విలేకర్లతో మాట్లాడారు. లక్ష్మణ్‌బాపూజీ తన సమస్తాన్ని ప్రజా సేవకు అంకితం చేశారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సురేందర్‌రావు, రచయిత బీఎస్ రాములు, ప్రొ.విశ్వేశ్వర్‌రావు, హరిత్‌రూఢా, గద్దం జగ న్నాథం, కేఎం రాందాస్ పాల్గొన్నారు..

## చెరుకు రైతుల సమస్యలపై ప్రభుత్వం చిన్నచూపు

చెరుకు రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. సెప్టెంబరు 23, 24 తేదీల్లో జరిగే అఖిల భారత చెరుకు సంఘం సమావేశాల ఆహ్వాన సంఘం ఏర్పాటుపై సుందరయ్య కళానిలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించాలని డిమాండు చేశారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.జంగారెడ్డి, బొంతల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## 'మండల్ కమిషన్ సిఫార్సుల అమలులో విఫలం'

మండల్ కమిషన్ సిఫార్సుల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యోగ, మహిళా సంఘాలు విమర్శించాయి. దేశంలో 57 శాతం ఉన్న బీసీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మండల్ కమిషన్ 40 సిఫార్సులను చేసినా ఇందులో ఒక్కటీ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం

చేశాయి. బీపీ మండల్ జయంతి వేడుకల్లో ఓబీసీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి, ఓబీసీ ఉద్యోగుల సంఘం తెలంగాణ అధ్యక్షులు దానకర్ణాచారి, ఓబీసీ మహిళా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ప్రొ.డి.కవిలత, పద్మశ్రీ, అయేషా మాట్లాడారు. బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు.

## పాలన అస్తవ్యస్తంగా మారింది: చుక్కా రామయ్య

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెండేళ్ల పైచిలుకు పాలన అస్తవ్యస్తంగా మారిందని విద్యావేత్త చుక్కా రామయ్య ఆక్షేపించారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.మాణిక్‌రెడ్డి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కారామయ్య మాట్లాడుతూ.. దేశభక్తి పేరిట దళితులపై దాడులు జరుగుతున్నాయని, దేశభక్తులెవరో? దేశద్రోహులెవరో కేంద్రం స్పష్టం చేయాలని డిమాండు చేశారు. విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు ఉద్యమించాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పి.మాణిక్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను విజయం సాధిస్తే విద్యారంగ వికాసం కోసం పని చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నర్సిరెడ్డి, చావ రవి, సంయుక్త, అందెసత్యం తదితరులు పాల్గొన్నారు.

## పేదల రిజర్వేషన్లపై రాజకీయ పార్టీల మౌనం

సామాజిక అసమానతలు ఉన్నంతకాలం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లు కొనసాగించాల్సిందేనని హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎంఎన్‌రావు అన్నారు. సుందరయ్య కళానిలయంలో తెలంగాణ సోషల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బీపీ మండల్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర సదస్సు జరిగింది. సభకు సింహాద్రి అధ్యక్షత వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎన్‌రావు మాట్లాడుతూ బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఉండాలని అసెంబ్లీ, పార్లమెంటులో ఏ ఒక్క రాజకీయ పార్టీ గళం విప్పలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలు రాజ్యాధికారం సాధించేందుకు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ, ప్రొ.పీఎల్ వి శ్వేశ్వర్‌రావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి సొల్లేటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబ్‌లో 'చర్చ' వీడియోలు

తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించిన 'చర్చ' కార్యక్రమం వీడియోలో యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే కొన్ని వీడియోలను అప్‌లోడ్ చేశాం. మరి కొన్నింటిని త్వరలోనే అప్‌లోడ్ చేస్తాం.

## మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రత్యేక చట్టాలు

మతోన్మాదానికి పౌరులు బలి కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తేవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సుందరయ్య కళానిలయంలో మానవ వికాస వేదిక ఆధ్వర్యంలో భావ ప్రకటన స్వేచ్ఛకు ఎదురవుతున్న సవాళ్లు-పరిష్కారాలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సాంబశివ రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పుణె ప్రొ.అరవింద్ మాట్లాడుతూ.. ఎన్డీయే హయాంలో హేతువాదులపై దుర్మార్గంగా దాడులు జరుగుతున్నాయన్నారు. దబోల్కర్ హత్య జరిగి మూడేళ్లు గడిచినా కేసులో పురోగతి లేదని చెప్పారు. జన జాగరణ సమితి కార్యకర్తలు హత్యకు కుట్ర చేసినట్లు సీబీఐ పరిశోధనలో బహిర్గతమైనా దాడులకు తెగబడిన వారిపై చర్యలేవని ప్రశ్నించారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించడం సరికాదన్నారు. ఈ సందర్భంగా దాడుల్లో మరణించిన హేతువాదులకు నివాళులు అర్పించారు. వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, చంద్రయ్య, ఎంఎస్ఎన్ మూర్తి, కేవీఆర్‌రెడ్డి, ఎంఎన్ గుప్త పాల్గొన్నారు.

## మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

మహిళలకు కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ మహిళా సమాఖ్య కోరింది. సమాఖ్య కార్యాలయంలో జాతీయ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి, తెలంగాణ అధ్యక్షురాలు అసోజు పుష్పలత, ప్రధాన కార్యదర్శి దశరథ లక్ష్మి, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ప్రొఫెసర్ కవిలత, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. దేశంలో బీసీ ఉద్యోగులు కేవలం 7 శాతం మాత్రమే నని, ఇందులో మహిళలు ఒక శాతానికే పరిమితమయ్యారని వారు పేర్కొన్నారు.

## 'రైల్వే' సమస్యలను కేంద్రం పట్టించుకోవాలి

కేంద్రప్రభుత్వం రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారంపట్ల సానుకూల దృక్పథం కనబర్చాలని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. రైల్వే మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రైల్వే మజ్దూర్ యూనియన్ స్వర్ణోత్సవాల సభలో ఆయన మాట్లాడారు. ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివ గోపాల్ మిశ్రా మాట్లాడుతూ రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్రప్రభుత్వం నాలుగు నెలల గడువు కోరిందనీ, ఆ తర్వాత ప్రతికూల నిర్ణయాలు వస్తే నోటీసులేకుండా సమ్మె చేసేందుకు కార్మికులు సిద్ధంగా ఉండాలన్నారు. దక్షిణమధ్యరైల్వే జనరల్ మేనేజర్ రవీంద్రగుప్తా మాట్లాడుతూ రైల్వేల అభివృద్ధికి యంత్రాంగం, కార్మికులు, కార్మికసంఘాలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు, ఏఐఆర్ఎఫ్ అధ్యక్షుడు ర్యాకల్‌దాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు. ద



# తృప్తి



ఒకరోజు ఒకబెస్తవాడు చేపలుపట్టేందుకు దగ్గరలో ఉన్న చెరువుకు వెళ్ళాడు. చెరువులో వలవేసి చాలాసేపు కూర్చున్నాడు. కొద్దిసేపటికి ఒక చిన్న చేప వలలో చిక్కింది. వలలో ఉన్న చేప బెస్తవాడితో –

"ఓయీ, బెస్తవాడా! నన్ను వదిలెయ్యి" అంది.

"ఎందుకు"? అని బెస్తవాడు ప్రశ్నించాడు.

"నన్ను చూశావుకదా ఎంత చిన్నగా ఉన్నానో, నేను నీకు కొద్దిగానే ఉపయోగపడతాను" అంది చేప.

"అయితే నిన్ను ఒదిలెయ్యాలా?" అన్నాడు బెస్తవాడు.

"అవును. నన్ను ఇప్పుడు నీటిలోకి ఒదిలిపెట్టావనుకో, నేను చెరువులో పెరిగి పెద్దదాన్నవుతాను. అప్పుడు నీకు చాలా ఉపయోగపడతాను" అంది తెలివిగా.

బెస్తవాడు చేప తెలివికి చిన్నగా నవ్వుతూ.

"నేను అంత తెలివి తక్కువ వాణ్ణికాను. చెరువులో ఉండే పెద్దచేప కన్నా వలలో ఉన్న చిన్నచేపే విలువైనది. లేనిదానికొరకు ఆశపడటం కంటె ఉన్నదానితో తృప్తి పడటమే మంచిది" అంటూ చేపను తీసుకొని బెస్తవాడు ఇంటివైపు బయలుదేరాడు.

**–(లియోటాల్‌స్టాయ్ కథ ఆధారంగా)**

(ఏప్రిల్ 1991 బాల చెలిమి)

## యూట్యూబ్‌లో 'చర్చ' వీడియోలు

తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించిన 'చర్చ' కార్యక్రమం వీడియోలో యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే కొన్ని వీడియోలను అప్‌లోడ్ చేశాం. మరి కొన్నింటిని త్వరలోనే అప్‌లోడ్ చేస్తాం.



# నెత్తిమీద మేకు కొట్టడం

పూర్వం ఒక హరిదాసు నవాబు దర్శనం చేసుకుని, రసవత్తరంగా హరికథ చెప్పి నవాబును మెప్పించాడు. నవాబు వెంటనే హరిదాసు వంటినిండా మల్లె మాలలు చుట్టి ఏనుగుపై ఊరేగించి వెయ్యి వరహాలు బహుమానం ఇవ్వమని ఆజ్ఞాపించాడు. భటులు దాసును పక్కగదిలోకి తీసుకువెళ్ళి మల్లెమాలలు వంటినిండా చుట్టారు. కాని దాసుకు బట్టతల ఉండటం వలన తలమీద మల్లెమాలలు జారిపోయాయి. భటులు రాజు వద్దకు వచ్చి ప్రభువు చెప్పినట్లు చేయలేకపోతున్నామని కారణం వివరించారు. తన మాటకు ఎదురు ఉండటం నవాబు క్షమించలేకపోయాడు. "జారిపోతున్నాయి అనే సాకుతో బట్టతల మీద మల్లెమాలలు చుట్టడం మానేస్తారా? దాసు గారి గుండు మీద మేకులు కొట్టి మాలలు చుట్టబెట్టండి". అని కోపంగా అన్నాడు. ఈ మాటలు విన్న దాసుగారు కిటికీలో నుంచి దూకి పారిపోయాడు. తలమీద మేకు కొట్టించుకోవడం అంటే ఎంతటి ధైర్యవంతుడికైనా సాధ్యమయ్యే పనికాదు. నేను చెప్పే గమ్మత్తు అచ్చంగా ఇటువంటిది కాదు.



తలమీద 10 సెం.మీ. మందం కలిగిన దేవదారు కర్రముక్క ఉంచి, ఆ కర్రలోకి 8 సెం.మీ. పొడవు ఉన్న మేకును సుత్తితో కొట్టి దిగగొట్టాలి. అమ్మో! ఆ అదురుకి బుర్ర ఉంటుందా అసలు? బుర్రకు అదురు తగల కుండా కర్ర దిమ్మలోకి మేకును దిగ్గొట్టే సులభ పద్ధతి ఒకటి ఉంది.

చాలా లావుగా ఉన్న గ్రంథాలు మూడు నాలుగు తెచ్చి తలమీద దొంతరగా పెట్టి, వాటి మీద కర్ర దిమ్మ పెట్టి అప్పుడు ఆ కర్రలోకి మేకు కొడితే అతి సులభంగా తలకి అదురు తగలకుండా పని జరిగిపోతుంది. దీనికి కారణం ఏమిటో తెలుసా?

వస్తువులన్నిటికీ ఒక విధమైన 'జడత్వం' ఉంది. అది ఎటువంటిదంటే స్థిరంగా ఉన్న వస్తువు కదలదు. అంతేకాదు కదులుతున్న వస్తువు ఆగదు. ఈ సంగతి మొట్టమొదటిసారిగా ఐజాక్ న్యూటన్ ఊహించి తన గతిశాస్త్ర సూత్రాలలో ఒకటిగా పేర్కొన్నాడు.

వస్తువు బరువు ఎక్కువైన కొద్దీ ఈ జడత్వం కూడా ఎక్కువ అవుతుంది. లావుపాటి పుస్తకాలకున్న జడత్వం వల్ల సుత్తి దెబ్బ మేకు మీద పడినపుడు మేకు కదులుతుందే గాని కింద ఉన్న పుస్తకాలు అంతగా కదలవు. కనుక తలకి అదురు అంతగా ఉండదు. అదీ సంగతి!

**–డాక్టర్ మహీధరనళినీ మోహన్**

(నవంబర్ 1990 బాల చెలిమి)

# రైతుస్థాయిలో తక్కువ ఖర్చుతో చీడపీడల నివారణ

భారతదేశం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంది. ఈ నేపథ్యంలో అధిక దిగుబడులు సాధించే ప్రయత్నంలో విచక్షణారహితంగా పురుగుమందులను వాడటం వల్ల వాతావరణ సమతుల్యం దెబ్బతింటుంది. పంటలకు అయ్యే ఖర్చు ఎక్కువై రైతుల ఆత్మహత్యలకు దారి తీస్తాయి. అందువల్ల మన పొలం దగ్గరే జీవ సంబంధిత రసాయనాలు తయారు చేసుకోవడం వల్ల ఖర్చు తగ్గించడమే కాకుండా పర్యావరణాన్ని కూడా కాపాడుకోగలుతాం.

**ఆవుపేడ, మూత్ర కషాయం:**

- మొదటగా 5 కిలోల ఆవుపేడ, 5 లీటర్ల ఆవు మూత్రం మిశ్రమాన్ని 5 లీటర్ల నీటిలో కలిపి నాలుగు రోజుల వరకు మూత పెట్టి ఒక బకెట్‌లో అలగే ఉంచాలి
- ఆ తర్వాత దానిని వడపోసి 100 గ్రా. లైమ్ పొడరును కలపాలి
- పై మిశ్రమానికి 80 లీ. నీటిని కలిపితే ఒక ఎకరాకు సరిపడా ద్రావణం తయారవుతుంది.
- ఈ ద్రావణానికి వచ్చ పురుగు, లిద్దె పురుగు గుడ్లను నాశనం చేసే శక్తి ఉంటుంది. పంటలకు వచ్చే కొన్ని వ్యాధుల బారినుంచి కూడా కాపాడుతుంది.



**అల్లం, పచ్చి మిర్చి, వెల్లుల్లి మిశ్రమం**

- మొదటగా 18 గ్రా. వెల్లుల్లిని తీసుకొని, పై పొరను వేరుచేసి మెత్తగా నూరుకోవాలి. ఆ తరువాత 9 గ్రా॥ పచ్చిమిర్చి + 9 గ్రా॥ అల్లంను కలిపి మెత్తగా నూరాలి. పై మిశ్రమాలను ఒక లీటరు నీటిలో కలపాలి. ఆ తర్వాత ఒక బట్ట ద్వారా మిశ్రమాన్ని వడపోయాలి.
- 500 మి.లీ. వడపోయగా వచ్చిన ద్రావణానికి 100 మి.లీ. సబ్బు పొడిని కలిపి పంటల్లో పిచికారి చేయాలి.
- ఇలా పిచికారి చేయడం వల్ల పేనుబంక, దీపపు పురుగు, పిండి పుగురు, తెల్ల దోమలను నివారించుకోవచ్చు.

**వేప విత్తన కషాఅయ ద్రావణం (5 శాతం)**

- మొదటగా 500 గ్రా॥ ఎండిన వేప గింజలను ఏరి మెత్తగా నూరి పొడిగా చేసుకోవాలి. ఆ తర్వాత 50 గ్రా॥ పొడిని ఒక మస్లిన్ బట్టలో తీసుకొని 400-500 మి.లీ. నీటిలో ఒక రాత్రి మొత్తం నాబెట్టాలి.
- మరుసటి రోజు మస్లిన్ బట్టను సరిగా పిండి, వచ్చిన కషాయాన్ని మరి కొన్ని నీళ్ళు కలిపి ఒక లీటరు దాకా ఉండేలా చేసుకోవాలి.
- ఆ తర్వాత 2గ్రా॥ సబ్బు పొడిని కలిపితే మనకు 5 శాతం వే విత్తన కషాయం ద్రావణం తయారవుతుంది.
- ఈ మోతాదులో పంటల్లో పిచికారి చేస్తే లద్దెపురుగు, పచ్చ పురుగు, ఆకు ముడత పురుగు, నామాల పురుగు, రసం పీల్చే పురుగులను అరికడుతుంది.

**ఎన్.పి.వి. ద్రావణం**

- మొదట 900 ఎన్‌పవివి బారినపడ్డ పచ్చపురుగు లేదా 200 లద్దెపురుగలను కుంటల నుంచి ఏరి ఒక దగ్గర వుంచాలి.
- ఆ తర్వాత వాటిని మెత్తగా నూరి ఒక పలుచని బట్ట ద్వారా వడబోఆఅయలి.
- వడపోయగా వచ్చిన ద్రావానాన్ని 100 లీ. నీటిలో కలపాఇ. ఆ తర్వాత 100 గ్రా॥ రాబిన్ బ్లూ పొడిని కలపాలి.
- పైన తయారు చేసుకున్న ద్రావణాన్ని సాయంత్రం వేళలో మాత్రమే పిచికారి చేయాలి.
- పిచికారీ చేసిన 2 నుంచి 5 రోజుల్లో పచ్చ పురుగులు, లద్దె పురుగులు వ్యాధి బారిన బడిన చెట్ల కొమ్మల చివర్లకు చేరి తన వెనకాటి కాళ్ళతో వేలాడి చనిపోతాయి.

**పొగాకు డికాక్షన్**

- ఒక కిలో పొగాకు పొడిని 10 లీటర్ల నీటిలో కలిపి అరగంట సేపు వేడి చేయాలి.
- ఆ తర్వాత చల్లార్చి మస్లిన్ బట్ట గుండా వడపోయాలి
- వడపోయగా వచ్చిన ద్రావణానికి 2 గ్రా।7 / ఒక లీటరుకు కలిపి 30 నుంచి 100 టీటర్ల వరకు పలుచగా చేసుకోవచ్చు.
- పై ద్రావణాన్ని పంటల్లో పిచికారి చేయడం వల్ల రసం పీల్చే పురుగుల బారి నుంచి కాపాడవచ్చు.
- కాని పొగాకు ద్రావణాన్ని ఒకసారి మాత్రమే పిచికారి చేయాలి. ఎక్కువగా పిచికారి చేస్తే ఆ ద్రావణం మిత్ర పురుగులను కూడా అది నాశనం చేసే అవకాశం ఉంది.

**-వి. శ్రీరమ్య ఎం.ఎస్.సి (సాయిల్‌సైన్స్),**
**టి.జయప్రకాష్ ఎంఎస్‌సి జనటిక్స్ & ప్లాంట్ బ్రీడింగ్,**
**కే మమత, ఎంఎస్‌సి (అగ్రానమి)**
**వ్యవసాయ కళాశాల,**
**ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం,**
**రాజేంద్రనగర్, హైదరాబాద్**

ద

# చెక్కబొమ్మలాట

ఒక కథను మానవ పాత్రలతో ప్రదర్శించడం మొదటి ఆలోచన అయితే కథను మానవ పాత్రలతోనే కాకుండా మానవులు చేసిన బొమ్మలతో కథను ప్రదర్శించడం అనే ఆలోచన మానవుడి అభివృద్ధిచెందిన సాంకేతికతకు కళా తృష్ణకు సంకేతంగా చెప్పదగిన పరిణామం. ఇలాంటి కళారూపాలు తోలుబొమ్మలాట చెక్క బొమ్మలాట కళారూపాలు. జానపద కళా ప్రదర్శనలో మనిషి సాధించిన ప్రగతికి ఇవి మచ్చులు. తెలుగు వారికి ఈ రెండు కళాప్రదర్శన సంప్రదాయలు ఉన్నాయి. తెలుగునాట తోలు బొమ్మలాటలు చెక్క బొమ్మలాటలు కనీసం 12 వ శతాబ్దినుండి ఉన్నాయని చెప్పడానికి చారిత్రక ఆధారాలు లభించాయి.

చెక్కబొమ్మలాట విషయానికి వస్తే దీని కళాకారులు అందరూ తెలుగువారు. తెలుగునాట దళిత కులాల ఉపకులాలలో ఒకరైన వారు. వీరిని బుడిగజంగాలు అనిఅంటారు. కాని బుడిగ జంగాలు అందరికీ వృత్తి లేదు. అందుకే వీరిని బొమ్మలోళ్ళు అని ప్రత్యేకంగా వ్యవహరిస్తూ ఉన్నారు. చెక్క బొమ్మలాట కూడా 12 వ శతాబ్ది నాటికే ఉందని చెప్పడానికి ఆధారాలు లభించాయి. వీరికి అవసరమైన చెక్క బొమ్మలు తయారు చేసిన విశ్వకర్మ కుటుంబాలు ఇప్పటికీ ఉన్నాయి. వీరిని బొమ్మలాట వారు అని పిలవడం కూడా ఇప్పటికీ ఉంది. చెక్కబొమ్మలాట కూడా ప్రాథమికంగా యక్షగాన ప్రక్రియ.



**ఆటకు నోచుకోని బొమ్మలు**

తెలుగు జానపద కళారూపాల్లో బొమ్మలాట కళారూపాలు ప్రత్యేకమైనవి. వివిధ రకాల బొమ్మలను ఆడిస్తూ ప్రదర్శనలిచ్చే కళారూపాలను 'బొమ్మలాటలు' అంటారు. ఈ బొమ్మలను వివిధ రకాల వస్తువులతో తయారు చేస్తారు. ఇటువంటి బొమ్మలాటలకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. 'సూత్రక్రీడ' అన్నది అరవై నాలుగు కళల్లో ఒకటి. ఇదే బొమ్మలాట అని కొందరి అభిప్రాయం. బొమ్మలాటలో సూత్రాలు ఉంటాయి. దీని వల్లనే సంస్కృత నాటకాలలో సూత్రధారి అనే పేరు వచ్చిందంటారు. ఆడించేవారు వెనుకఉండి బొమ్మలను సూత్రాల సహాయంతో ఆడిస్తుంటారు కాబట్టి ఈ ఆట చూడటానికి అద్భుతంగా ఉంటుంది.

జానపద బొమ్మలాటల్లో ప్రధానంగా తోలుబొమ్మలు, చెక్క బొమ్మలు, మందెచ్చుల బొమ్మలు, బుట్టబొమ్మలు, పెద్దమ్మలోళ్ళ బొమ్మలు, ఈతమట్ట బొమ్మలు, గంగమోళ్లబొమ్మలు ప్రధానమైనవి. వీటి ప్రసక్తి ప్రాచీన సాహిత్యంలోనూ ఉంది. తోలుబొమ్మలాట వంటి ప్రదర్శన కళలు ఆంధ్ర మహాభారతంలో కూడా సూచితమయ్యాయి. పాల్కురికి సోమనాధుని కాలం నుంచి రఘునాధరాయల వరకు అనేకులు బొమ్మలాటను పేర్కొన్నారు. పల్నాటి వీరచరిత్రలో 'ప్రతిమల నాడగ బట్టినయట్లు' అన్నమాట ఉత్తర హరివంశలోని 'యంత్రకుడాడించి యవని డ్రోచెన్ వ్రాలు బొమ్మల గతి రథ పూగములును' అన్న దాన్ని బట్టి ఆనాడు రకరకాల బొమ్మలాటలు ఉన్నట్లుగా తెలుస్తుంది. నేటి సినిమాకు మూలమైన మాతృక ఈ బొమ్మలాటనే. బొమ్మలాటల్లానే అతి ప్రాచీనమైన కళారూపం చెక్కబొమ్మలాటగా చెప్పవచ్చు.

చెక్కతో చేసిన బొమ్మల్ని ఆడించటాన్ని చెక్కబొమ్మలాట అంటారు. వీటినే రాయలసీమలో 'కొయ్యబొమ్మలని', బొమ్మల చేతులకు దారాల బదులు ఇనుప ఊచలు కట్టి ఆడించడం వల్ల 'ఊచబొమ్మలని' కూడా అంటారు. చెక్కబొమ్మలను ఆడించే వారిని బొమ్మలోళ్లు అని అంటారు. ఈ చెక్కబొమ్మలను తేలికైన బూరుగ, ప్రత్తి మొదలైన కర్రలతో చేస్తారు. తల, చేతులు చేయడానికి 'సరివి' కర్రను ఉపయోగిస్తారు. ఇవి ఆడించే విధంగా ఉంటాయి. ఆడ, మగ, నకిలి బొమ్మలనేవి ఈ ఆటలో ఎక్కువగా ఉంటాయి. మగ బొమ్మలు ఒకటిన్నర అడుగుల నుంచి రెండున్నర అడుగుల వరకు ఉండగా ఆడబొమ్మలు కొంచెం చిన్నవిగా ఉంటాయి. సౌమ్యం, రౌద్రం మొదలైనవి అభినయించాల్సిన పాత్రలను బట్టి నలుపు, తెలుపు, ఎరుపు, పసుపు రంగులను వేస్తారు. స్త్రీ పాత్రలకు చీరలు కట్టడంతోపాటు గాజులు, ఆభరణాలు, పక్కపుల్లలు, గంటీలు, పక్కతీగ, గొట్టాల గొలుసు, దేవుని దండలు, మగపాత్రలకు పంచలు కట్టడంతో విల్లు, గద, చక్రం, కిరీటం మొదలైనవి అలంకరిస్తారు. బొమ్మలలో రాముడు, లక్ష్మణుడు, సీత, లక్ష్మీదేవి, కృష్ణుడు, బ్రాహ్మణుడు, గొల్లమల్లక్క, మాయలఫకీరు వంటివి ఉంటాయి. ప్రస్తుతం ఇటువంటి కళారూపాన్ని ప్రదర్శించే బొమ్మలోళ్లు తెలంగాణలో వరంగల్లు జిల్లాలోని నారాయణపూర్ మండలంలో

బూర్గుపేట గ్రామంలో మోతె రామస్వామి బృందం, అదేవిధంగా అమ్మాపురం మండలంలో మోతె జగన్నాథం బృందం అనే రెండు బృందాలు మాత్రమే ఉన్నాయి. వీరందరూ అన్నదమ్ముల కొడుకులే. చిన్నతనంలో బొమ్మలాట ఆడుతున్న వీరి తల్లిదండ్రుల ఆటను మెచ్చిన జనగాం తాలూకా 'గట్ల మల్లాల దొర' అవుసలి రామన్నకు పుట్టెడు వడ్లు వెయ్యి రూపాయలు ఇచ్చి బొమ్మలను చేయించి దానంగా ఇచ్చాడు. ఆ తర్వాత కాలంలో నకాశి వారిచే మరికొన్ని బొమ్మలు తయారు చేయించుకొని ఇద్దరు సమానంగా పంచుకొని ఆటను ఆడుతున్నారు. ఆట ప్రారంభంలో బొమ్మలను చేయించి ఇచ్చిన గట్లమల్లాల దొరను వీరు ప్రతిసారి పొగడుతూ ఉంటారు. ఈ బొమ్మలను ప్రదర్శించే వారు బుడిగె జంగాలలో గ ణాయతు జంగం, బెడద జంగం తెగకు చెందినవారు.

చెక్కబొమ్మలోళ్లు ఎవరికి ఎక్కడ ప్రదర్శన లివ్వమన్నా ఇస్తారు. వర్షాకాలంలో తప్ప మిగిలిన అన్ని కాలాల్లోనూ చెక్క బొమ్మలాటను ప్రదర్శిస్తుంటారు. ప్రదర్శనకు ఆరుగురు వ్యక్తులు అవసరమవుతారు. ప్రధానంగా ఇద్దరు వ్యక్తులు బొమ్మలు పట్టుకొని ఆడిస్తుంటారు. మిగతా వారు సహాయకులుగా వాద్య సహకారం అందిస్తూ వంత పాడుతూ ప్రదర్శన రక్తికట్టేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తారు. ప్రదర్శనలు సాధారణంగా రాత్రిళ్లు జరుగుతాయి. ప్రత్యేకంగా ఎవరైనా పగలు ప్రదర్శించమని అడిగితే ప్రదర్శిస్తారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఆటను ప్రారంభిస్తే రెండు గంటల వరకు, పగలు పదకొండు గంటల నుండి సాయంత్రం నాలుగైదు గంటల వరకు మొత్తం ఆరుగంటల ప్రదర్శన ఉంటుంది. పగటి ప్రదర్శనపుడు బొమ్మలను ఆడించే దారాలు కనబడకుండా వలవేస్తారు.



వీరి రంగస్థల నిర్మాణం ప్రత్యేకంగా ఉంటుంది. తెల్లని పరదాలను మాత్రమే కడతారు. ముందుగా నాలుగు గజాల వెడల్పుతో రెండు వెదురు బొంగులు పాతుతారు. వాటికి గజం దూరంలో మరో రెండు బొంగులు వెనుక భాగంలో పాతుతారు. వెనుక బొంగులకు అడ్డు తెర కడతారు. ఈ తెర కొంత ఎత్తు వరకే (తెర ముందు బొమ్మలు ఆడించేవిధంగా) ఉంటుంది. ఈ తెరపైన వెదురు బొంగుకు తొమ్మిది సీలలు ఉంటాయి. బొమ్మల్ని తెరమీద స్థిరంగా నిలపాలని అనుకున్నప్పుడు దారాన్ని ఈ సీలకు తగిలిస్తారు. తెరవెనుక, తెర ముందు చెక్క బల్లలు వే స్తారు. వెనుక ఉన్న బల్లలపై కళాకారులు నిలబడి, తెర మీద నుండే దారాలతో బొమ్మలను ముందు ఉన్న బల్లలపైన ఆడిస్తారు. అయితే వీరు ప్రేక్షకులకు కనబడకుండా ముందు ఉన్న రెండు బొంగులకు వెనుక తెర మాత్రమే కనిపించేటట్లు దానికి అడ్డుగా ముందర ఒక వస్త్రం కడతారు. అప్పుడు చూసే వారికి కళాకారులు కనిపించకుండా బొమ్మలు మాత్రమే కనిపిస్తాయి. వెలుతురు కేవలం బొమ్మల వైపు ప్రసరించేటట్లు దీపాలు లేదా లైట్లు అమర్చుతారు. బొమ్మలు చెక్కతో చేయబడి చేతులు, తల ఆడించే విధంగా ఉం టాయి. ఈ బొమ్మలకు కాళ్లు ఉండవు. వీటిని రంగులతో అలం కరిస్తారు. బొమ్మల్ని పాత్రలకు అనుగుణంగా రంగు రంగుల వస్త్రాలతో ఏ రోజు పాత్రకు ఆ వేషం వేస్తారు.

వీరి ప్రదర్శనల్లో లవకుశ, బాలనాగమ్మ, భక్తరామదాసు, భక్తప్రహ్లాద, గయోపాఖ్యానం, ధర్మాంగద చక్రవర్తి, చెంచులక్ష్మి మొదలైనవి ముఖ్యమైనవి. కథలను వారి తాత తండ్రుల వద్ద నుండి నేర్చుకుని వంశపారంపర్యంగా చెబుతున్నారు. కళాకారులకు ప్రత్యేకంగా వేషధారణంటూ ఏమీ లేదు. అందరూ సాధారణ దుస్తుల్లోనే ఉంటారు. కథకుడు దోవతి కట్టుకొని కమీజు తొడుక్కుని తలకు తోక రుమాలును చుట్టుకుంటారు. తబలా, హార్మోనియం, తాళాలు, గజ్జెలు మొదలైన వాద్య పరికరాలతో కథా సందరాలేకు అనుకూలంగా సంగీతం సమకూర్చుకుంటారు. పెండ్లి, చావు, దినాలు, సంవత్సరాలకు వెళ్లి ప్రదర్శనలిస్తుంటారు. ప్రత్యేకంగా గొల్లకులం వాళ్ళ ఇంటికి వెళ్ళినపుడు 'కృష్ణలీల' అనే నాటకం ప్రదర్శిస్తారు.

చెక్కబొమ్మలాటను విఘ్నేశ్వరుడి ప్రార్ధనతో ప్రారంభిస్తారు. ముందుగా బొమ్మలను తెరపైన వేలాడదీసి కట్టిన తర్వాత కళాకారులు తెర వెనుక నుండి ప్రార్ధన ఆలపించి ప్రదర్శనను ఆరంభిస్తారు. ప్రధాన కథకుడు మొదట బొమ్మను పట్టుకొని 'అందరికి నమస్కారం' అంటూ ప్రేక్షకుల వైపు దండం పెట్టించి ఆ రోజు చెప్పబోయే కథ, చెప్పించే వారి వివరాలు చెప్పి అందరికి తాను కూడా నమస్కారం చేసి ప్రదర్శన ప్రారంభిస్తాడు. ఆ రోజు కథా ప్రదర్శ నలో వచ్చే పాత్రలను బట్టి తెర పక్క నుండి బొమ్మలను తీసుకొని వచ్చి చేతులతో కథ సన్నివేశాలకు అనుగుణంగా బొమ్మలను కదిలిస్తూ వెనుక ఉండి గాత్రదానం చేస్తూ కథ నడిపిస్తారు. బొమ్మల చెవులకు, చేతులకు సన్నని నైలాన్ దారాలు కట్టి వాటి సహాయంతో కళా కారుడు బొమ్మలను లయాత్మకంగా ఆడిస్తూ పాట పాడుతూ దానికి తగ్గట్టుగా తాను కూడా నర్తిస్తుంటాడు. స్త్రీ పాత్రలకు కొంచెం స్వరాన్ని తగ్గించి పురుషులే గొంతు నిస్తారు. కథలో అద ృశ్యమయ్యే పాత్రలను హఠాత్తుగా కనిపించకుండా చేయడం, ప్రత్యక్షమయ్యే పాత్రలను పై నుండి తెర ముందుకు తేవడం లాంటి దృశ్యాలు అద్భుతంగా ఉండి, కళాకారుల ప్రతిభకు ప్రతీకలుగా నిలుస్తాయి. వీరి ప్రదర్శనలో ప్రత్యేకత బొమ్మలతో



చెక్క బొమ్మలాట కళాకారుల బృందం (జగన్నాథం తదితరులు)

కోలాటం వేయించడం. ఈ కోలాటం సుమారు 10 రకాలుగా మార్చి వేయిస్తారు. కోలాటంలో కృష్ణుడు, గోపికలను ప్రతిబింబిస్తూ ఏడు బొమ్మలుంటాయి. ఇందులో గొల్ల మల్లక్క హాస్యపాత్రను పోషిస్తుంది. చివరకు మంగళహారతి పాడి కథను ముగిస్తారు.

చెక్కబొమ్మలాటలు త్యాగం కథల్లాగా ప్రదర్శించేవికావు. ప్రదర్శన కావాలనుకున్న గ్రామపెద్దలు ఆటకు ఇంతని ముందుగా కళాకారులతో ఒప్పందం కుదుర్చుకుని ప్రదర్శనలు ఏర్పాటు చేసుకుంటారు. పూర్వం వెలుతురులోనే జరిగే ఈ ప్రదర్శన నేడు ఫ్లడ్‌లైట్ల కాంతిలో ప్రదర్శిస్తున్నారు. ఈ బొమ్మలాటకు ఒకప్పటిలా ప్రేక్షకాదరణ లేదు. కాలానుగుణంగా వస్తున్న మార్పుల వల్ల టి.వి, సినిమాల వల్ల ఈ ప్రదర్శనను చూసే వారే కరువయ్యారు. దానితో కళాకారులు వ్యవసాయ పనులు చేసుకోవడం, కూలికి పోవడం, గిన్నెల వ్యాపారం వంటి పనులుచేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

అతి ప్రాచీనమైన ఈ కళారూపం తెలంగాణలో నేడు రెండు బృందాలకే పరిమితమై ఉన్నది. ప్రధాన కథకులు ఇప్పటికే 60 సంవత్సరాల వయసుదాటి ఉన్నారు. ప్రదర్శన ఏర్పాటు చేయాలంటే బొమ్మలుస్టేజి సామాను మోసుకొని ప్రదర్శనా స్థలానికి తరలించడం చాలా కష్టమైన పని, పైగా ఖర్చుతో కూడుకున్నది. ఏదో విధంగా కొందరు ఔత్సాహికులు కథ ఏర్పాటు చేసినప్పటికీ రెండు రకాలుగా బరువు మీద పడటంతో ఆదరించే వారు కూడా కరువయ్యారు. అందుకే అద్భుతమైన ఈ బొమ్మలాట కళారూపం అటకెక్కుతోంది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు వీరికి చేయూత నందించినప్పటికీ లాభం లేకుండా పోయింది. ఇటువంటి అరుదైన కళారూపాన్ని పరిరక్షించుకొని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నది. ప్రభుత్వం ఈ కళారూపానికి సంబంధించిన శిక్షణ తరగతులు ఇప్పించి మరికొంత మందికి ఈ కళారూపాన్ని నేర్పించి ప్రదర్శన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**– డా॥ చూరేపల్లి రవికుమార్**
తెలుగు విశ్వవిద్యాలయం

**చెక్కబొమ్మలాట కళారూపం**

**పరిరక్షణకు కృషి**

చెక్కబొమ్మలాట కళను వెలికితీయడంలో ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు కీలకపాత్ర వహించగా, ఈ కళా రూపం పరిరక్షణలో టీఆర్‌సీ చైర్మన్ యం.వేదకుమార్ ముఖ్యభూమిక పోషించారు.

చిల్డ్రన్స్ అకాడమీ, 'జానపద', సీఫెల్‌లతో కలసి హిమాయత్‌నగర్‌లో బొమ్మలాట కళాకారుల ప్రదర్శన నిర్వహింపచేయడంలో ఆయన ప్రముఖపాత్ర వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పదకొండు జిల్లాల్లో బొమ్మలాట కళాకారుల బృందాలచే ప్రదర్శనలు ఇప్పించారు. పలు ప్రాంతాల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించారు. అన్నింటి కంటే ముఖ్యంగా ఈ కళారూపాన్ని డాక్యు మెంటేషన్ చేశారు. తద్వారా భావితరాలకు ఈ కళారూపాన్ని అందించేందుకు వీలు కలుగుతుంది. తెలంగాణ రిసోర్స్ సెంటర్ ద్వారా ఈ తరహా కళారూపాల పరిరక్షణకు మరింత గా కృషి చేస్తున్నారు. **– శేష**





# హైదరాబాద్ ఫైర్‌బ్రాండ్ సుమిత్రబాయి

హైదరాబాద్‌పై పోలీసు చర్యకు పూర్వం ఎందరో మహిళలు రాజకీయ రంగంలో పనిచేశారు. వీరందరికీ స్ఫూర్తి సరోజిని నాయుడు. సంగెం లక్ష్మీబాయి, సదాలక్ష్మి, జె.ఈశ్వరిబాయి, రాజమణీ దేవి, మంకమ్మ, మాసూమా బేగం లాంటి దళిత, బహుజన మహిళలు అటు రాజకీయాల్లోనూ, ఇటు సేవా రంగంలోనూ తమదైన ప్రతిభను ప్రదర్శించారు. అట్లాంటి వారిలో ఫైర్ బ్రాండ్ దళిత మహిళ నేతగా సుమిత్రాబాయి ప్రసిద్ధి. పేదలు, దళితుల పక్షాన ప్రజా పోరాటాలు చేసిన మహిళ. జూబ్లిహిల్స్ ఎమ్మెల్యేగా 1955లో ఎన్నికయ్యారు. హైదరాబాద్ లోని నారాయణగూడాలో 1918 అక్టోబరు తొమ్మిదిన జన్మించిన ఈమె మొదట 1938లో తన 20వ యేట చిక్కడపల్లిలో ఆర్యయువజన పాఠశాల స్థాపనతో ప్రజాజీవితంలోకి అడుగు పెట్టారు. భాగ్యరెడ్డి వర్మ స్థాపించిన ఆదిహిందూ పాఠశాలలో మాదిగలకు ప్రవేశం కల్పించకుండా, వివక్ష చూపడంపై ఆమె ఆనాడే ఆయన్ని నిలదీసింది. ఇది తప్పుడు చర్య అని ఖండించింది. నగరంలో అనేక ఖాదీ ప్రచార సంఘాలు, చరఖా సంఘాలు స్థాపించారు. వార్ధాలో మూడు సంవత్సరాలు (1939–1942) గ్రామ సేవికగా శిక్షణ పొందారు. 1942లో స్టేట్ కాంగ్రెస్ సభ్యురాలిగా చేరి నారాయణగూడాలో జగ్జీవన్ పాఠశాల ఏర్పాటు చేశారు. ఖాదీ ప్రచార సంఘాలు, చరఖా సంఘాలను ఏర్పాటు చేసి నిర్వహించారు. ఆంధ్ర మహిళా సభ, ఆంధ్రయువతీ మండలి సభ్యురాలిగా సేవ చేశారు. 1943లో ఏడో నిజాం ఉస్మానలీఖాన్ కోడలు ప్రిన్సెస్ దుర్రెషెహ్వార్ నేతృత్వంలో నడిచిన ఆహార ధాన్యాల చౌకదుకాణాలలో సభ్యురాలిగా ఉండి అన్నార్తులకు తిండి గింజలు అందేలా సేవలందించారు. ఆంధ్ర యువతీ మండలి కార్యకలాపాల్లో కొంత కాలం చురుగ్గా పాల్గొని స్త్రీల సాంఘిక, ఆర్థిక, విద్యా, వైజ్ఞానికాభివృద్ధికి కృషి చేశారు. 1946లో నిజాం రాష్ట్ర నిమ్నజాతి మహాసభకు అధ్యక్షురాలిగా ఎన్నికై హైదరాబాద్ దళిత సంఘానికి, తద్వార దళితులకు సేవచేశారు. 1947లో సుల్తాన్‌బజార్ సత్యాగ్రహోద్యమంలో పాల్గొని అరెస్టయ్యారు. 20 రోజులపాటు జైలు శిక్ష అనుభవించారు. పోలీసు చర్యానంతరం సహాయ చర్యల్లో పాల్గొన్నారు. రెస్క్యూ వర్క్ ఆర్గనైజేషన్‌లో సభ్యురాలిగా ఉంటూ స్త్రీలకెంతో తోడ్పడ్డారు. 'దళిత జాతీయ సంఘా'న్ని ఏర్పాటు చేశారు. కార్యదర్శిగా పనిచేశారు.



1951లో కాంగ్రెస్ తరపున హైదరాబాద్ నగరపాలక సంఘానికి ఎన్నికయ్యారు. 1954లో ఆ సంఘానికి ఉపాధ్యక్షులయ్యారు. గృహ నిర్మాణ, పరిశ్రమల సలహా సంఘం, జిల్లా అభివృద్ధి సంఘం, వెనుకబడిన తరగతుల సంస్థ, ఇండియన్ కాన్ఫరెన్స్ ఆఫ్ సోషల్ సర్వీస్ మొదలైన సంస్థల్లో సభ్యురాలిగా కృషి చేసారు

"తెలంగాణలో ఆమెకు హరిజన నాయకురాలని పేరు. పెద్దలు పెట్టిన పేరు సుమిత్రాదేవి. అగ్రమహిళ అయిన సరోజిని నాయుడు దగ్గర్నుంచి గడ్డిమోపులమ్ముకునే పొన్నమ్మ వరకూ సుమిత్రాదేవి గారి పరిచయ వర్గములోని వారే. అందరికీ తెలిసిన సుమిత్రాదేవి గారు అందరి తలలోని నాలుక. స్త్రీ పురుష భేదము లేకుండా అందరికీ అక్కా-చెల్లెలూ" అని ఒకప్పటి రచయిత్రి, శాసనమండలి సభ్యురాలు ఇల్లిందల సరస్వతీదేవి పేర్కొన్నారు.

పోరాటం, సంఘసేవ రెండూ ఆమెకు రెండు కళ్ల లాంటివి. 1953లో రెడ్డి మహిళా కళాశాల ప్రారంభ సమయంలో అక్కడున్న దళిత కుటుంబాలందరికీ పునరావాసం కల్పించే వరకు శంకుస్థాపన చేయనివ్వకుండా ధర్నాకు దిగారు. ఈ కళాశాలకు శంకుస్థాపన చేసేందుకు నెహ్రూ వచ్చారు. అంతకంటే ముందు నుంచే ఈ స్థలంలో ఉన్న 50 మంది దళిత కుటుంబాల్ని ఖాళీ చేయించేందుకు అప్పటి కలెక్టర్ అన్ని విధాల ప్రయత్నం చేసిండు. బాధితుల పక్షాన నిలబడ్డ సుమిత్రాదేవి తాను కూడా కాంగ్రెస్ వాదినే అయినా దళితులను బేదఖల్ చేయడం కుదరదంటూ ఆ స్థలాన్ని ఖాళీచేసే సమస్యే లేదంటూ ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న అప్పటి మేయర్ మాడపాటి హనుమంతరావు స్వయంగా సుమిత్రాదేవి ఇంటికి వచ్చి ఆస్థలాన్ని ఖాళీ చేయవలసిందిగా విజ్ఞప్తి చేశాడు. అయితే అక్కడ స్థలాన్ని కోల్పోతున్న 50 కుటుంబాలకు పునరావాసం కల్పించేవరకు ఖాళీ చేయబోమంటూ ఆయనకు కూడా తేల్చి చెప్పింది. చివరికి అప్పటి కప్పుడే దళితులకు కళాశాల వెనుక వైపున ఖాళీ స్థలంలో పునరావాసం కల్పిస్తూ చర్యలు తీసుకోవడం జరిగింది. దీంతో శంకుస్థాపన సజావుగా జరిగింది. ఎన్ని కష్టాలెదురైనా పేదల పక్షపాతిగా ఉండడం ఆమె నైజం.

ప్రభుత్వంతో పోరాటం చేసి దళితులకు న్యాయం జరిగే వరకు వదల్లేదు. రాజేంద్రనగర్, హయత్‌నగర్, రాజేంద్రనగర్, మేడ్చల్ సమితుల్లో దళితులకు ఇళ్లు కట్టించివ్వడమే గాకుండా

వాటికి విద్యుచ్ఛక్తి లాంటి సౌకర్యాలు కల్పించేవరకు అధికారులను పరుగులు పెట్టించారు. రాజేంద్రనగర్‌లో 500ల మంది దళిత కుటుంబాలకు ఇండ్లు కట్టించి ఇచ్చారు. అలాగే మంచినీటి కొరత తీర్చేందుకు ఆ కాలంలోనే హైదరాబాద్ జిల్లాలో 60 బావులు, చెరువులు తవ్వించి నీటి కరువునుంచి ప్రజలకు విముక్తి కలిగించారు. అలాగే ఉప్పల్‌లో ఆ కాలంలోనే చర్మకార పరిశ్రమల్లో శిక్షణ ఇప్పించారు. పెద్ద ఉప్పల్‌లో 'బాపూజీ సేవాసదన్' పేరిట అనాథశ్రమాన్ని స్థాపించారు. ఉప్పు అన్నోజిగూడా పరిసర ప్రాంతాల్లో సహకార వ్యవసాయాన్ని 12 గ్రామాల్లో, 2000ల ఎకరాల్లో అమలు చేసి ఔరా అనిపించారు.

1951లో కాంగ్రెస్ టికెట్‌పై హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. 1953లో వెనుకబడిన తరగతుల వారికోసం వేసిన సలహా మండలి సభ్యురాలిగా ఉన్నారు. 1955లో జూబ్లిహిల్స్ ద్విసభ్య నియోజక వర్గం నుంచి హైదరాబాద్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. నిరంతరాయంగా 1981 వరకు ఆమె శాసనభ సభ్యురాలిగా ఉన్నారు. ఈ కాలంలో హైదరాబాద్ తూర్పు, మేడ్చల్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ ప్రతినిధిగా గెలుపొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యురాలిగా (1959)లో నియమితులయ్యారు.

దళిత, బహుజన అనాథ బాలికల కోసం బాపూజీ సేవా సదన్ పేరిట ఒక హాస్టల్‌ని 1960లో ఏర్పాటు చేశారు. 1961లో హైదరాబాద్ తూర్పు నియోజక వర్గం నుంచి, తిరిగి 1967లో మేడ్చల్ నియోజక వర్గం, నుంచి శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యారు. వరుసగా 25 యేండ్ల పాటు ఒక మహిళ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం చాలా అరుదు. ఆ ఖ్యాతి సుమిత్రాదేవికి దక్కింది. హైదరాబాద్ దళిత మహిళా చైతన్యానికి ఆమె నిదర్శనం. ఎదుటి వారు ఎంతటి వారైనా తప్పుచేస్తే నిలదీయడం ఆమె నైజం.

“నా కెక్కువ చదువురాదు. కాని దళిత జాతుల పిల్లల కందరికి విద్య రావాలని నా ఆకాంక్ష” అంటారు సుమిత్రాదేవిగారు దళిత వర్గాలలోని స్త్రీ జనాభ్యుదయానికై ఈమె 1960లో హైదరాబాద్ సమీపంలో ఉన్న ఉప్పల గ్రామంలో బాపూజీ సేవాసదనాన్ని స్థాపించారు. అప్పటి ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్యగారు దానికి ప్రారంభోత్సవము చేశారు. ఆ సేవాసదనంలో 30 మంది స్త్రీలు, బాలికలూ అన్ని జాతుల వారు చేతి పనులలో శిక్షణ పొందుతున్నారు. కొందరు బాలికలు ఆ సమీపంలో ఉన్న పాఠశాలకు వెళ్ళి విద్యాభ్యాసం చేస్తున్నారు.

ఈ సంస్థలో ఆర్యసమాజ పద్ధతి ననుసరించి ప్రార్థన, ఉదయ సంధ్య, కవాత్, డంబెల్స్, కర్రసాము మొదలైన కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయి. రాజకీయ బాధితురాలిగా తనకు ప్రభుత్వమిచ్చిన పది ఎకరాల భూమినీ సుమిత్రాదేవి గారు ఈ సంస్థకు విరాళమిచ్చారు. దీనికి ప్రభుత్వ భవన మొకటి కవులుకు తీసుకున్నారు. ఆ గడువులోపల పెద్ద భవనాన్ని నిర్మానం చేయాలని ఆమె ఆకాంక్ష” అని ఇల్లిందల సరస్వతీదేవి 'తేజోమూర్తులు' పుస్తకంలో సుమిత్రాదేవి గురించి రాశారు.

*దళిత, బహుజన అనాథ బాలికల కోసం బాపూజీ సేవా సదన్ పేరిట ఒక హాస్టల్‌ని 1960లో ఏర్పాటు చేశారు. 1961లో హైదరాబాద్ తూర్పు నియోజక వర్గం నుంచి, తిరిగి 1967లో మేడ్చల్ నియోజక వర్గం, నుంచి శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యారు. వరుసగా 25 యేండ్ల పాటు ఒక మహిళ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం చాలా అరుదు. ఆ ఖ్యాతి సుమిత్రాదేవికి దక్కింది. హైదరాబాద్ దళిత మహిళా చైతన్యానికి ఆమె నిదర్శనం. ఎదుటి వారు ఎంతటి వారైనా తప్పుచేస్తే నిలదీయడం ఆమె నైజం.*

సుమిత్రాదేవి శక్తి, సామర్థ్యాలు గుర్తించి అప్పటి రాష్ట్ర గవర్నర్ భీమ్‌సేన్ సచార్ ఈమెను ఉస్మానియా విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యురాలిగా నియమించారు. తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యురాలిగా ఆ దేవస్థానం వారు ఢిల్లీలో నడుపుతున్న కళాశాల కమిటీ సభ్యురాలిగా ఉంటూ ఆ కళాశాల అభ్యున్నతికి కృషి చేశారు. తాను ఏ కమిటీలో ఉన్నా అందులో చర్చించబోయే అంశాలను క్షుణ్ణంగా ఆకలింపు చేసుకొని అందరికీ న్యాయం జరిగే విధంగా ఆమె కృషి చేసేది.

ఆమె అసెంబ్లీలో ఏనాడు “పోనీలే” అని మంత్రులను వదిలేది కాదు. తాను వేసిన ప్రశ్నకు తగిన జవాబు వచ్చేవరకు విషయాన్ని విడిచి పేట్టేది కాదు. ఒకసారి అసెంబ్లీలో రెవెన్యూ మంత్రిగా కళా వెంకటరావు తెలంగాణ – ఆంధ్ర ఉభయ ప్రాంతాల భూములకు సంబంధించిన చట్టాలను సమన్వయ పరచటానిక సవరణ బిల్లు ప్రవేశపెట్టారు.

సభ్యులు ఒకరి తర్వాత ఒకరు ప్రసంగించారు. ఇక ప్రసంగాలు అయిపోవస్తున్నాయనుకున్న సమయంలో తెలంగాణ భూముల గురించి పూర్తిగా అధ్యయనం చేయడమే గాకుండా, వివరాలు తెలిసిన సుమిత్రాదేవి ప్రసంగించారు.

ఈమె తన ప్రసంగంలో “బంజరు భూమి, పోరంబోకు, పేరెకుంట, పేరెనాలా, రాగాల్ ఖాన్ – ఈ విధంగా తెలంగాణలో ఎన్ని రకాల భూములు ఉన్నాయో వాటిని ఎట్లా వర్గీకరిస్తారో తేల్చి చెప్పాలని డిమాండ్ చేసింద్రు.

అంతకు ముందు ఆడవాళ్లకు ఏమి తెలుస్తుందిలే అని లైట్ తీసుకున్న వెంకటరావు ఆమె ప్రసంగం విన్న తర్వాత బిల్లులో సవరణలు చేశాడు. ఆ తర్వాతి కాలంలో భూములకు సంబంధించిన ఏ సందర్భం వచ్చినా వెంకటరావు సుమిత్రాదేవిని తప్పకుండా సంప్రదించేవారు. శాసనసభలో ఎంతటి వారినైనా నిలదీసి మాట్లాడే సుమిత్రాదేవి 1981లో చనిపోయారు.

– సంగిశెట్టి శ్రీనివాస్,
మొబైల్: 98492 20321
మెయిల్: sangishettysrinivas@gmail.com

# భారతీయ తొలిటాకీ ఆలం ఆరా నాయిక మన జుబేదాబేగం

భారతీయ సినిమా చరిత్ర తొలినాళ్లను పరిశీలించినపుడు హైదరాబాద్ స్టేట్ ప్రాంతమంతా కూడా బొంబాయి రీజియన్ పరిధిలో ఉండింది. పైగా, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఉన్న సైనికాధికారులకు బొంబాయి, కలకత్తాలతో సంబంధాలు ఉండేవి. అందుకే, తొలి మూవీ కెమెరా కలకత్తా నుండి హైదరాబాద్‌కు 1910లో వచ్చింది. హిందీ, ఉర్దూలకు ఉన్న భాషా సన్నిహితం వల్ల, మహారాష్ట్ర సంస్కృతిక ప్రభావం వల్ల బొంబాయి సినిమా రంగం హైదరాబాద్‌ను ఆకర్షించింది. ఫలితంగా మూకీల కాలం లోనే 1927లో హైదరాబాద్ పాత నగరంలోని నాగులచింతకు చెందిన రామ్‌ప్యారీ అనే నర్తకి బొంబాయి వెళ్ళి మూకీ చిత్రాల్లో నటించిన విషయం దాదాపుగా ఎవరికీ తెలియదు. ఆ తర్వాతనే 1929లో మన పైడి జయరాజు బొంబాయి వెళ్ళాడు. ఇక 1931లో మాట్లాడే సినిమాలు వచ్చిన తర్వాత తొలి టాకీ చిత్రం 'ఆలం ఆరా' (1931) కథానాయిక మన హైదరాబాదీనే. ఆమెనే జుబేదా బేగం.

ఇంతకీ ఈ జుబేదాబేగంకీ మన హైదరాబాద్‌కు ఏమిటి సంబంధం అనే అనుమానం కలుగవచ్చు ఎవరికైనా. అది తెలుసుకునే ముందు ఈ క్రింది విషయాలు చదవాలి. జుబేదాబేగం బాంబే ప్రెసిడెన్సీలోని సూరత్‌లో 1911లో జన్మించారు. తండ్రి సాచిన్ మూడవ నవాబు సిద్ది ఇబ్రాహీం యాఖూత్ ఖాన్. తల్లి ఫాతిమాబేగం. ఈమె ఆ కాలంలోనే సాంప్రదాయ ముస్లిం కుటుంబంలో పుట్టినా, విద్యావంతురాలిగా కళల అభిమానిగా పేరు తెచ్చుకున్నారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. వారిలో పెద్దకుమార్తెనే మన జుబేదా బేగం. ఫాతిమా బేగం ఆకాలంలోనే సినిమాల్లోకి ప్రవేశించారు. 1922లో "వీర్ అభిమన్యు" మూకీలో తొలిసారిగా నటించిన ఆమె ఆ తరువాత పలు మూకీల్లో నటించి మరికొన్నింటికి దర్శకత్వం నెరిపారు.

ఫాతిమాబేగం తన కుమార్తె జుబేదాను సినిమాల్లో నటించడానికి ప్రోత్సహించింది. 1924లో "గులేబకావళి" మూకీ చిత్రం ద్వారా సినిమా రంగంలోకి ప్రవేశించింది జుబేదాబేగం. మూకీల కాలం లోనే ఆమె సూపర్‌స్టార్‌గా ఎదిగింది. 1913–1933 మధ్య కాలంలో కొనసాగిన మూకీల సమయంలో 37 మూకీల్లో నటించారామె. వాటిలో కాలనాగ్, మనోరమ, పృథ్వీవల్లభ్, కల్యాణ్ ఖజీనా (1924), దేవదాసి, దేశ్‌కా దుష్మన్, రానవగడ్, రంభ ఆఫ్ రాజ్‌నగర్, ది డివైన్ పనిష్మెంట్, బ్లాక్‌థీవ్, ఇంద్రసభ (1925), సల్‌మీనా దేవి, అబోలా రాణి, బుల్‌బులే ఫరిష్తా, కాశ్మీరా, మ్యాన్ అండ్ హిజ్ డెస్టిని, మిస్సింగ్ బ్రాసిలైట్, సతీ మహాదేవి (1926), సాక్రిఫైజ్, లైలామజ్ను, ననంద భోజై (1927), హీర్ రాంజా, ఎంపరర్ అశోక్, చమక్తీ చందా, గోల్డెన్‌గ్యాంగ్ (1928), కనక్‌తార, మిలన్ దినార్, యంగ్‌ఇండియా, మహాసుందర్, వండ్రఫుల్ ప్రిన్స్ (1929), ఫాలాఫ్ ఫ్రైడ్, నూర్ ఏ పంజాబ్, దేవదాసి, లవ్ ఏంజిల్, వీర్ రాజ్‌పుత్ (1930), ఐ ఫర్ యాన్ ఐ, వేజెస్ ఆఫ్ సిన్, లాండ్ ఆఫ్ పిరమిడ్స్, అండర్ వరల్డ్, రొమాంటిక్ ప్రిన్స్ తదితర మూకీలు కొన్ని.



భారతదేశంలో మూకీల శకం అంతరించి టాకీలు వచ్చాయి. 1931లో అర్దేషిర్ ఇరానీ తొలి భారతీయ టాకీ "ఆలంఆరా" తీయాలనుకున్నప్పుడు 'అలాంఆరాగా' ప్రధానమైన పాత్రకోసం ఇరానీ జుబేదాను ఎంపిక చేశారు. అలా తొలిటాకీ నాయికగా జుబేదా భారతీయ సినిమా చరిత్ర కెక్కారు. ఆలాంఆరా తరువాత జుబేదా మేరీ జాన్, వీర్ అభిమన్యు (1931), జరీనా, బుల్ బులే పంజాబ్, (1932), బుల్ బులే పంజాబ్, మహాభారత్, పాండవ్, కౌరవ్, ది అన్‌టచబుల్, మహాభారత్ పాండవ్ కౌరవ్ (1933), గుల్ సనోబార్, ననంద్ బోజై, నంద్ కే లాలా, సేవా సదన్, బీర్బల్ కే బేటి (1934), గుల్షన్–ఏ– ఆలం (1935), మా (1936), ఔరత్ కి జిందగి, దేవదాస్, కిస్‌కి ప్యార్ (1931) వంటి టాకీలలో నటించారు. ఆమె నటించిన చివరి చిత్రం నిర్దోష్ అబల (1949).





జుబేదాకి హైదరాబాద్‌కున్న సంబంధమేటంటే ఆమె ఇక్కడి మహారాజ్ నర్సింగ్ ధన్‌రాజ్‌గిర్‌ని ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. పెళ్ళి తరువాత కూడా ఆమె నటించడం కొనసాగించారు. 1934లో నానూబాయ్ వకీల్‌తో కలిసి 'మహాలక్ష్మి సినీటోన్' అనే సంస్థను నెలకొల్పి పలు సినిమాలు నిర్మించారు.

1934, 1935 సంవత్సరాల్లో ఆమె నటించిన చిత్రాలన్ని మహాలక్ష్మి బ్యానర్‌వే. 1930–40 దశకంల వచ్చిన మూకీ, టాకీలలో హీరో జాల్ మెర్చంట్‌తో కలిసి చాలా మటుకు పౌరాణిక చిత్రాల్లో సుభద్ర, ఉత్తర, ద్రౌపది పాత్రలకు జుబేదా పెట్టింది పేరు. పృథ్వీరాజ్ కపూర్, మాస్టర్ విఠల్ వంటి తొలితరం అగ్రశ్రేణి హీరోలతో గాయక నటిగా, నృత్య తారగా జుబేదా ఒక వెలుగు వెలిగింది.

ఆమెఉర్దూలో అద్భుతమైన సంభాషణలు పలకడంలో గొప్ప నేర్పును ప్రదర్శించేది. ఇంకా, చారిత్రక సాంప్రదాయ దుస్తుల్లో ఇమిడి పోవడంలో ఆమెను తప్ప మరొకరిని ఆ రోజుల్లో ఊహించే వారు కాదు. ఇదే పరంపరను ఆ తర్వాత విషాద నాయకిగా పేరు పొందిన మీనాకుమారి కొనసాగించింది. 1949 వరకు ఏటా కనీసం రెండు చిత్రాల్లో నటించిన జుబేదా బొంబాయిలోని ధన్‌రాజ్ మహల్ ప్యాలెస్‌లో తన చివరి రోజులను గడుపుతూ 1988 సెప్టెంబరు 20న మరణించారు.

– హెచ్.రమేష్‌బాబు,
మొబైల్: 94409 25814
మెయిల్ : hrameshbabu5@gmail.com

ద

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA & FAU Hyderabad)
6-3-248/1/1A, 2nd Floor, Bhaskar Plaza, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Telangana, India
Ph : 040-66105270, 9703372442, 9703277053, E-mail : jbrarchitecture@gmail.com, www.jbrarchitecture.com

# “పొందికగ రంగురాళ్ళు పొదిగిన పోంచీ”

తెలంగాణ వర్తమాన సాహిత్యానికి ప్రాంతీయ అస్థిత్వ స్పృహ ఒక అనివార్యత. ఎవరికి వారుగా వారివారి ప్రాంతాల ప్రత్యేకతలను, భౌగోళిక స్థితిగతులైన చెట్టు చేమలు, వాగులు వంకలు, చెరువులు కుంటలు, మత్తల్లను, భూమి పొత్తిల్లను, చెట్టులాంటి మనుషులను, మనుషులను భరించే మన్నును, ఊరును, ప్రతి వాడను, వాడవాడల్లో మాట్లాడుకునే పలుకుల తళుకుబెలుకులను పొందుపరచవలసిన బాధ్యత ఎంతగానో వుంది. ఇది తెలంగాణ సాహిత్య పునర్‌నిర్మాణానికి, పురోగతికి ఎంతైనా అవసరం.

కవి కూకట్ల తిరుపతి కవిత్వం మ్యాకమర్కలు మంగతుప్ప మీద ముందటి కాళ్ళు రెండుసాపి, ఎనక కాళ్లమీదుండి నాల్కెతోటి మంగకాలయు అందుకొని తిన్నంత సహజం. చెలుకల్లో తొలకరికి పలుకరించిన మట్టిముద్ద, ముర్కశిల ఎల్లుదలకు పుట్టిన ఆరుద్ర పురుగు, బురుబర పండిన బురుబుచ్చ సితపల్క పండు, పిరికెడు వడ్లకు పిరికెడు బియ్య మయ్యే ఎర్రగాలు దినుసంత నియ్యతి. దీ అంటే దీ అని పోట్లాడేంత పోటేళ్ల దుమ్ము, నిజానిజాలను నిమానిమలు జోకే తరాజు, అన్న తమ్మీ అని నోటినిండ పిలుసుకునే కలుపుగోలు తనం.




కూకట్ల కవిత్వంలో నిర్భయత్వం, ఆత్మగౌరవం, వాస్తవ బతుకుచిత్రణ, అధిపత్య వ్యతిరేక భావజాలం, బహుజన దృక్పథం కనిపిస్తది. “నేనాచరించిన నీతులు బోధించి / రాని రాగం తీయలేను నేను” అని మహాకవి జాషువాగారు అన్నట్లు. కూకట్ల తిరుపతి తను అనుభవించిన, చూసిన గొల్లకురుమల బతుకులోనుండి తనదైన గొంతును వినిపిస్తున్నడు. ఆ వినిపించే పద్ధతిలో అముడాల మేక పిల్లలలాంటి భాషను, యాసను నిండారుగా ఒప్పుకున్నడు.

పేగు సవందాన్ని పోగొట్టుకున్నందుకు తల్పుక, తల్పుక దుక్కశీలుడు మనకు ‘పేగు సవందం’ కవిత తెలగొలుజేత్తది. తనకు ఓ కనుపా బిడ్డ, ఇంకొ కనుపాప కొడుకు. కాని ఇప్పుడు ఆ బిడ్డ అనే కనుపాప లేనందున ఒంటి కన్నోన్నే అయితిని అంటడు. ఆ రందిల తనది సగపానం అంటడు. ‘జల్మరందిల నా సగపానం / దుక్కపు చేర్వు కంటెకెడు తూములు / బెత్తను చీరిన బర్రె పేరిమి / తెగిన పేరు సవందానికి తండ్లాడుతది’ అంటూ మనకు కన్నీళ్ళను తెప్పిస్తడు.

ఇగవోతె ప్రేమ సవందమైన తన తాతను, నాయినవ్వ లచ్చవ్వను తల్చుకుంటడు. మా తాతయాదిలో, ఆచారమంతురాలు అనే రెండు కవితలు ముందు వెట్టుకుంటె వారితో అతనికున్న అనుబంధం బయిట పడ్తది.

**నల్ల సరం బండొల్లె బల్ల పరుపు పెయ్యి**
**మొగురం మోలె అడ్డం పొడుగు**
**బొత్తిలకు బోల్లకోరుతనపు బోలు గడియాలు**
**మురిపెంగ ముచ్చట వెట్టె ముంజేతి కడియాలు**
**పొందికగ రంగురాల్లు పొదిగిన పోంచీ**
**మొకం కొట్టచ్చినట్టుండే కొనక పోగు**
**కడేసిన కర్రె గొంగడి...**

(మా తాత యాదిలో.. పుట2 ఆరుద్రపురుగు)

నాల్గు జీవాలను ఎంటేసుకొని, గొడ్డలిసిత్ప భుజాన వెట్టుకొని పోతే ‘రాజు వెడలె రవి తేజములలరగ.. అని దరువు అందుకున్నట్టె. ఊల్లే పెద్దోనికైనా, చిన్నోనికైనా సందియ్యని తనం, జీవితమంతా జీవాల తోటే/ పందిర తీగలెకక అల్లుకపోయిన బతుకు అని తన తాత రూపరేఖలను, గుణగణాలను మన కండ్ల ముందట వుంచుతడు.

అట్లాగే కూకట్ల తన తాతతో పాటు నాయినవ్వ లచ్చవ్వను శివసత్తిగా తాను వుండే విధానాన్ని చెప్పుకుంటవోతూ మూఢనమ్మకాలను తిరస్కరించే కోణంలో తనకవిత కున్న మెత్తదనతోపాటు, గట్టిదనాన్ని కింది విధంగా చమత్కరించిండు.

**దేవుడ పూనిండట**
**కుడికాలుకు జోడు బేడీలు జోగులాడేది**
**ధారమని బుదరకిచ్చిన రాయేశుడు**
**మెడలో లింగంకాయయి ఊగులాగేటోడు**
**ఆచారమంతురాలు** – పుట 16 ఆరుద్రపురుగు

తెలంగాణ జానపద పండుగలల్ల గొల్లకురుములకు సట్టిబోనాలు, మల్లన్న పట్నాలు ప్రత్యేకమైనవి. కవి చెప్పినట్టుగానే ఎన్నటికెల్లవున్న ఆచారం, పొలమరాజుల పండుగు, మల్లన్న పట్నాలు. ఈ రెండు కవితలు పొలమరాజులపండుగు, శరణు మల్లన్న కవితలకు వుండే కవితాధార ఒగ్గుకళాకారుడు రాగమందు

కున్నట్టు ఎడతెగకుంట ఉంటుంది. ఈ పొలమరాజులపండుగలో బ్రహ్మణాధిపత్యం వుండదు. పండుగ వాళ్ళదే, పుజారులు వాళ్ళే. ఇగ పండుగ జరిగే విధానం జూత్తే సంకురాతిరిపండుగ ముందటి నెలను సట్టిమాసంగా పిలుస్తరు. దీనినే సట్టివారాలు పట్టుడు, లింగాలకువెట్టుడు అని కూడా అంటరు. ఈ నెల్లాల్లు ఇంట్ల నీసు కౌసు వుండదు. ఇంట్లకెల్లి ఏ వస్తువును సేపోయి ఇచ్చుడు వండుడు. గొర్లకాపరులు ఒక్క పొద్దులు వంటి రాత్రి పగల్లు మందలకాన్నె మకాం పెడుతరు. బొత్తిలకు ఇంటి మొకం చూడరు. పొద్దుమాపు అక్కడికే సద్ది తెప్పిచ్చుకొని తింటరు. ఏదో ఒక ఆదివారంనాడు శివునికి సట్టిబోనం జేత్తరు. ఆరోజు ఎగలివారంగ లేచి తలపెయ్యి కడుక్కొని, కుమ్మరన్న ఇంటికివోయి గొంగడి కొప్పెర వెట్టుకొని కొత్తకుండలు పట్టుకొని ఊరి పడమటి పొలుమార్లకు ఆ ఎగిలి వారకే చేరుకుంటరు. పుట్టమీది తంగెడు చెట్టుకాడా అలుకుపూతలు జేసి, తెల్లముగ్గు, పచ్చముగ్గు కర్రలతో సింగారిస్తరు. పట్టు (పచ్చి) పొలల్ల పాశం వండి, బోనం కుండను ముద్దుగ పూదిచ్చి, పల్లువెట్టి లింగాలకు బోనం చెల్లిస్తూ మంద ఎచ్చాలని పబ్బతి పడుతరు. ఇగవోతే మల్లన్న పట్నాలు ఐదేండ్లకోసారి వుంటయి. ఇదికూడా వీరశైవ సంప్రదాయాన్ని ప్రతిబింబించే పండుగనే. ఈ పండుగకు అందానిచేచది బంతిపువ్వే. బంతిపువ్వు లేకుండ పండుగుండదు. పట్నాలు ఏసే ఒగ్గుకళాకారులను గొల్లకురుమలు ఆడిబిడ్డగా భావిస్తరు. వీరు కొంరెల్లి మల్లన్న కథ జెప్తరు. ఈ కథనిండా వీరశైవ సంప్రదాయం, కులరహిత సమాజ భావన, పంచముని ఇంటికి మల్లనన పోయే ఘట్టం కూడా వుంటది. ఈకథలో మల్లన్న పెండ్లి జరిగేటప్పుడు ఇంటి యజమాని, యజమానురాలు పెండ్లి జేసుకుంటరు. ఇలా అనాదిగా వస్తున్న ఆచారాన్ని కవి ఈ రెండు కవితల్లో పరిచయం చేసిండు.

కవి తన కవిత్వంలో ఊరును, పాడవువడ్డ ఎవుసాన్ని, నీళ్ళు లేక అరిగోసవడుతున్న జనాన్ని మరువలేదు. విధ్వంసం అవుతున్న గుట్టలకు (జిలాల గుట్ట) తన శివారులోని 'బుగ్గదాం ఒర్రె'ను కవిత్వీకరించిండు. ఒక్క చెరువును గురించిన కవిత చదివితే మళ్లీ మనం పల్లెల్లో సంచరించి చెరువు జ్ఞాపకాలతో తడ్సి ముద్ద కావల్సిందే చూద్దాం ఎలిమి కవితను-

**కాటికి బైలెల్లిన దుక్కం**
**కట్టగొమ్ము కడుపుల దాసుకుంటది**
**గొర్రె మ్యాకకు ఆసరా**
**గొడ్డు గోదకు దూప బుడ్డీ**
**నక్కి నక్కి దాగే సుక్క కోళ్ళు కొంగలు,**
**కర్రె పిట్టలు, పుల్లకోళ్ళు**
**అరొక్క వలస పచ్చులకు అవ్వ**
**కొడిపెలు, కొర్రెమట్టలు, సందమామలు**
**బొమ్మెలు, బొచ్చెలు, మార్పులు, జెల్లలు**
**తీరొక్క నీటి పువ్వుల తల్లి**

పుట 74- ఆరుద్ర పురుగు

**పుట్టమీది తంగెడు చెట్టుకాడా అలుకుపూతలు జేసి, తెల్లముగ్గు, పచ్చముగ్గు కర్రలతో సింగారిస్తరు. పట్టు (పచ్చి) పొలల్ల పాశం వండి, బోనం కుండను ముద్దుగ పూదిచ్చి, పల్లువెట్టి లింగాలకు బోనం చెల్లిస్తూ మంద ఎచ్చాలని పబ్బతి పడుతరు. ఇగవోతే మల్లన్న పట్నాలు ఐదేండ్లకోసారి వుంటయి. ఇదికూడా వీరశైవ సంప్రదాయాన్ని ప్రతిబింబించే పండుగనే. ఈ పండుగకు అందానిచేచది బంతిపువ్వే. బంతిపువ్వు లేకుండ పండుగుండదు. పట్నాలు ఏసే ఒగ్గుకళాకారులను గొల్లకురుమలు ఆడిబిడ్డగా భావిస్తరు. వీరు కొంరెల్లి మల్లన్న కథ జెప్తరు. ఈ కథనిండా వీరశైవ సంప్రదాయం, కులరహిత సమాజ భావన, పంచముని ఇంటికి మల్లనన పోయే ఘట్టం కూడా వుంటది. ఈకథలో మల్లన్న పెండ్లి జరిగేటప్పుడు ఇంటి యజమాని, యజమానురాలు పెండ్లి జేసుకుంటరు. ఇలా అనాదిగా వస్తున్న ఆచారాన్ని కవి ఈ రెండు కవితల్లో పరిచయం చేసిండు.**

కూకట్ల తిరుపతి తన కవిత్వం ద్వారా ప్రజలను మేలుకొలుపుతూనే, సామాజిక ఉద్యమాల తీరు తెన్నులను జూసి ప్రజల తరుపున తన గొంతును వినిపిస్తూ నాల్గుకోట్ల తెలంగాణీయుల సామూహికమైన కలగంటున్నడు.

**సర్ర సర్ర ఉరికి సంద్రాన కలిసే నదులు**
**చిక్కటి కండకల్గి కాళ్ళకు బంకోలె పడితే**
**రైతు కండ్ల కద్దుకునే నల్లరేగల్ల**
**తెల్ల బంగరు పువ్వులు పూయాలనీ**
**దుబ్బ సెల్కలు నిద్దుర మబ్బు వదిలి**
**అరొక్క దినుసు అంకురం తొడగాలనీ**
**పిడుస గట్టిన నాలుకల తండ్లాట**
**ఎన్నటికెల్లున్న యెతలు పాపుటకు**
**గుక్కెడు నీళ్ళకోసం**
**నేను కలగంటున్నా**
**-నేను కలగంటున్నా!**
**-నేను కలగంటున్నా!** పుట:- 111 (ఆరుద్ర పురుగు)

"మాండలికాలే భాషకు జవం జీవం" అని తెలంగాణ పదబంధకోశ రూపకర్త, బహుభాషావేత్త డా॥ నలిమెల భాస్కర్‌గారు అన్నట్లు పొదన, ఎవుసం, మత్పరిచ్చుడు, మల్యం కుచ్చెలకు కుచ్చెలు, నివ్వద్దె, ఎడ్రాలు, ఎర్రగాలు, కొట్టె, పబ్బతి అయిటి మూనుడు మొ॥ మాండలిక పదాలు కూకట్ల తిరుపతి కవిత్వానికి మరింత వన్నెను తెచ్చిపెట్టినై. డా॥ బి.ఆర్.అంబేద్కర్ మహనీయుడు చెప్పినట్లు ఎవల చరిత్రను వాల్లు లిఖించుకోవాలన్న పంథాను అనుసరిస్తున్న కవి కూకట్ల తిరుపతి అభినందనీయుడు.

-నాగిళ్ళ రమేష్
తులనాత్మక అధ్యయన పరిశోధక విద్యార్థి
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
సెల్: 7382744824

ద

# భారతదేశం ఒక అద్భుత వారసత్వం



మనం స్వేచ్ఛా వాయువులను పీల్చుకునేందుకు
తమ జీవితాలను త్యాగం చేసిన మహానుభావులను
స్మరించుకుందాం. దేశాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు
మనం ఐకమత్యంతో ఉండటం ఎంతో కీలకం.

**-నరేంద్ర మోదీ**

**ఆగస్టు 15, 1947**న దాస్య శృంఖలాల నుండి విముక్తి పొందిన స్వతంత్ర భారతానికి నేటితో **70** ఏళ్ళు. మనకు స్వతంత్రాన్ని సాధించి పెట్టిన ఎందరో త్యాగమూర్తులందించిన మహోజ్జ్వల వారసత్వాన్ని గౌరవించుకుందాం.

రండి, ఈ జాతీయ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని మన దేశభక్తిని చాటుదాం.
మన చైతన్యవంతమైన యువ భారత సమైక్య స్ఫూర్తిని ప్రతిబింబించే దేశ బహుళత్వాన్ని, వైవిధ్యాన్ని దశదిశలా చాటనివ్వండి.

**దేశవ్యాప్త కార్యక్రమాలు**

- స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రముఖ జిల్లా కేంద్రాలలో కొవ్వొత్తులతో మువ్వన్నెల జెండా యాత్రలు.
- స్వాతంత్ర పోరాట అమరవీరుల స్మారక స్థలాలను, చారిత్రక ప్రసిద్ధి కలిగిన క్షేత్రాలను మంత్రులు, ప్రజాప్రతినిధులు సందర్శిస్తారు.
- స్వాతంత్ర్య సమరయోధులు, ఐఎన్ఏ వీరులు, అమరవీరుల కుటుంబ సభ్యులకు సన్మానం
- చేనేత వస్త్రాలు, ఖాదీ ఉత్పత్తులు, స్థానిక చేతివృత్తి నిపుణుల ఉత్పత్తులపై ఎగ్జిబిషన్
- స్వాతంత్ర్య సంగ్రామంపై సాంస్కృతిక కార్యక్రమాలు
- గ్రామీణ క్రీడలు, ఆటలు, నాటకాలు
- గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీలలో స్వాతంత్ర్య దినోత్సవ పరుగులు

R.O.Code: 22202/13/0020/1617
Dt:16.08.2016

**సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ**

భారత ప్రభుత్వం

***స్వాతంత్ర్యం 70 సంవత్సరాలు - త్యాగమూర్తులను స్మరించుకుందాం***



పుస్తకం: నిజామాబాదు జిల్లా కవిత్వం
రచన: డాక్టర్ వి.శంకర్
వెల: రూ. 150/-
ప్రచురణ: తెలంగాణ రచయితల సంఘం
ప్రతులకు : హిరణ్మయి, 4-15, దేవీవిహార్ కాలనీ, దేవునిపల్లి, కామారెడ్డి. ఫోన్: 9440798954




పుస్తకం: లొంగిన ప్రతిసారీ
కవి: పచ్చల కిరణ్‌కుమార్
వెల: రూ. 50/-
ప్రచురణ: విరసం
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో




పుస్తకం: కడలి కల్లోలం
నవలా రచన: గనారా
వెల: రూ. 125/-
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్, 27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ, ఫోన్: 0866-2577533




పుస్తకం: స్వర్ణపుష్పాలు
రచన: అలపర్తి వెంకట సుబ్బారావు
వెల: రూ. 35/-
ప్రచురణ: మంచిపుస్తకం
ప్రతులకు : 12-13-439, వీధి నం.1, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9490746614




ఆటాడుకుందాం... రా! (హొసూరు కతలు)
రచన: అగరం వసంత్
వెల: రూ.150/-
ప్రతులకు: కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం, 2/1097, బస్తి, ఆవులపల్లి రోడ్డు హొసూరు-635109, కృష్ణగిరిజిల్లా, తమిళనాడు
ఫోన్: 09488330209




జీవరహస్య లిపి
కవి: ఖాదర్ షరీఫ్
సంపాదకులు: అల్లు భాస్కరరెడ్డి, పెరుగు రామకృష్ణ
వెల: రూ.100/-
ప్రతులకు: 25-1-949, ఐదో వీధి, నేతాజీ నగర్, నెల్లూరు-4.
ఫోన్: 9441938140




అశుద్ధ భారత్
ఆంగ్లమూలం: భాషాసింగ్
తెలుగు: సజయ
వెల: రూ.150/-
ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నం.85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్-6, ఫోన్: 23521849




కళ్యాణ మంజీరాలు
హిందీమూలం: అమృతలాల్ నాగర్
తెలుగు: కౌముది
వెల: రూ.120/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 33-22-2, చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-4, ఫోన్: 0866-2430302




పుస్తకం: సాహితీ సుగంధం
రచన: డా॥ పోరెడ్డి రంగయ్య
ప్రచురణ: జ్యోతిర్మయి, సాహిత్య సమితి, హైదరాబాద్
ప్రతులకు: ప్రొ॥ ఎస్.వి.రామారావు, ఫ్లాట్ నెం.205, సాయి బాలాజీ రెసిడెన్సీ, చిత్ర లే-అవుట్, ఎల్బీనగర్, హైదరాబాద్, ఫోన్: 040-24031024



పుస్తకం: శ్రీ గురురాఘవేంద్ర శతకం
రచన: మల్లేపల్లి శేఖర్ రెడ్డి
వెల: రూ.50/-
ప్రచురణ: అమ్మ ప్రచురణలు
ప్రతులకు: యెన్నం రుక్మాంగదరెడ్డి, వెల్దండ, మహబూబ్‌నగర్,
సెల్: 9440309087

## పుస్తక పరిచయం

పుస్తక పరిచయం శీర్షిక ద్వారా వివిధ పుస్తకాలను పాఠకులకు పరిచయం చేసే ప్రయత్నం ఇది. ఈ వేదిక ద్వారా పాఠకులకు తమ పుస్తకాలను పరిచయం చేయాలనుకునే రచయితలు, ప్రచురణ సంస్థలు తమ పుస్తకాలు రెండు కాపీలను దిగువ చిరునామాకు పంపించవచ్చు. వీలు వెంట వాటిని ప్రచురిస్తాం. సమకాలీన సామాజిక అంశాలతో కూడిన కొత్త పుస్తకాలకు ప్రాధాన్యం.
పుస్తకాలు పంపించాల్సిన చిరునామా:

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND : "CHANDRAM" 490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
Fax: 040-27635644 Mobile: 9030626288
E-mail: deccanlandindia@gmail.com www.deccanland.com





Photographer : **Rama Veeresh Babu**

జనజాతరలో కానవచ్చే సందడి మదిపై చెరగని ముద్ర వేస్తుంది. ఆ ముద్రను పదిలం చేసి, జాతరలోని జనాన్ని కెమెరాలో బంధిస్తే ఆ ఫ్రేమ్ లివింగ్ హెరిటేజ్‌కు నిర్వచనంలా నిలుస్తుంది. ఈ సత్యం తెలిసిన ఫొటోగ్రాఫర్ రామ వీరేశ్‌బాబు.

ప్రత్యేక కథనం: 27, 28వ పేజీల్లో...













DECCAN LAND, Telugu Monthly Magazine 1- September - 2016
Postal Dates: 2nd & 3rd Every Month

RNI Regn. No. APTEL/2012/46784
Postal Permission, LII/RNP/HD/1167/2015-17




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar